17-05Pg1exHNWMJQE.qxdo/p:17-05Pg1exHNWMJQE.qxd 1/1/02 6:52 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
శ్రీకాకుళం fb.com/vaartha Digital
Published from Srikakulam ,Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem
17-5-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 106 పేజీలు: 16 వెల: 8.00

ఇరాన్‌పై మళ్లీ అమెరికా దాడులు

19, 20 తేదీల్లో పుతిన్ చైనా పర్యటన 5లో

## కొవ్వూరు బ్రిడ్జిపై ఘోర ప్రమాదం

- ఉపాధి కూలీలపై దూసుకెళ్లిన టిప్పర్ • ఐదుగురు మృతి • బాధితులకు అండగా నిలిచిన ఎమ్మెల్యే పంతం నానాజీ • మృతులకు రెండు లక్షల పరిహారం ప్రకటించిన డి.సిఎం పవన్ కల్యాణ్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,మే16,(ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా కొవ్వూరు బ్రిడ్జి పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు ఉపాధి హామీ కూలీలు మృతి చెందారు.టిప్పర్ కూలీలపై దూసుకెళ్లడంతో నలుగురు అక్కడి కక్కడే మృతి చెందగా మరొకరు చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. కాకినాడ రూరల్ మండలంలో శనివారం ఉదయం కొవ్వూరు బ్రిడ్జి సమీపంలో అత్యంత విషాదకరమైన సంఘటన చోటుచేసుకుంది.ఉపాధి పనులకు వెళ్తున్న కూలీలపై టిప్పర్ లారీ ఢీకొని నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఒకరు మరణించారు.మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రూరల్ మండల పరిధిలోని ఎన్ హెచ్ 216 రోడ్‌లో పొట్టకూటి కోసం కూలి పనికి వెళుతున్న ఉపాధి మహిళ కూలీలు కొవ్వూరు బ్రిడ్జి సమీపంలో రోడ్డు దాటుతుండగా అతివేగంతో వచ్చిన టిప్పర్ వారిపై దూసుకు వెళ్లింది. దీంతో రూరల్ మండలం చీడిగ గ్రామానికి చెందిన వాసంశెట్టి సత్యవతి,పాలిక కృష్ణవేణి, చెల్లూరు అన్నవరం,కాదా చిట్టమ్మ నలుగురు మహిళలు తీవ్ర గాయాలతో సంఘటనా స్థలంలో మరణించారు. సంఘటన స్థలంలో మృతదేహాలు రోడ్డుపై చల్లాచెదురుగా పడి హృదయ విదారకరంగా వుంది.ఈ సంఘటనను చూసిమిగిలిన ఉపాధి మహిళా కూలీలు కన్నీరు మున్నీరుగా విలపించారు. పొట్టకూటి కోసం కూలి పనికి వెళ్లి అనంత లోకాలకు వెళ్లడంతో చీడిగ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం >>2

# ఇక ఉత్తరాంధ్రకే వలసలు

ఆ స్థాయిలో వరదలా పెట్టుబడులు

మూడేళ్లలో నేరడి బ్యారేజ్ పూర్తి

స్వచ్ఛాంధ్ర కోసం ఆపరేషన్ క్లీన్‌స్వీప్

స్వచ్ఛ పథంతో రహదారులు శుభ్రం

స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

జిల్లాలోనూ 4 వాహనాల కాన్వాయ్‌తో సిఎం ప్రయాణం




శనివారం నరసన్నపేట తామ్రపల్లి స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సిఎం చంద్రబాబు. చిత్రంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు ఉన్నారు.



శనివారం నరసన్నపేట తామ్రపల్లి స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి హాజరైన ప్రజలు

**నరసన్నపేట (శ్రీకాకుళంజిల్లా), మే 16 ప్రభాతవార్త:** గొడ్డలి పార్టీతో ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వేటు పడిందని, ప్రజా ప్రభుత్వంలో ఉత్తరాంధ్ర నుంచి వలసలు వెళ్లకుండా ఉత్తరాంధ్రకే వలసలు వచ్చేలా సంకల్పం తీసుకున్నామని ముఖ్యమంత్రి చంద్ర బాబు స్పష్టంచేశారు. ఉత్తరాంధ్రతో పాటు రాయల సీమ కోస్తా జిల్లాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రోజుకు ఓ డ్రామాతో వచ్చే వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మళ్లీ రాష్ట్రంలో వైకుంఠపాళి వద్దని హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలోని తామ్రపల్లిలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ప్రజా వేదిక సభలో పాల్గొని ముఖ్యమంత్రి ప్రసంగించారు. 'రాష్ట్రం పరిశుభ్రంగా ఉండాలనే సంకల్పం తోనే స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టాం. స్వచ్ఛ పథం కార్యక్రమంలో భాగంగా గ్రామీణ అర్బన్ ప్రాంతాల్లోని రహదారులను శుభ్రపరిచేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ప్రతినెలా ఒకటో తేదీన పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొని అర్హులకు స్వయంగా పింఛన్లు అందించడం ద్వారా ఎంతో ఆనందం కలుగుతోంది. పేదరికం లేని సమాజం, ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం >>2

## నెదర్లాండ్స్ రాజు, రాణితో ప్రధానిమోడీ భేటీ

ద్వైపాక్షిక సంబంధాలు, భవిష్యత్ భాగస్వామ్యంపై చర్చలు

ప్రధాని సమక్షంలో టాటా ఎలక్ట్రానిక్స్, ఎఎస్ఎంఎల్ ఎంఒయుపై సంతకాలు



శనివారం హేగ్‌లో నెదర్లాండ్స్ రాజు విలెమ్ అలెగ్జాండర్, రాణి మాక్సిమాతో భేటీ అయిన ప్రధాని మోడీ

**హేగ్, మే 16:** ప్రధాని మోడీ ఐదు దేశాల పర్యటనలో భాగంగా శనివారం నెదర్లాండ్స్‌లో ప్రభుత్వ పెద్దలతో సమావేశమై కీలక చర్చలు జరిపారు. ఇక పర్యటనలో భాగంగా నెదర్లాండ్స్ రాజు విలెమ్ అలెగ్జాండర్, రాణి మాక్సిమాను రాజభవనంలో కలిశారు. ఈ సందర్భంగా భారత్ నెదర్లాండ్స్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, భవిష్యత్ భాగస్వామ్యంపై కీలక చర్చలు జరిగినట్లు మోడీ వెల్లడించారు. ఈ భేటీ అనంతరం ప్రధాని మోడీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. రాయల్ ప్యాలెస్‌లో రాజు విలెమ్ అలెగ్జాండర్, రాణి మాక్సిమాలను కలిశాను. సాంకేతికత, ఆవిష్కరణలు, సుస్థిర అభివృద్ధి, వాణిజ్యం, జల వనరులు వంటి కీలక రంగాల్లో భారత్ నెదర్లాండ్స్ స్నేహాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై అభిప్రాయాలను పంచుకోవడం ఆనందంగా అనిపించింది అని పేర్కొన్నారు.

అలాగే భారత్, నెదర్లాండ్స్ దేశాలు పరస్పర ప్రయోజనాలతో పాటు భవిష్యత్ తరాలకు అనుకూలమైన ప్రపంచ నిర్మాణం అనే ఉమ్మడి లక్ష్యంతో ముందుకు సాగుతున్నాయని మోడీ తెలిపారు. ఇక మోడీ సమక్షంలో టాటా ఎలక్ట్రానిక్స్, ఎఎస్ఎంఎల్ ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేశాయి.

## బంకుల్లో పెట్రోలు విక్రయాలు 16 గంటలే..

**విజయవాడ,మే 16,ప్రభాతవార్తప్రతినిధి:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా ఇంధన కొరత వేదిస్తోంది. భారతదేశంలోనూ పెట్రోల్, డీజిల్ కొరతతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. హర్మూజ్ జలసంధి వద్ద నౌకల రాకపోకలు నిలిచిపోవడంతో భారతదేశంకు ఇంధన సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఇటీవల ఎపి, తెలంగాణ రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ కొరతతో పలు ప్రాంతాల్లో బంకులు మూతపడ్డాయి. ప్రస్తుతం ఆ పరిస్థితుల నుంచి కాస్త తేరుకున్నా.. రానున్న రోజుల్లో ఇంధన కొరత తీవ్రమవుతోందని అధికారులు భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలకు కీలక సూచనలు చేశారు.ప్రజలు సొంత వాహనాల వాడకాన్ని తగ్గించి ప్రజారవాణా వ్యవస్థను వినియోగించుకోవాలని, కార్ పూలింగ్ విధానాన్ని, ఎలక్ట్రానిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని సూచించారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితులు తగ్గుముఖం పట్టేవరకు ప్రజలు పొదుపు చర్యలు పాటించాలని ప్రధాని కోరారు. ప్రధాని నరేంద్ర మోడీ సూచన మేరకు ఎపి ప్రభుత్వం పొదుపు చర్యలను పాటిస్తుంది. ఇప్పటికే సిఎం చంద్రబాబుతోపాటు మంత్రి నారా లోకేశ్, ఇతర మంత్రులు తమ కాన్వాయ్‌లోని వాహనాలను తగ్గించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ పెట్రోలియం ట్రేడర్ల సమాఖ్య కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పొదుపు చర్యలకు తమ వంతు మద్దతుగా నిలిచేందుకు ఎపిపిఎఫ్‌టి >>2

# సిబిఎస్ఇలో త్రిభాషా విధానం

26-27 విద్యాసంవత్సరం నుంచే అమలు

జులై 1 నుంచి 9,10 తరగతుల్లో 3 భాషలు అమలు



**న్యూఢిల్లీ, మే 16 :** దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ స్కూళ్లలో భాషా విధానంలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయి. రాబోయే 2026 జులై 1 నుంచి 9, 10 తరగతుల విద్యార్థులకు మూడు భాషల విధానాన్ని తప్పనిసరి చేస్తూ సిబిఎస్ఇ అధికారికంగా సర్క్యులర్ జారీ చేసింది. జాతీయ విద్యా విధానం, నేషనల్ కరిక్యులం ఫ్రేమ్‌వర్క్ ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్ సూచనలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు వెల్లడించింది. 2026-27 విద్యా సంవత్సరానికి గానూ ఎన్‌సిఇఆర్‌టి విడుదల చేసిన నూతన సిలబస్‌ను సమీక్షించిన తర్వాతే ఈ మార్పులు చేసినట్లు బోర్డు స్పష్టంచేసింది. ఏప్రిల్‌లోనే విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా జులై నుంచి ఒక పరివర్తన ప్రక్రియ ద్వారా దీనిని అమలు చేయనున్నారు. కొత్త నిబంధన ప్రకారం విద్యార్థులు అభ్యసించే మూడు భాషల్లోకనీసం రెండు భాషలు కచ్చితంగా స్థానిక భారతీయ భాషలై ఉండాలి. ఒకవేళ విద్యార్థులు ఫ్రెంచ్, జర్మన్ వంటి విదేశీ భాషలను చదవాలనుకుంటే మిగిలిన రెండు భాషలు భారతీయ భాషలైనప్పుడు మాత్రమే దానికి అనుమతిఉంటుంది. లేదా విదేశీ భాషను 4వ అదనపు భాషగానూ ఎంచుకోవచ్చు.

విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు గానూ ఈ నూతన విధానంలోని మూడో భాషకు 10వ తరగతిలో బోర్డు పరీక్షఉండదు. స్కూల్ స్థాయిలోనే ఇంటర్నల్ అసెస్‌మెంట్ ద్వారా దీనికి మార్కులు లేదా గ్రేడులు ఇస్తారు. అయితే ఇందులో పాస్ కావడం మాత్రం తప్పనిసరి. మిడిల్ స్టేజ్ (మిడిల్ స్కూల్), సెకండరీ స్టేజ్ చదువుల మధ్య లాంగ్వేజ్ స్కిల్స్, గ్రామర్, రీడింగ్ కాంప్రహెన్షన్ వంటి అంశాలలో 75నుంచి 80 శాతం వరకు పోలికలు ఉంటాయని బోర్డు పేర్కొంది. అందువల్ల ప్రస్తుతానికి 9వ తరగతి విద్యార్థుల కోసం ఎన్‌సిఇఆర్‌టి రూపొందించిన 6వ తరగతి స్థాయి ఆర్3 పాఠ్య పుస్తకాలనే ఉపయోగించనున్నారు. ఈ పుస్తకాలతో పాటు స్థానిక, రాష్ట్ర స్థాయి సాహిత్యానికి సంబంధించిన కథలు, కవితలను కూడా సిలబస్‌కు అదనంగా చేర్చాలని స్కూళ్లను ఆదేశించింది. దీనికి సంబంధించిన పూర్తి గైడ్‌లైన్స్‌ను 2026 జూన్ 15 నాటికి సిబిఎస్ఇ విడుదల చేయనుంది. జులై 1లోపు 19 అధికారిక భారతీయ భాషలకు సంబంధించిన 6వ తరగతి ఆర్3 పాఠ్య పుస్తకాలను బోర్డు అందుబాటులోకి తీసుకురానుంది. తాజా నిర్ణయంతో భారతీయ భాషలను ప్రవేశపెట్టడం వల్ల స్కూళ్లలో అర్హులైన ఉపాధ్యాయుల కొరత ఏర్పడే అవకాశం ఉందని బోర్డు గుర్తించింది. దీని కోసం పాఠశాలలకు కొన్ని కీలకమైన మినహాయింపులు, ప్రత్యామ్నాయ మార్గాలను సూచించింది. ఒకే ప్రాంతంలో ఉన్న వేర్వేరు సిబిఎస్ఇ పాఠశాలలు పరస్పరం టీచర్లను షేర్ చేసుకోవచ్చు డిజిటల్ లేదా >>2

## ఐసెట్‌లో 91.41% ఉత్తీర్ణత

**విజయవాడ,మే 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో నిర్వహించిన ఎపిఐసెట్ 2026ఫలితాలను మంత్రి నారా లోకేష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా పరీక్షలో మొత్తం 91.41 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో ప్రవేశాలకోసం నిర్వహించిన ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్ నంబర్ ద్వారా ఫలితాలను చెక్ చేసుకోవచ్చని సూచించారు. ర్యాంకు కార్డుకోసం అధికారిక పోర్టల్‌ను సందర్శించాలి.హోమ్‌పేజీలో కనిపించే డౌన్‌లోడ్ ర్యాంక్ కార్డ్‌పై క్లిక్ చేయాలి. లాగిన్ వివరాలైన రిజిస్ట్రేషన్ నెంబర్, హాల్ టికెట్ నెంబర్ లను ఎంటర్ చేయాలి.సబ్మిట్ బటన్‌ను క్లిక్ చేయాలి. మీ ర్యాంక్‌కార్డ్ స్క్రీన్‌పై కనిపిస్తుంది. దానిని డౌన్‌లోడ్ చేసుకొని భవిష్యత్తు అవసరాల కోసం ప్రింట్ తీసుకొని పెట్టుకోవచ్చు.

## బండి భగీరథ్ అరెస్టు

హైకోర్టులో మధ్యంతర బెయిలు తిరస్కృతి 2లో



## వెండి దిగుమతులపై కేంద్రం ఆంక్షలు

ఇక అనుమతులు, లైసెన్స్ తప్పనిసరి

**న్యూఢిల్లీ, మే 16:** బులియన్‌రంగంలో పెరిగిపోతున్న బంగారం, వెండిధరలను కట్టడిచేసేందుకు కేంద్రం ఉపక్రమించింది. బంగారంపై దిగుమతి సుంకాలను భారీగా పెంచిన కేంద్రం వెండిపైనా ఆంక్షలు ప్రకటించింది. కిలో ఒక్కింటికి మూడులక్షలవరకూ పలుకుతున్న వెండి వినియోగం భారీగా పెరుగుతుండటంతో దిగుమతులు కూడా పెరిగాయి. ఫలితంగా డాలర్ చెల్లింపులు పెరిగి రూపాయి విలువలు రికార్డు కనిష్టానికి పడిపోతున్నాయి. తాజాగా డాలర్‌తో చెలామణి భారత్ కరెన్సీ 96 రూపాయలకు పడిపోయిన సంగతి >>2

## పారదర్శకంగా 'శ్రీవాణి' ఆన్‌లైన్

భక్తుల నుండి వచ్చే సలహాలు, సూచనలమేరకు టిసిఎస్ సాఫ్ట్‌వేర్ మార్పు

శ్రీవాణి టికెట్లు, ఐటీ వ్యవస్థపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా సత్య దూరం:టిటిడి

**తిరుమల,మే 16ప్రభాతవార్తప్రతినిధి:** 2019 లో టిటిడిలో తీసుకొచ్చిన సాఫ్ట్ వేర్‌నే ఇప్పటికీ వినియోగంలో ఉంచి ఎప్పటికప్పుడు భక్తుల నుండి వచ్చే సలహాలు, సూచనల మేరకు కాలానుగుణంగా టిసిఎస్ ద్వారా సాఫ్ట్ వేర్‌ను మార్పు చేయడం జరుగు తోందని టిటిడి ప్రకటనలో పేర్కొంది.శ్రీవాణి టిక్కెట్లు జారీలో ఎప్పటికప్పుడు కాలాను గుణంగా టిసిఎస్ ద్వారా సాఫ్ట్ వేర్‌ను మార్పు చేయడం జరుగుతోంది. భక్తులకు టిటిడి వ్యవస్థీకృతంగా, పారదర్శకంగా శ్రీవాణి ఆన్ లైన్ విధానాన్ని అమలు చేయడం జరుగుతోందని వెల్లడించింది. భక్తుల విజ్ఞప్తి మేరకు ఆఫ్ లైన్ ద్వారా తిరుమలలో ఏరోజుకారోజు జారీ చేసే విధానాన్ని మార్పు చేయడం జరిగింది. మార్పు చేసిన ఈ విధానంలో ముందు ఎవరైతే సాఫ్ట్ వేర్ అప్లికేషన్ యాక్సెస్ చేస్తారో వారికే టికెట్ వచ్చే విధంగా సాఫ్ట్ వేర్ తయారు చేయడమైనది. రోజుకి వేల సంఖ్యలో టిక్కెట్లు పొందడానికి భక్తులు ప్రయత్నిస్తున్నారు. దీనివల్ల మొదటి ఒకటిన్నర నిమిషంలోపే ముందు వచ్చిన వారికి ముందు ఇచ్చే విధానంలో లాక్ చేయడం జరుగుతోంది. తదుపరి పేమెంట్ గేట్ వేలో విజయవంతంగా డబ్బులు చెల్లించినవారికి టికెట్లు జారీ చేయడం జరుగుతోంది. ఏదైనా కారణం వల్ల డబ్బులు చెల్లింపులు జరగకపోతే ఆ టికెట్లను తిరిగి పూల్‌లోకి తీసుకురావడం జరుగుతోంది. ఈ ప్రకియ ఐఆర్‌సిటిసి, ప్రభుత్వ ఇతర అడ్వాన్స్ బుకింగ్ సర్వీసుల్లో ప్రవేశపెట్టబడి ఉన్నది. ఈ విధానంలో మానవ ప్రమేయం పూర్తిగా తీసివేయడం జరిగింది. సిస్టమ్ ఆటోమేటిక్‌గా పని చేయడం జరుగుతుంది. పది నిమిషాల తర్వాత టిక్కెట్లు జారీ చేయడం వాస్తవమే. పేమెంట్ గేట్ వే వద్ద చెల్లింపు సమయంలో >>2

## మంత్రులకు శాఖలు కేటాయించిన తమిళ సిఎం విజయ్

హోం, మహిళా శిశు సంక్షేమం, రెవెన్యూ సిఎం వద్దనే.. 5లో



## ఎక్సైజ్ శాఖలో వినూత్న మార్పులు

అవినీతికి తావు లేకుండా కలెక్టర్ల ఆధ్వర్యంలో షాపుల కేటాయింపు

ఎన్నికల హామీ మేరకు కల్లుగీత కార్మికులకు 10శాతం షాపులు

**విజయవాడ,మే 16, ప్రభాతవార్త ప్రతినిధి:** రెండేళ్ల క్రితం ఎపిలో మద్యం విధానం అంటే భయం. అనుమానం... అసంతృప్తి.... దోపిడీ అనే భావన ఉండేదని ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది.అదే ఎక్సైజ్ శాఖలో పారదర్శకత, నాణ్యత, టెక్నాలజీకి పెద్దపీట వేస్తూ... ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ అనేక సంస్కరణలతో ఎక్సైజ్ శాఖ గాడిలో పడిందన్నారు.దగ్గరదగ్గర రెండేళ్ల ఎక్సైజ్ శాఖలో చోటు చేసుకున్న మార్పులు,సంస్కరణలపై మంత్రి రవీంద్ర ఒక ప్రకటన విడుదల చేసారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన వెంటనే సంస్కరణలు తీసుకురావాలని భావించిన శాఖల్లో ఎక్సైజ్ శాఖ ప్రధానంగాఉంది. దీంతో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎక్సైజ్ శాఖ ప్రక్షాళనపై సిఎం చంద్రబాబు ఫోకస్ పెట్టారు. ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. ఆ దిశగా ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకుంది. ఎస్‌యుబిని రద్దు చేసి ఎక్సైజ్ శాఖ మొత్తాన్ని ఏకీకృతం చేసింది. ఎక్సైజ్ శాఖలో చోటుచేసుకున్న మద్యం కుంభకోణంపై శ్వేత పత్రాన్ని ముఖ్యమంత్రి విడుదల చేశారు. గతంలో అమలు చేసిన ఆన్ లైన్ ఆర్డర్ ఫర్ సప్లై విధానాన్ని ఎక్సైజ్ శాఖ తీసుకొచ్చింది. ఐజీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో సిట్‌ఏర్పాటు చేసి అక్రమాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశాలిచ్చింది. నూతన మద్యంపాలసీ (2024-2026) ప్రకటించి లాటరీ ద్వారా ప్రైవేటు వ్యక్తులకు మద్యం షాపులు కేటాయించారు. పారదర్శకమైన విధానాల ఫలితంగా దాదాపు 90 వేల దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల రూపంలో ప్రభుత్వానికి రూ.1800 కోట్ల ఆదాయం సమకూరింది. 10 శాతం మేర షాపులు అంటే... 354 దుకాణాలను కల్లుగీత కార్మికులకు కేటాయించారు. గత ప్రభుత్వ హయాంలో ఎఆర్ఇటి పేరుతో ప్రజలపై >>2



శనివారం నరసన్నపేట తామ్రపల్లి స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో హెల్మెట్ ధరించి బుల్లెట్ వాహనం అధిరోహించిన సిఎం చంద్రబాబు

# బండి భగీరథ్ అరెస్టు

## హైకోర్టులో మధ్యంతర బెయిలు తిరస్కృతి

**హైదరాబాద్, మే 16, ప్రభాతవార్త:** ఫోక్సో కేసులో నిందితుడుగా వున్న బండి భగీరథ్‌ను నాటకీయ పరిణామాల సైబరాబాద్ పోలీసులు శని వారం రాత్రి అరెస్టు చేశారు. శివార్లలోని హిమాయత్‌సాగర్ వద్ద గల పోలీసు అకాడమి సమీపంలో భగీరథ్ వున్న ప్రాంతంపై ఈ కేసును వి చారిస్తున్న సిట్ పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి హైకోర్టులో మధ్యంతర బెయిల్ పిటిషన్ తిరస్కరణకు గురవడం, వెను వెంటనే పోలీసులు లుకవుట్ నోటీసులు జారీ చేసిన దరిమిలా శనివారం ఉదయం నుంచి కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. హైకోర్టులో మధ్యంతర బెయిల్ లభించకపోవడంతో శనివారం ఉదయమే భగీరథ్ పోలీసులకు లొంగిపోతాడని ప్రచారం జరిగినా అలా జరగలేదు. పోలీసు ు కూడా మధ్యాహ్నం వరకు వేచిచూసి ఆ తరువాత లుకవుట్ నోటీసులు జారీచేసి భగీరథ్ దేశం విడిచి పారికోకుండా విమానాశ్రయాలను అప్రమత్తం చేశారు. ఇదే సమయంలో అతన్ని అరెస్టు చేసేందుకు ఐదు ప్రత్యేక బృందాలను రంగంలో దించారు. పోలీసు బృందాలు హైదరాబాద్, ఢిల్లీ, కరీంనగర్‌లో బండి సంజయ్ నివాసాల్లో సోదాలు చేబట్టిన తరువాత రాత్రి ఎనిమిది గంటల సమయంలో భగీరథ్‌ను పోలీసు అకాడమి వద్ద అరెస్టు చేశారు. అనంతరం భగీరథ్‌ను పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌కు రాత్రి తొమ్మిది గంటల సమయంలో భద్రత మధ్య తీసుకువచ్చారు. అయితే భగీరథ్ చట్టంపై గౌరవంతో తానే లొంగిపోయాడని అతని తండ్రి కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. కాగా అర్ధరాత్రి సమయంలో పోలీసులు భగీరథ్‌ను న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచి జుడిషియల్ రిమాండుకు తరలించారు.

మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడుగా వున్న బండి భగీరథ్‌ను ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల ఎనిమిదవ తేదీన 17 ఏళ్ల బాలిక ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో భగీరథ్‌పై ఫోక్సో కేసు నమోదవడం తెలిసిందే. ఈ కేసు నమోదు తరువాత భగీరథ్ పరారీలో వుండడంతో పాటు బాలికతో పాటు ఆమె తల్లిదండ్రులపై కరీంనగర్‌లో బ్లాక్ మెయిల్ కింద ఫిర్యాదు చేయగా వారిపై అక్కడ కేసు నమోదయ్యింది. అయితే పేట్ బషీరాబాద్‌లో భగీరథ్‌పై నమోదైన ఫోక్సో కేసు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపడంతో పాటు రా జకీయంగా దుమారం రేగడంతో దీని విచారణకు సర్కారు సిట్ ఏర్పాటు చేసింది. సిట్ అధిపతిగా మహిళా డిసిపిని నియమించారు. దీని తరు వాత ఈ కేసు విచారణ వేగం పుంజుకుని భగీరథ్‌ను విచారణకు రావాలని నోటీసులు జారీ చేశారు. అయితే భగీరథ్ విచారణకు రాకుండా హై కోర్టులో కేసును కొట్టి వేయాలని, మధ్యంతర బెయిల్ ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశాడు. విచారణకు హాజరయ్యేందుకు గడువు కావాలని పోలీసులను కోరాడు. హైకోర్టులో జరిగిన మధ్యంతర బెయిల్ పిటిషన్ శుక్రవారం అర్ధరాత్రి సమయంలో విచారణ తిరస్కరణకు గురవడంతో భగీరథ్‌ను అరెస్టు చేయాలని సిట్ పోలీసులు నిర్ణయించారు. దీని తరువాత శనివారం ఉదయం నుంచి వేగంగా పరిణామాలు చోటుచేసుకున్నాయి. మొదట భగీరథ్ దేశం వదిలి పారిపోకుండా లుకవుట్ నోటీసులు జారీ చేయడంతో పాటు విమానాశ్రయాలలో నిఘా పెంచారు. మరోవైపు భగీరథ్‌ను అరెస్టు చేసేందుకు ఐదు ప్రత్యేక బృందాలను రంగంలో దింపారు. ఈ ప్రత్యేక బృందాల పోలీసులు వెంటనే రంగంలో దిగి బంజారాహి ల్స్‌లోని బండి సంజయ్ నివాసంతో పాటు ఢిల్లీ, కరీంనగర్‌లలోని ఆయన ఇళ్లలోనూ సోదాలు జరిపారు. గడచిన కొన్ని రోజులుగా భగీరథ్ సన్నిహితంగా వున్న వారి వివరాలు సేకరించిన పోలీసులు అందులో కొందరిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో పాటు భగీరథ్ సెల్‌ఫోన్‌తో పాటు కుటుంబ సభ్యుల ఫోన్‌ల ట్రాకింగ్ ద్వారా ప క్కా సమాచారం సేకరించిన పోలీసులు దాని ఆధారంగా విచారణ చేబట్టారు.

# పెట్రోలు విక్రయాలు 16 గంటలే..

>> ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పెట్రోల్, డీజిల్ బంకుల నిర్వహణ సమయాలను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే పరిమితం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అత్యవసర సేవల వాహనాలకు (అంబులెన్సులు, పోలీస్ వాహనాలు మొదలైనవి) మాత్రం ఎల్లప్పుడూ ఇంధనం అందుబాటులో ఉంచుతామని సమాఖ్య స్పష్టం చేసింది. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రవి గోపాలకృష్ణ నేతృత్వంలోని ప్రతినిధి బృందం పౌరసరఫరాల శాఖ కమిషనర్‌ను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం నుంచి ఆమోదం లభిస్తే ఇక నుంచి ఏపిలో పెట్రోల్ బంకులు ఉదయం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నాయి.

# ఎస్ఆర్ఎం వర్సిటీలో ఘరానా మోసం

**విజయవాడ,మే 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్ఆర్ఎం వర్సిటీ(మంగళగిరి)లో ఘరానా మోసం చోటుచేసుకుంది. వెబ్ఎక్స్ స్టార్టప్ కంపెనీలో ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికి విద్యార్థుల నుంచి రూ.కోటిన్నర వరకూ మోసగాళ్లు వసూలు చేశారు. డబ్బు వసూలు చేసిన వారు కడపకు చెందిన విజయనరసింహ, విశాఖకు చెందిన వరుణ్‌లుగా పోలీసులు గుర్తించారు. విజయనరసింహ, వరుణ్‌పై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా విషయం వెలుగులోకి వచ్చింది. నిందితులపై పోలీసులు కేసు నమోదు చేసారు.

# ప్రభుత్వాసుపత్రిలో తొలగించిన కాలును లాక్కెళ్లిన కుక్క

## ఘటనపై అధికారులకు సంజాయిషీ నోటీసులు జారీ

**విజయవాడ, మే 16,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో తొలగించిన కాలును కుక్క లాక్కెళ్లిన ఘటనపై ప్రభుత్వం సీరియస్ అయింది. దీన్ని సీరియస్‌గా పరిగణించిన ప్రభుత్వం పర్యవేక్షణ లోపం కింద ఆర్ఎంవోతో సహా ఆస్పత్రి సూపరింటెండెంట్‌లకు షోకాజ్ నోటీసులను జారీ చేసింది. వ్యర్థాల తరలింపు ప్రైవేటు సంస్థకు అప్పగిస్తూ నోటీసు జారీ చేయడం గమనార్హం. అంతేకాకుండా ఆస్పత్రిలో పని చేస్తున్న శానిటేషన్ ఉద్యోగిని విధులనుంచి అధికారులు తప్పించారు. మొత్తం ఘటనలో క్రియాశీలక బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎపి వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ డీఎంవోకు ఆదేశాలు జారీ చేసారు.

# రాష్ట్రంలో పార్టీ ఆఫీసుల భూముల లీజు పెంపు...

**విజయవాడ మే 16 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో జాతీయ, గుర్తింపు పొందిన ప్రాంతీయ రాజకీయ పార్టీల కార్యాలయాల భూముల లీజుపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆ భూముల లీజు కాలపరిమితిని 33 ఏళ్ల నుండి 66 ఏళ్లకు పొడిగిస్తూ గత జీవోలో సవరణలు చేసింది. ఈ నిబంధనలు గతేడాది నవంబర్ 13 నుంచే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. ఇందులో భాగంగానే కర్నూలు జిల్లా కేంద్రంలో టిడిపి పార్టీ ఆఫీసు నిర్మాణానికి 1.5 ఎకరాల భూమిని లీజుకు ఇస్తూ రెవెన్యూశాఖ తాజాగా జీవో జారీ చేసింది.

# కొవ్వూరు బ్రిడ్జిపై ఘోర ప్రమాదం

>> ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి రూరల్ సిఐ చైతన్యకృష్ణ, ఇంద్రపాలెం ఎస్సై వీరబాబు చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎమ్మెల్యే పంతం నానాజీ తనయుడు సందీప్ ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను ఓదార్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తీవ్ర గాయాలు పాలైన పాలిక నాగమణి, మట్టపర్తి అరుణ్ కుమారిలను కూడా వారు పరామర్శించారు. స్థానిక ఎమ్మెల్యే నానాజీ హుటాహుటిన కాకినాడ జనరల్ హాస్పిటల్‌లోని మార్చురి వద్ద కుటుంబ సభ్యులను పలకరించి ఓదార్చారు. అంత్యక్రియలు నిమిత్తం మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున ఎమ్మెల్యే నానాజీ అందజేశారు. ప్రభుత్వపరంగా మృతుల కుటుంబాలకు అన్ని విధాలుగా ఆదుకోవడం జరుగుతుందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం సహాయం కూడా అందే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారికి భరోసానిచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని హాస్పిటల్ వైద్యులను ఎమ్మెల్యే నానాజీ ఆదేశించారు. సంఘటన వివరాలను జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు సమాచారం ఇచ్చిన వెంటనే మృతుల కుటుంబాల ఒక్కొక్కరికి రెండు లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు రూరల్ ఎమ్మెల్యే నానాజీ తెలిపారు.

# సిబిఎస్ఇలో త్రిభాషా విధానం

>> ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ మిశ్రమ పద్ధతుల్లో క్లాసులు నిర్వహించవచ్చు. రిటైర్ అయిన లాంగ్వేజ్ టీచర్లను తిరిగి నియమించుకోవడానికి లేదా ఆయా భాషల్లో పీజీ పూర్తిచేసిన అర్హులైన అభ్యర్థులను పార్ట్ టైమ్‌గా నియమించుకోవడానికి స్కూళ్లకు అనుమతి ఉంటుంది. పాఠశాలలన్నీ తాము ఆఫర్ చేయబోయే మూడో భాష వివరాలను 2026 జూన్ 30లోగా సిబిఎస్ఇ ఒయాసిస్ పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలని బోర్డు ఆదేశాలు జారీ చేసింది.

## వారం - వర్జ్యం

17-05-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, రోహిణి కార్తె
పాడ్యమి రా.9.41
కృత్తిక మ.2.32
వర్జ్యం : తె.4.33-తె.5.57
దు.సా.4.44-సా.5.36
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** వ్యక్తి గత పురోభివృద్ధి బాగుంటుంది. అంతర్గత శత్రువులను మాత్రం గుర్తించలేరు. విలువైన సమాచారం అందుకొంటారు.

**వృషభం:** స్థిరాస్తులకు సంబంధించిన వ్యవహారాలలో మధ్యవర్తులను ఆశ్రయించడం వలన లబ్ధిని పొందుతారు.

**మిథునం:** ఈరోజు స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలను నిర్వహిస్తారు. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

**కర్కాటకం:** క్రీడలపట్ల ఆసక్తిని కనబరుస్తారు. రాజకీయ రంగంలోని వారితో పరిచయాలు ఏర్పడుతాయి.

**సింహం:** ఆరంభ శూరత్వాన్ని కలిగి ఉంటారు. ఎక్కువగా ఊహాలో కాలంలో విహరిస్తారు. స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండండి.

**కన్య:** వాస్తవ పరిస్థితులకు, మీ అంచనాలకు పొంతన ఉండదు. మీకు రావలసిన ఋణాలు మంజురవుతాయి. వ్యాపారాలు అభివృద్ధి.

**తుల :** ఆహార, ఆరోగ్యపరమైన జాగ్రత్తలను కూడా వహించవలసి ఉంటుంది. స్వల్ప ధనలాభం పొందుతారు. వస్త్రలాభం.

**వృశ్చికం:** మీకు ప్రత్యక్షంగానీ, పరోక్షంగా గానీ ఉపకరించే ఒక లేఖ చేరవలసిన చోటుకు చేరుతుంది. కొత్తపరిచయాలు.

**ధనుస్సు:** శుభకార్య సంబంధిత వ్యవహారాలు సానుకూల పడతాయి. అర్థం లేని వివాదాలు చోటు చేసుకుంటాయి. ఆరోగ్యం జాగ్రత్త.

**మకరం:** ఒక సమస్య తీరితే మరో సమస్యను పరిష్కరించుకోవలసి వస్తుంది. వత్తిడికి లోనవుతారు. భూములు కొనుగోలు.

**కుంభం:** ప్రత్యర్థి వర్గం బలపడుతున్నట్లుగా భావిస్తారు. వారిని ఎదుర్కొనటానికి కావలసిన వ్యూహాలను అవలంభిస్తారు.

**మీనం:** ఆత్మీయ వర్గంతో చేసే చర్చలు ఆహ్లాదభరితంగా సాగుతాయి. పరపతి పెంపొందిస్తారు. పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శనివారం నెదర్లాండ్స్‌లోని హేగ్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోడీ

# ఎక్సైజ్ శాఖలో వినూత్న మార్పులు

>> భారం మోపారు. గతంలో మద్యం షాపుల్లో డిజిటల్ లావాదేవీలు 0.6 శాతం మాత్రమే ఉంటే ప్రస్తుతం 45శాతానికి చేర్చడం ద్వారా పారదర్శకతకు అత్యధిక ప్రాధాన్యమిచ్చింది ఎక్సైజ్ శాఖ.

**అందుబాటులోకి ప్రీమియం బ్రాండ్లు**

అన్ని బ్రాండ్లకు పారదర్శకంగా అవకాశాలు కల్పించడమే లక్ష ్యంగా టెండర్ కమిటీ ఏర్పాటు చేశారు. ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి ఎక్సైజ్ శాఖ అవకాశం కల్పిస్తోంది. అంతర్జాతీయ బ్రాండ్లను కూడా అందుబాటులోకి తెచ్చే లక్షంతో రాష్ట్ర వ్యాప్తంగా 11 ప్రీమియం స్టోర్‌లను ఏర్పాటు చేసింది ఎక్సైజ్ శాఖ. నాటు సారా, కల్తీ మద్యం వైపు ఎవరూ వెళ్లకుండా చేయడం లక్ష ్యంగా రూ.99 బ్రాండ్ అందుబాటులోకి వచ్చింది. కూటమి ప్రభుత్వ హయాంలో పారదర్శకమైన విధానం అమలు చేయడం, జాతీయ, అంతర్జాతీయ, ప్రీమియం బ్రాండ్లు అందుబాటులోకి తీసుకురావడం, పొరుగు రాష్ట్రాలతో సమానంగా ధరలు ఉండడంతో అక్రమ రవాణా దాదాపు నిలిచిపోయిందనే చెప్పాలి. ఫలితంగా 2024-25లో రూ.28,846 కోట్లు, 2025-26లో రూ.29,042 కోట్ల మేర ఎక్సైజ్ రెవెన్యూ వచ్చింది. మద్యం షాపుల నుండి బార్‌లకు మద్యం అక్రమ రవాణా నివారించేలా బార్‌లలో కూడా ఎమ్మార్పీ విధానాన్ని అవలంభించేలా చర్యలు తీసుకుంది కూటమి ప్రభుత్వం. డిస్టిలరీల నుంచి షాపుల వరకు ప్రతి మద్యం బాటిల్ ట్రాక్ అండ్ ట్రేస్ విధానంలో పర్యవేక్షించేలా ఎక్సైజ్ శాఖ జాగ్రత్తలు తీసుకుంది.

**13 రకాల పరీక్షలు... 30 వేల శాంపిళ్ల టెస్టులు..**

ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి మద్యం బ్యాచ్‌ను 13 రకాలైన పరీక్షలు నిర్వహించిన అనంతరమే మార్కెట్లోకి వెళ్లేలా ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టారు. అందుకోసం విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, చిత్తూరు, కర్నూలులో అత్యాధునిక ల్యాబరేటరీలను ఏర్పాటు చేసింది ప్రభుత్వం. గతంలో ఏటా సగటున 14 వేల పరీక్షలు మాత్రమే నిర్వహిస్తే, ప్రస్తుతం ప్రతి నెల సగటున 30 వేల పరీక్షలు చేస్తూ నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకుంటోంది. గంజాయి నిర్మూలన కోసం ఈగిల్ టీమ్స్ ఏర్పాటు చేయడం... మద్యం ఆదాయంలో 2 శాతం బడ్జెట్ ఈగిల్ వ్యవస్థకు కేటాయించడం వంటి చర్యలు ఎక్సైజ్ శాఖ చేపడుతోంది. ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం వినియోగ దారులు ఎవరైనా, ఎక్కడైనా బాటిళ్లను స్కాన్ చేసే అవకాశం కల్పించారు. మద్యం బాటిళ్ల తయారీ నుంచి షాపుకు వచ్చే వరకు ప్రతి సమాచారం తెలుసుకునే వెసులుబాటును ఎక్సైజ్ శాఖ కల్పించింది. ఎక్సైజ్ ఐ యాప్ ద్వారా మద్యం షాపుల్లోని సిసి కెమెరాలన్నింటినీ అనుసంధానించి ఏ షాపును ఎప్పుడు తెరుస్తున్నారు, ఎప్పుడు మూస్తున్నారోననే అంశంపై నిరంతరం మానిటర్ చేస్తున్నారు.

# వెండి దిగుమతులపై కేంద్రం ఆంక్షలు

>> తెలిసిందే. పరిస్థితిని సమీక్షించిన కేంద్రం ముందు దిగుమతులను కట్టడిచేసేందుకు ఉపక్రమించి వెండి దిగుమతులపై కేంద్రం కఠిన ఆంక్షలు విధించింది. విదేశీ వాణిజ్యం డైరెక్టరేట్ జనరల్ నోటిఫికేషన్ ప్రకారం, కేంద్ర ప్రభుత్వం వెండి బార్ల దిగుమతులపై కఠిన నిబంధనలు అమలు చేసింది. ఇప్పటివరకూ స్వేఛ్ఛా కేటగిరీలో ఉన్న కీలక వెండి దిగుమతులను ఇప్పుడు ఆంక్షల జాబితాలోకి మార్చింది. సవరించిన విధానం ప్రకారం, 99.9 శాతం లేదా అంతకంటే ఎక్కువ శుద్ధి కలిగిన వెండి బార్లు, అలాగే కొన్ని ప్రత్యేక హెచ్ఎస్ కోడ్‌ల కింద వచ్చే ఇతర వెండి బార్ల దిగుమతులకు ఇకపై ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి కానున్నాయి. గతంలో ఇవి నిబంధనలకు లోబడి స్వేచ్ఛగా దిగుమతి చేసుకునే అవకాశం ఉండేది. శనివారం విడుదల చేసిన నోటిఫికేషన్ ద్వారా ఈ మార్పులను అధికారికంగా ప్రకటించారు. ఐటిసి హెచ్ఎస్ కోడ్‌లు 71069221 మరియు 71069229 కింద వచ్చే వస్తువుల దిగుమతి విధానాన్ని 'స్వేఛ్ఛా' కేటగిరీ నుంచి 'ఆంక్షల' కేటగిరీకి మార్చినట్లు పేర్కొన్నారు. డీజీఎఫ్‌టీఈ ప్రకారం, సెమీ మాన్యుఫాక్చర్డ్ కేటగిరీలోని 99.9 శాతం లేదా అంతకంటే ఎక్కువ వెండి కలిగిన బార్లు మరియు ఇతర కేటగిరీల వెండి బార్లు రెండింటినీ ఇకపై పరిమిత దిగుమతుల జాబితాలో చేర్చారు. ఈ దిగుమతుల జాబితా వెండి ఉత్పత్తులు ఐటిసి హెచ్ఎస్ కోడ్‌లు 71069221 మరియు 71069229 కింద వచ్చే వస్తువుల దిగుమతి విధానాన్ని స్వేఛ్ఛా కేటగిరీనుంచి ఆంక్షలతో కూడిన దిగుమతుల కేటగిరీలోకి చేర్చామని విదేశీ వాణిజ్య డైరెక్టరేట్‌జనరల్ (డిజిఎఫ్‌టి) ప్రకటించింది. ఇటీవల విలువైన లోహాల దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఈ వారంలోనే అడ్వాన్స్ ఆథరైజేషన్ పథకం కింద బంగారం దిగుమతులను ఒక్కో లైసెన్సుకు 100 కిలోలకే పరిమితం చేసింది. అలాగే ఆభరణాల ఎగుమతిదారులపై అనుసరణ నిబంధనలను మరింత కఠినతరం చేసింది. ప్రపంచంలోనే వెండి వినియోగంలో భారత్ అగ్రస్థానంలో ఉండగా, విలువైన లోహాల దిగుమతుల్లో కూడా భారతదేశం ప్రముఖ దేశంగా కొనసాగుతోంది. ఇటీవలి కాలంలో చిప్స్ పరిశ్రమల్లోను, సోలార్ ప్యానెళ్ల తయారీలోను వెండి పారిశ్రామిక వినియోగం భారీగా పెరిగింది. ఆభరణాల్లోకంటే పారిశ్రామిక వినియోగం పెరుగుతుండటంతో వెండిపైనా ఇన్వెస్టర్లు పెట్టుబడులు కుమ్మరిస్తున్నారు.

# పారదర్శకంగా 'శ్రీవాణి' ఆన్‌లైన్

>> సాంకేతిక లోపం వల్లగానీ, ఇతర కారణాల చేత టిటిడికి డబ్బు జమ అయినట్లు మెసేజ్ రాకుంటే అలాంటి టికెట్లను తిరిగి పూల్‌లోకి తీసుకొచ్చి భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చేలా సాఫ్ట్ వేర్ అభివృద్ధి చేయబడంది. జిఎం ఐటీగా కనీస అర్హతలు లేని వ్యక్తిని నియమించారని చెప్పడం వాస్తవ విరుద్ధం. ఉన్న వ్యక్తికి ఎం.టెక్ (కంప్యూటర్ సైన్స్) ఎం.ఎస్ (ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్) అర్హతతో పాటుగా 32 సంవత్సరాలుగా ఐటీలో సుదీర్ఘ అనుభవం ఉండటంతో స్టాప్ గ్యాప్ అరేంజ్మెంట్ కింద వారిని ఐటీ జిఎంఎఫ్ఏసీగా మాత్రమే నియమించడం జరిగింది.

**ఇక సాఫ్ట్వేర్ కు సంబంధించి టిసిఎస్ కొత్తగా సాఫ్ట్ వేర్ తీసుకురాలేదు.**

భక్తుల సౌకర్యార్థం టిటిడి ఆటో ఫిల్లింగ్, కాపీ,పేస్ట్ ప్రక్రియ విధానాలను పూర్తిగా రద్దు చేసి అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తోంది. తర్వాత టిటిడిలో ఉన్న అన్ని సిస్టమ్స్ ఆడిట్‌లను ఎపి టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్) ద్వారా ప్రతి సంవత్సరం ఆడిట్ చేయించడం జరుగుతోంది. శనివారం టిటిడి మాజీ చైర్మన్ ప్రదర్శించిన శ్రీవాణి టికెట్ బుకింగ్ ప్రక్రియ పూర్తి అవగాహనతో చేసినట్లు అనిపించలేదు. వారు టికెట్ బుక్ చేసుకునే సమయంలో పేమెంట్ గేట్ వే వరకు వెళ్లడం జరిగింది. దీనిని వారు సాంకేతిక లోపం అని తెలిపి ఉన్నారు. కానీ వారి అకౌంట్‌లో సరిపడ నగదు లేనందు వల్ల పేమెంట్ గేట్ వే దగ్గర వారి ట్రాన్సాక్షన్ రిజెక్ట్ చేయబడింది. ఆ తరువాత వారు తిరిగి ప్రయత్నించడం వల్ల అది సాంకేతికంగా కొత్త ప్రయత్నం కింద లెక్కింపబడుతుంది. అప్పటికే వారి ముందున్న వారిని సిస్టమ్ పరిగణలోకి తీసుకుంటుంది. దీనితో వీరు వెయిటింగ్ లిస్టులో వెనుకబడి ఉన్నారు. ఈ అంశాలు సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వారికి మాత్రమే అర్థమవుతుంది.

# నేడు 'తాలీమ్‌ఏహునర్' పథకం అడ్మిషన్లకు ప్రవేశపరీక్ష

## అభ్యర్థులకు 'ఆల్ ది బెస్ట్' చెప్పిన మంత్రి ఫరూక్

**విజయవాడ,మే 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, వక్ఫ్ బోర్డు ద్వారా "తాలీమ్‌ఏహునర్" పథకం కింద ప్రతిభావంతులైన పేద ముస్లిం విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ రెసిడెన్షియల్ ఇంటర్ విద్య అడ్మిషన్ల కోసం ఈనెల 17 వ తేదీ ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది అందరూ అనుబంధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పగడ్బందీగా పరీక్షను నిర్వహించాలని శనివారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి ఆదేశించారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (బిపిఎల్) ముస్లిం కుటుంబాలలోని పదవ తరగతి ఉత్తీర్ణులైన ప్రతిభావంతులైన విద్యార్థులకు రాష్ట్రంలోని అగ్రశ్రేణి కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత రెసిడెన్షియల్ ఇంటర్మీడియట్ విద్యను అందించడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందేనని ఫరూక్ పేర్కొన్నారు. ప్రతిభావంతులైన అర్హులను ఎంపిక చేసేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీ, అవకతవకలులేకుండా, ఎలాంటి ఫిర్యాదులులేకుండా, పరీక్షను నిష్పక్షపాతంగా, విజయవంతంగా జరిగేలా చూడాలని అధికార యంత్రాంగాన్ని మంత్రి ఆదేశించారు. పేద ముస్లిం కుటుంబాలలోని ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి ఇంటర్ రెసిడెన్షియల్ విద్యను అందించడం ద్వారా నీట్, ఐఐటీ, జేఈఈ, ఎంసెట్ తదితర పోటీ పరీక్షలలో మంచి ఫలితాలు సాధించేలా చేయవచ్చునని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. తద్వారా పేద,మధ్య తరగతి ముస్లిం కుటుంబాలలోని విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు, ఉన్నత విద్యారంగంలోని వివిధ విభాగాల్లో శాస్త్రవేత్తలుగా, వివిధ విభాగాల్లో పలు ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందేలా ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని మైనారిటీ మంత్రి ఫరూక్ కోరారు.

# ఇక ఉత్తరాంధ్రకే వలసలు

>> జనాభా తగ్గుదల ఆందోళన కలిగిస్తోంది. పిల్లలే సంపద అని పిలుపునిస్తున్నాను. అందుకే మూడు, నాలుగో సంతానానికి ప్రోత్సాహకం అందించేలా నిర్ణయం తీసుకుంటున్నాం. మూడో సంతానానికి 30 వేలు, నాలుగో సంతానానికి 40 వేలు ప్రోత్సాహకంఇస్తాం. అంగన్వాడీలను బలోపేతం చేస్తున్నాం. తల్లికి వందనం కింద రూ. 15 వేలు ఆర్థిక సాయం చేస్తున్నాం. రీ సర్వే ద్వారా భూముల రికార్డులు ప్రక్షాళన చేస్తున్నాం. ఎవరూ ట్యాంపరింగ్ చేసే అవకాశం లేకుండా ఆధునిక టెక్నాలజీని వినియోగించి పట్టదారు పాస్ పుస్తకాలను ముద్రించిఅందిస్తున్నాం. 2027 మార్చినాటికి రాష్ట్రంలో ఎక్కడా భూ తగాదాలు లేకుండా చేసే బాధ్యత తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**సగర్వంగా స్వచ్ఛత వైపు అడుగులు :**

"17 నెలలుగా మనం స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించుకుంటున్నాం. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేస్తున్నాం. పరిసరాలు, పరిశుభ్రత విషయంలో మార్పు కనిపిస్తోంది. మన ఆలోచనలు స్వచ్ఛంగా ఉంటే మన అలవాట్లు మారుతాయి. అలవాట్లు మారితే సమాజం మారుతుంది. సమాజం మారితేనే స్వచ్ఛాంధ్ర సాకారం అవుతుంది. 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధన లక్ష్యంతో పనిచేస్తున్నాం. ప్రస్తుతం మన తలసరి ఆదాయం రూ.3 లక్షలు. దీన్ని రాబోయే 22 ఏళ్లలో రూ. 54 లక్షలు చేయాలనే దిశగా ముందుకెళ్తున్నాం. పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు పీ4 తీసుకొచ్చాం. పైన ఉండే 10 శాతం మంది కింద ఉండే 20 శాతం మందిని ఆర్థికంగా పైకి తీసుకు రావాలి. 2047 నాటికి మనదేశం ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా నిలుస్తుంది. ఆదిశగా ప్రధాని మోడీ ముందుకెళ్తున్నారని" సీఎం చంద్రబాబు అన్నారు.

**జూన్ నాటికి 100 శాతం చెత్త శుభ్రం :**

'ప్రజా ప్రభుత్వం వచ్చాక 86 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వేస్ట్ క్లియర్ చేశాం. ఈ 23 నెలల్లో 121 లక్షల టన్నుల చెత్త తొలగించాం. జూన్ కల్లా వందశాతం పూర్తవుతుంది. డోర్ టు డోర్ కలెక్షన్ ద్వారా ప్రతీ రోజూ పట్టణాల్లో 7,527 టన్నులు, గ్రామాల్లో 1,430 టన్నుల చెత్తను సేకరిస్తున్నాం. రూ.1,254 కోట్లతో 6 వేస్ట్ టూ ఎనర్జీ ప్రాజెక్టులు 6 సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. చెత్త ప్రాసెసింగ్ కోసం రూ.603 కోట్లతో 107 ఇంటిగ్రేటెడ్ ప్లాంట్లు సిద్ధం చేస్తున్నాం. ఇవి అక్టోబర్ నాటికి అందుబాటులోకి వస్తే డంపింగ్ యార్డ్ అనేదే ఉండదు. నెట్ జీరో క్యాంపస్ లో భాగంగా హాస్టళ్ల నుంచి వ్యర్థాలు లేకుండా ప్రణాళిక చేశాం, ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ విద్యుత్ ఉత్పత్తి, కిచెన్ గార్డెన్స్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, కంపోస్టింగ్, వాటర్ టెస్ట్ కిట్స్, ముస్తాబు వంటివి అమలుచేస్తున్నాం. ప్రతీనెలా 10,20 తేదీల్లో ఈవ్యర్థాలు సేకరిస్తున్నాం. చెత్త సేకరణకు 200 ఇ-ఆటోలు వినియోగిస్తున్నాం. ఈ నెలాఖరు కల్లా కొత్తగా 5,000 పుష్ కార్ట్స్, 12,000 ట్రై సైకిళ్లు తెస్తాం. రాష్ట్రంలో ప్రస్తుతం 31.33 శాతం గ్రీన్ కవర్ ఉంది. 2030 నాటికి 37 శాతానికి, 2047 కల్లా 50 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 633 స్వచ్ఛ రథాలతో రోజుకు 125 టన్నుల పొడి చెత్త సేకరిస్తున్నాం. ఇప్పటికి 47 లక్షల కేజీల చెత్తను సేకరించి రూ.8 కోట్ల విలువైన నిత్యావసరాలు ఇచ్చారు. కొత్తగా గ్రీన్ షాప్స్‌ను ప్రారంభించాం. ప్రజలే అక్కడికి వెళ్లి ప్లాస్టిక్, ఐరన్ వంటి వ్యర్థాలను ఇచ్చి వస్తువులు పొందవచ్చు. వావ్ పేరుతో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నెల్లూరు, అనకాపల్లి, చిత్తూరులలో సర్క్యులర్ ఎకానమీ పార్కులు నిర్మిస్తున్నాం. నేటి నుంచి 50 ప్లాస్టిక్ వ్యర్థ యూనిట్లు వస్తుండగా మరో 210 యూనిట్లు జూన్‌కి అందుబాటులోకి తెస్తామని" ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**రాష్టానికి మరిన్ని అవార్డులు రావాలి :**

'మన ఇల్లే కాదు. చుట్టూ ఉన్న పరిసరాలు, మన రహదారులను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. గతంలో నేను పాదయాత్ర చేసినప్పుడు గ్రామాలు, పట్టణాల్లో ఊరి చివర్లో ఎక్కడ చూసినా చెత్తాచెదారం కనిపించేది. అప్పుడే రహదారులను పరిశుభ్రంగా మార్చాలని నిర్ణయించుకున్నాను. అందుకే స్వచ్ఛపథం పేరిట ఇప్పుడు కార్యక్రమం చేపడుతున్నాం. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో మురుగునీరు వ్యర్థాలు పొంగిపొర్లకుండా మ్యాజిక్ డ్రైన్లను నిర్మిస్తున్నాం. రాష్ట్రంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను కూడా మనం వాడకుండా నిషేధం విధించుకోవాల్సిన అవసరం ఉంది. అత్యుత్తమ విధానాలను అనుసరించటం ద్వారా రాష్ట్రంలోని పంచాయితీలకు జాతీయ స్థాయి అవార్డులు వచ్చాయి. కందులవారి పల్లె, చిత్తూరు జిల్లా, కాణిపాకం ఇలా వేర్వేరు పంచాయితీలు అత్యుత్తమ పనితీరు కనబరచడం ప్రభుత్వం చేస్తోన్న కృషికి దక్కిన ఫలితంగా భావిస్తున్నాను. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ నిర్వహించే ఈ శాఖలో జాతీయ స్థాయిలో 8 అవార్డులు వచ్చాయి. మరిన్ని అవార్డులను రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాలు దక్కించు కోవాలని కోరుతున్నాను. ఇవాల్టి నుంచి ఆపరేషన్ క్లీన్ స్వీప్ రాష్ట్రంలో ప్రారంభం అవుతుంది. నెలరోజు పాటు ఈ ప్రత్యేక డ్రైవ్ చేపడతాం. నాలుగు వారాల పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనాలి. మున్సిపాలిటీలు కూడా స్వచ్ఛతా అవార్డులు దక్కించుకుంటాయని ఆకాంక్షిస్తున్నానని' ముఖ్యమంత్రి తెలిపారు.

**ప్రధాని సూచనలు పాటిద్దాం :**

'యుద్ధ ప్రభావం కారణంగా ప్రధాని మోడీ చేసిన సూచనలను బాధ్యత గల పౌరులుగా అందరం పాటించి దేశానికి సహకరిద్దాం. వర్క్ ఫ్రం హోం అలవాటు చేసుకుని వీలైనంతవరకూ ఇంట్లో నుంచే పనిచేద్దాం. బంగారం కొనడం తగ్గిద్దాం. పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్‌లోనే ప్రయాణిద్దాం. వంట నూనెల వాడకం తగ్గిద్దాం. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిద్దాం. మేడిన్ ఆంధ్రా, మేడిన్ ఇండియా బ్రాండ్లను కొనుగోలు చేద్దాం. టూరిజం కోసం విదేశీ పర్యటనల కంటే ఎపిలోని పర్యాటక ప్రాంతాలకు వెళ్లాలి" అని ముఖ్యమంత్రి ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లా పర్యటనలో పొదుపు చర్యల్లో భాగంగా సిఎం నాలుగు వాహనాల కాన్వాయ్‌లో మాత్రమే ప్రయాణించారు. శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేట నియోజకవర్గ అభివృద్ధి నివేదికను సిఎం చంద్రబాబు ప్రజలకు చదివి వినిపించారు. వివిధ శాఖల పనితీరును ప్రజలకు వివరించారు. నియోజకవర్గ పరిధిలోని రాజులచెరువు ఆధునీకరణకు నిధులు మంజూరు చేస్తామని, ఎన్ హెచ్ 5 నుంచి నరసన్నపేట పట్టణ పరిధిలో రూ. 15 కోట్లు వ్యయంతో రహదారి నిర్మాణం చేపడతామని, కింజరాపు ఎర్రన్నాయుడు చిల్డ్రన్ పార్క్ ఏర్పాటు చేస్తామని, శ్రీముఖ లింగం ఆలయ ఉత్సవాలను ప్రభుత్వం తరపున అధికారికంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. అనంతరం ప్రజా వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను సిఎం తిలకించారు. అక్కడ సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యంలో గిరిజనులు ప్రత్యేకంగా తయారు చేసిన సవర ఆర్ట్ ఓవర్ కోటు ను ముఖ్యమంత్రి ధరించారు. పోలీసులు ఏర్పాటు చేసిన హెల్మెట్ బ్యాంక్‌ను చూసి సిఎం అభినందించారు. హెల్మెట్ ధరించి అక్కడే ఉన్న బుల్లెట్ వాహనం అధిరోహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గోవిందుని చెంత భక్తుల కన్నీటి కష్టాలు!

## నారాయణగిరి ఉద్యానవనాల క్యూలైన్లలో తప్పని వెతలు

## తిరగని ఫ్యాన్లు,అందని అన్నప్రసాదాలు, మంచినీరు



**తిరుమల,మే 16ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వాడ గోవిందా గోవింద నామస్మరణతో తిరుమలకు చేరుకుంటున్న సామాన్యభక్తుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. క్యూలైన్లలో భక్తులు ఎండవేడికి అల్లాడిపోతూ కనీసం తాగు నీరు కూడా సక్రమంగా అందించేవారే లేకపో తున్నారని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నారాయణగిరి ఉద్యానవనాల్లోని క్యూలైన్లలో తిరగని ఫ్యాన్లు, సక్రమంగా అందని అన్నప్ర సాదాలు, తాగునీరు లేక భక్తులు కష్టాలు పడు తున్నారు. ఉదయం అల్పాహారం అందిస్తే మళ్ళీ నాలుగు గంటల వరకు కూడా క్యూలైన్లను పలకరించే వారే లేకపోతున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరీ చిన్నపిల్లలు, చంటిబిడ్డల తల్లిదండ్రులు, వృద్ధుల ఆవేదన ఎక్కువైంది. వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్ లో 31కంపార్టుమెంట్లు నిండితే భక్తులను శిలాతోరణం క్యూలైన్లమీదుగా నారాయణగిరి షెడ్లకు పంపుతుంటారు. వెలుపల క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షిస్తున్న భక్తులకు సరైన సౌకర్యాలు అందడంలేదనే ఆవేదన వ్యక్తమ వుతోంది. ఒక్కో కంపార్టుమెంట్‌లో 300మంది నుండి 400మంది వరకు భక్తులను అనుమతి నిస్తున్నా 12వేలమందికి సరాసరి మూడుగంటల్లో స్వామివారి దర్శనం చేయించే వెసలుబాటు కలు గుతుంది. అయితే అందుకు భిన్నంగా ఏకంగా 16,18గంటలు సమయం నిరీక్షించాల్సి వస్తుం డటంతో కూడా సామాన్యభక్తులు తమ గోడు వెల్లబుస్తున్నారు. మే నెల 1వతేదీ నుండి ఇప్పటివరకు రోజువారీగా సరాసరి 70వేలమంది వరకు భక్తులకు మహాలఘులో శ్రీవారి దర్శనం కల్పించారు. మే 1న 71,008మంది భక్తులకు, 2న 71,005మంది, 3న 83,091మంది,4న 70,096మంది,5న 76,240మంది భక్తులు, మే 6న 71,029మంది, 7న 70,001,8న 67,222మంది,9న 81,512మంది, మే 10న 85,492మంది, 11న 78,985మంది, 12న 80,389మంది, మే 13న 78,024మంది, 14న 67,722మంది, 15న 75,688మంది భక్తులకు ఇలా మహాలఘులోనే దర్శనాలు చేయిం చారు.అయితే ఆపదమొక్కులవాడా అనాధరక్షకా గోవిందా అంటూ ఆ దేవదేవుని దర్శించుకోవ డానికి వచ్చే సామాన్య భక్తులకు సౌకర్యాలు అందక కష్టాలు తప్పడం లేదు. గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోజుకు ఎంతమందికి దర్శనం చేయించామని లెక్కలు వేసుకుంటున్న టిటిడి అధికారులు సౌక ర్యాలపట్ల శ్రద్ధ చూపడంలేదనేది బహిరంగ విమ ర్శలు. భక్తులు ప్రవేశిస్తున్న వెలుపల క్యూ లైన్ల నుండి వైకుంఠమ్2 క్యూకాంప్లెక్స్ కంపా ర్టుమెం ట్లలోనికి చేరుకునే వరకు వెలుపల క్యూ లైన్లలో సమస్యలుక్షేత్రస్థాయిలో పరిస్థితులను అధికారులు పరిశీలించాలని పలువురు భక్తులు కోరుతున్నారు. క్యూలైన్లలో భక్తులకు చల్లనితాగునీరు, ఇతర సౌక ర్యాలుకల్పించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

# తిరుమల సమాచారం

## టిటిడికి విద్యుత్ బస్సు విరాళం



**తిరుమల,మే 16ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో ఒక చోటునుండి మరోచోటుకు భక్తులను ఉచి తంగా తరలించేందుకు అవసరమైన ఉచిత ధర్మ రథాలను దాతలు తమవంతుగా విరాళాలంది స్తున్నారు. శనివారం ఉదయం తమిళనాడు చెన్నైకు చెందిన వర ఫ్యూచర్ ఎల్ఎల్పీ సంస్థ చైర్మన్ వర్ధమాన్ జైన్ టిటిడికి ఒలెక్ట్రా విద్యుత్ బస్సును విరాళంగా అందించారు. దాత శ్రీవారి ఆలయం ముందు బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించి బస్సుకు సంబంధించిన పత్రాలు, తాళాలను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి అందజేశారు.

అనంతరం అదనపు ఇఒ చౌదరి దాతతో కలిసి బస్సులో ప్రయాణించి, ప్రయాణికులకు ఈ బస్సు చాలా సౌకర్యవంతంగా ఉందని దాతను అభి నందించారు. ఈ విరాళంగా అందించిన బస్సును తిరుమలలోని భక్తుల సౌకర్యార్థం ఉచిత బస్సు గా వినియోగించనున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ ఎం.లోకనాథం,టిటిడి మాజీ బోర్డు సభ్యుడు డి.పి.అనంత, తిరుమల రవాణావిభాగం డిఐ కృష్ణయ్య పాల్గొన్నారు.

# అభయం హెల్మెట్ బ్యాంకు స్టాల్‌ను సందర్శించిన సిఎం

## అభినందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**శ్రీకాకుళం (నరసన్నపేట), మే 16 ప్రభాతవార్త :** నరసన్నపేటలో నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రజా వేదిక ప్రాంగణంలో శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'అభయం హెల్మెట్ బ్యాంకు' స్టాల్‌ను సందర్శిం చారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె.వి. మహే శ్వరరెడ్డి, ముఖ్యమంత్రికి అభయం హెల్మెట్ బ్యాంకు కార్యక్రమం లక్ష్యాలు, అమలు విధానం గురించి విపులంగా వివరించారు. రోడ్డు ప్రమా దాల నివారణ మరియు ద్విచక్ర వాహనదారుల్లో హెల్మెట్ వినియోగంపై అవగాహన పెంపొం దించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులను గుర్తించి వారికి తాత్కాలికంగా హెల్మెట్ అందజేస్తామని, వారు 48 గంటలలోపు స్వయంగా కొత్త హెల్మెట్ కొనుగోలు చేసి హెల్మెట్ బ్యాంకుకు తిరిగి అందజేసే విధంగా కార్యక్ర మాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ విధానం ద్వారా ప్రజల్లో బాధ్యతాయుతమైన హెల్మెట్ డ్రైవింగ్ అలవాటు మరియు భద్రతా చైతన్యం పెరుగుతోందని తెలిపారు.ఈ వినూత్న కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి అభినందిస్తూ, రోడ్డు ప్రమాదాల నివారణలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలన్నారు. అలాగే జిల్లా పోలీసు శాఖ చేపట్టిన అభయం హెల్మెట్ బ్యాంకు కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి హెల్మెట్ వినియోగంపై అవగాహన పెం పొందించాలని సూచించారు.అనంతరం ముఖ్య మంత్రి స్వయంగా హెల్మెట్ ధరించి బుల్లెట్ వాహనాన్ని అధిరోహించి ప్రజల్లో హెల్మెట్ ధారణ మరియు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

## తిరుమలలో ఆపరేషన్ వజ్రపహార్



**తిరుమల,మే 16ప్రభాతవార్తప్రతినిధి:** పుణ్యక్షేత్రం తిరుమల భద్రత,ప్రశాంత వాతావరణం నెలకొ ల్పడంలో టిటిడితోబాటు పోలీసుశాఖ సిద్దమైంది. ఇప్పటికే శాంతిభద్రతల పరంగా, భక్తుల భద్రత ప్రధాన లక్ష్యంగా పనితీరు సాగిస్తున్నారు. తిరు మలకు యాత్రికుల ముసుగులో వచ్చే అసాంఘిక శక్తులను, నేరస్తులను గుర్తించి పట్టుకోవడానికి పోలీసుశాఖ తరచూ నాకాబందీ తరహాలో తనిఖీలు చేస్తున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాలతో తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ,డిఎస్పీ విజయశేఖర్ పర్యవేక్షణలో తిరుమల 1,2టౌన్ పోలీసులు తరచూ తిరుమలలో స్థానికులు నివాసముంటున్న బాలాజీనగర్, పాపవినాశనం, హెచ్‌టి కాంప్లెక్స్, డిబిరోడ్డు ప్రాంతాల్లో దుకాణాల్లో, ఇతరత్రా హోటళ్ళలో పనిచేసే కార్మికులను విచారణ చేస్తు న్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నారు. ఆపరేషన్ వజ్రపహార్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం నాఖాబందీ కార్యక్రమం నిర్వహిం చారు. తిరుమలలోని శిలాతోరణం, శ్రీవారి పా దాలు ప్రాంతాల్లో ఈ ప్రత్యేక తనిఖీలు చేప ట్టారు. ఈ నాఖాబందీ కార్యక్రమంలో పోలీస్ శాఖతో పాటు టిటిడి విజిలెన్స్, అటవీశాఖ, అగ్నిమాపకశాఖ, టిటిడి రెవెన్యూ, రెవెన్యూ శాఖ, బాంబ్ డిస్పోజల్ టీమ్స్, ఎక్సైజ్ శాఖ, ఆరోగ్యవిభాగంబ్బంది పాల్గొన్నారు. తిరుమలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగ కుండా భద్రతా చర్యలు చేపట్టారు.. అనుమా నాస్పద వ్యక్తులు,వస్తువులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ అధికారులకు సమాచారం అం దించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలం

**ఎపిఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు**

**విజయవాడ,మే 16, ప్రభాతవార్తప్రతినిధి:**ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆ సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు తెలిపారు.మచిలీపట్నం డిపోలో నిరసన వ్యక్తం చచేస్తున్న కార్మికులను చైర్మన్ నారా యణరావు మంత్రి మంత్రి కొల్లు రవీం ద్ర కలి సారు.ఈ సందర్భంగా కార్మికులతో కొనకళ్ల నారాయణరావు మాట్లాడారు.కార్మికుల డిమాం డ్లను అడిగి తెలుసుకున్నారు.ప్రైవేట్ బస్సుల కొనుగోలును కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిం చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను కూడా అర్థం చేసుకోవాలని వారు కోరారు.

# ఇంధన పొదుపుపై ప్రత్యేక దృష్టి

## మంత్రి గొట్టిపాటి రవికుమార్



**విజయవాడ,మే 16,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేర కు ఇంధన పొదుపు మీద ప్రత్యేకమైన దృష్టి సారించినట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలి పారు. ఖర్చులు తగ్గించుకోవాలని, పగటిపూట మన ఇంటిపైనే సౌరశక్తి ద్వారా విద్యుత్‌ను తయా రుచేసుకుని వినియోగించుకోవాలని సీఎం చెప్పా రన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 6లక్షల కనెక్షన్లు, ఒక్కో ఇంటిపైన 2 కిలోవాట్లు ఉచితంగా పేదలకు ఇవ్వాలని చాలా పెద్ద ఎత్తున సూర్య ఘర్ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ప్రధా ని దేశవ్యాప్తంగా కోటి కనెక్షన్లు పెడితే.. ఒక్క ఏపీ లోనే 20 లక్షల కనెక్షన్లు ఇవ్వాలని టార్గెట్ పెట్టు కున్నామని చెప్పారు. ఇంధన పొదుపు అనేది చాలా ముఖ్యమైన అంశంగా ముఖ్యమంత్రి ముం దుకువెళ్తున్నారని మంత్రి అన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ లాంటి శిలాజ ఇంధనాలను భారతదేశం నిత్యం బయటి దేశాల నుంచి దిగుమతి చేసుకోవలసిన పరిస్థితి ఉందని మంత్రి తెలిపారు. సౌరశక్తి, గాలి ద్వారా ఇలా ప్రత్య మ్నాయ పద్ధతుల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయా లని సీఎం చెప్పారన్నారు. ప్రతి ఇంటిపై 2 కిలో వాట్లకు రూ.60వేలు, 3 కిలోవాట్లకు రూ.78 వేలు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోం దన్నారు. అదనంగా ఇంకో రూ.20 వేలు కలిపి ఇవ్వాలని ముఖ్యమంత్రి తెలిపారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 2 కిలోవాట్లకు మొత్తం రూ.1.25 లక్షల సబ్సిడీని ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు చెప్పారు.

## రేపు ఆగస్టు నెల దర్శన కోటా విడుదల



**తిరుమల,మే 16ప్రభాతవార్తప్రతినిధి:** ఆగస్టు నెలకు సంబంధించి టిటిడి విడుదల చేయనున్న వివిధ దర్శనాల, గదుల కోటా వివరాలు వెల్లడించింది. తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల( సుప్ర భాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మా రాధన సేవ)కు సంబంధించిన కోటాను ఈనెల 18న సోమవారం ఉదయం 10 గంటలకు ఆన లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు 20 వతేదీ నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొ మ్ము చెల్లించిన వారికి టికెట్లు మంజూరవుతాయి.

**21న ఆర్జిత సేవా టికెట్ల విడుదల** కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపా లంకార సేవ, సాలకట్ల పవిత్రోత్సవాల టికెట్లను 21న ఉదయం 10 గంటలకు టిటిడి ఆన్ లైన్ లో విడుదల చేయనుంది. అదే విధంగా ఆగస్టులో జరిగే వార్షిక పవిత్రోత్సవాల ( ఆగస్టు 23నుండి 25 వరకు) మూడురోజుల టిక్కెట్లను కూడా మే 21 ఉదయం 10గం. ఆన్లైన్ లో విడుదల చేయనున్నారు.

**వర్చువల్ సేవల కోటా విడుదల :** వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను 21న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్ లో విడుదల చేయనుంది.

**23న అంగ ప్రదక్షిణ టోకెన్లు విడుదల:** అంగ ప్రదక్షిణ టోకెన్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు.

**శ్రీవాణి దర్శన కోటా విడుదల:** శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 23న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు.

**వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా:** వయోవృ ద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు టిటిడి ఆన్‌లై న్‌లో విడుదల చేయనుంది. 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 25న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అలాగే తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 25న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. భక్తులు తమ టిక్కె ట్లను ముందుగానే టిటిడి వెబ్‌సైట్ "టిటిదేవ స్థానమ్స్.ఎపి.జివొవి.ఇన్" ద్వారా శ్రీవారి ఆర్జి తసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని టిటిడి తెలిపింది.



## విద్యుత్ టవర్ల నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యం

**ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**

**తిరుపతి,మే 16ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్పీడిసిఎల్ సంస్థ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు.ఎస్పీసిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శనివారం ఉదయం టవర్ల నిర్మాణ కాంట్రాక్టర్లతో సిఎండి శివశంకర్ లోతేటి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ పరిధిలోని చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాల్లో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం వున్న ప్రాంతాలు, సాంకేతికంగా అవసరం వున్న ప్రాంతాల్లో విద్యుత్ టవర్ల నిర్మాణానికి టెం డర్లను ఆహ్వానించి, టెండర్లను ఖరారు చేయడం జరిగిందన్నారు. అయితే టవర్ల నిర్మాణంలో నాణ్యతను మరింత పెంపొందింపజేసేందుకు వీలుగా ఆ పనులను చేపట్టే ముందు సంబంధిత కాంట్రాక్టర్లతో సమీక్షను నిర్వహిస్తున్నామని తెలిపారు. పనుల పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని వివరించారు. టవర్ల నిర్మా ణంలో ఏవైనా మార్పులు అవసరమైతే తప్పకుండా ఆ కమిటీ నుంచి అనుమతిని పొం దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ హెచ్ఆర్డి) కె. గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్ జె. రమణా దేవి, జనరల్ మేనేజర్లు శ్రీనివాసులు, జగదీష్, కాంట్రాక్టర్లు అభిషేక్, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

# ఉపాధి శ్రామికుల దుర్మరణం బాధాకరం

## క్షతగాత్రులకు పూర్తి వైద్యసాయం: డి.సిఎం పవన్



**విజయవాడ,మే16,ప్రభాతవార్తప్రతినిధి:** కాకినాడ రూరల్ మండలం పరిధిలో పని ప్రదేశంలో రోడ్డు దాటుతున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమా దంలో నలుగురు మహిళా ఉపాధి శ్రామికులు మృతి చెందారన్న విషయం తెలిసి దిగ్భ్రాంతికి గురయ్యాను. చీడిగ గ్రామానికి చెందిన ఆరుగురు మహిళా శ్రామికులు రోడ్డు దాటుతున్న సమ యంలో వేగంగా వచ్చిన టిప్పర్ ఢీ కొట్టడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్టు అధికారులు తెలి యజేశారు. పని ప్రదేశంలో ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం తీవ్రంగా కలచి వేసింది. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానన్నారు. క్షత గాత్రులకు మెరుగైన వైద్య సాయం అందించాలని కాకినాడ జిల్లా యంత్రాంగానికి సూచించామని, వారు పూర్తిగా కోలుకునే వరకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా నిలుస్తామని పేర్కొన్నారు. మృతి చెందిన శ్రామికుల కుటుం బాలకు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెం చిన పరిహారం రూ.4లక్షలు త్వరితగతిన అం దించే ఏర్పాటు చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వం తర ఫున రూ. 2 లక్షలు, పి.ఎం. సురక్ష యోజన, పి.ఎం. జీవన్ జ్యోతి యోజన కింద వచ్చే బీమా మొత్తాన్ని వీరికి అందిస్తామని తెలిపారు. రహదారుల వెంబడి పని ప్రదేశాల్లో ప్రమాద నివారణకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూ చించామని, జాతీయ రహదారుల వెంబడి, వాహనాలు వేగంగా వచ్చే బైపాస్ రోడ్ల వెంబడి, ట్రాఫిక్ రద్దీ ఉండే రహదారుల వెంబడి ఉపాధి పనులు జరుగుతున్న సమయంలో వేగ నియం త్రణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించామని డిసిఎం పవన్ పేర్కొన్నారు.

## రూ.7 కోట్లతో అలిపిరిలో 'శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమం' కు శాశ్వత యాగశాల

### హోమంలో పాల్గొన్న గృహస్తులకు ప్రత్యేక దర్శనం



**తిరుమల,మే 16ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ సనాతన ధర్మ పరిరక్షణలో భాగంగా టిటిడి ఆధ్వ ర్యంలో అలిపిరి సప్త గోప్రదక్షిణ మండపంలో నిర్వహిస్తున్న "శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమం" శాశ్వత యాగశాలకు టిటిడి నిధులు విడుదల చేసింది. సుమారు 7కోట్ల రూపాయలు వ్యయంతో నిర్మించనున్న ఈ యాగశాలలో ఒకేసారి 500మంది గృహస్థులు పాల్గొనే అవకాశం కలగనుంది. ఇప్పటికే ఈ హోమం టిక్కెట్లను పూర్తిగా ఆన్‌లైన్ చేసిన విషయం విదితమే. తిరుపతి అలిపిరిలో సప్తగోప్రదక్షణశాల సమీపంలో నిర్వహించే ఈ విశేషహోమంకు భక్తుల నుండి మంచి స్పందన లభిస్తోంది. ఈ హోమ కార్యక్రమాన్ని టిటిడి 2023 నవంబరు 23న ప్రారంభించింది. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి అనుగ్రహాశీస్సులతో కొనసాగుతున్న ఈ దివ్య హోమం ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుండి 11గం టల వరకు ఎస్వీ వేద విశ్వవిద్యా లయం ఆ ధ్వర్యంలో జరుగు తోంది. భక్తుల కోరిక మేరకు 2025 ఆగస్టు 1 నుండి రోజుకు 200 టికెట్లను పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా జారీ చేస్తోంది. ఈ టికెట్ పొందిన గృహ స్తులు స్వయంగా హాజరై హోమంలో పాల్గొనాల్సి ఉంటుంది. టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమా మిళ్ళ వెంకయ్య చౌదరి ఆదేశాల మేరకు 7కోట్ల రూపాయల వ్యయంతో దాదాపు 500 మంది గృహస్తులు ఒకేసారి పాల్గొనేలా విశాలమైన శాశ్వత యాగ శాల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. 1,600 రూపా యలు చెల్లించి ఒక టికెట్‌పై ఇద్దరు గృహస్తులు పాల్గొనే అవకాశం కల్పించారు. హోమంలో పాల్గొన్న వారికి 300 ప్రత్యేక ప్రవేశ దర్శనం కూడా కల్పిస్తారు. ఈ టికెట్లను నెల రోజుల ముందుగానే టిటిడి అధికారిక వెబ్‌సైట్ "డబ్ల్యు డబ్ల్యుడబ్ల్యు. టిటిదేవ స్థానమ్స్. ఎపి.జివొవి. ఇన్"వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో నెల రోజుల ముం దుగా బుక్ చేసుకోవాలి. హోమం అనేది భగవం తుని ఆరాధనలో అత్యంత పవిత్ర మైన మార్గ మని, వేద మంత్రాల శక్తితో దైవాను గ్రహం త్వ రగా లభిస్తుందని అర్చకులు తెలిపారు. భక్తు లందరూ ఈ దివ్యహోమంలో పాల్గొని స్వామి వారి కృపాకటాక్షాలు పొందాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.

# దళితుల ఆత్మగౌరవ గుండె చప్పుడు

## విజయవాడలో బిజెపి వినూత్న కార్యక్రమం

## పార్టీ అధ్యక్షుడు మాధవ్



**విజయవాడ,మే16,ప్రభాతవార్తప్రతినిధి:**భారతీయ జనతాపార్టీ వినూత్న కార్యక్రమం చేపట్టిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ..ఈ నెల 17నసాయంత్రం అంబేద్కర్ విగ్రహం సాక్షిగా డప్పు కళాకారులతో భారీ ప్రదర్శన ఉంటుందని తెలిపారు. డప్పు ద్వారా ఆధ్యాత్మిక, సంగీత, ప్రచార కార్యక్రమాలు జరుగుతాయన్నారు. డప్పు వాయిద్యానికే జీవితాలను అంకితం చేసిన వారు ఉన్నారని గుర్తుచేశారు. మేల్కొలిపే ఈ డప్పును ఓ దళితుడు మోగిస్తారని ఆ తరువాత ఇతర వాయిద్యాలు ప్రారంభమవుతాయని చెప్పారు. బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షులు పనతాల సురేశ్ ఆధ్వర్యంలో డప్పు కళాకారుల కోసం ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారి బతుకుల్లో వెలుగులు ఇచ్చేలా వారి సంక్షేమం కోసం బీజేపీ కృషి చేస్తోందన్నారు.భారత రాజ్యాంగం ద్వారా అందరికీ సమాన ప్రాధాన్యం ఇచ్చిన అంబేద్కర్ నడయాడిన ప్రాంతాలను ప్రధాని మోదీ అభివృద్ధి చేశారని మాధవ్ చెప్పారు. విజయవాడలో అతి పెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని మాజీ సీఎం జగన్ ఏర్పాటు చేశారని అందరూ అనుకుంటారని.. అది నిజం కాదని స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వం రూ.430 కోట్లు కేటాయించి నిర్మాణం చేసిందని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలు ప్రజల్లోకి వెళ్లేలా రేపు(ఆదివారం) డప్పు కళాకారుల ప్రదర్శనలు ఉంటాయన్నారు. చదవండి.. సమీకరించండి.. పోరాడండి అని అంబేద్కర్ చెప్పారు. చదువు ద్వారా సమాజంలో గుర్తింపు ఉంటుందని చెప్పారు అని గుర్తుచేశారు.రేపు పెద్ద ఎత్తున జరిగే ఈ ప్రదర్శనలో మంత్రి సత్యకుమార్, కూటమి నాయకులు పాల్గొంటారని మాధవ్ తెలి పారు. డప్పు కళాకారులకు చేయూతని వ్వాలని.. ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అన్ని కులాల వారికి ఆలయాల్లో సమాన ప్రాధాన్యం ఇవ్వాల న్నారు. దేవాలయ వ్యవస్థలో అన్నివర్గాల వారి పాత్ర ఉంటుందని తెలిపారు. డప్పు కళాకారులు ప్రతి ఉత్సవంలో కీలకంగా పని చేస్తారన్నారు. రేపు జరిగే భారీప్రదర్శన సరికొత్త చరిత్రకు నాంది పలుకుతుందని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

# రాష్ట్రంలోనే అత్యధిక ఇంధన ధరలు

## పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



**విజయవాడ,ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:**అత్యధిక ఇంధనం ధరలు ఏపీలో ఉండటం ఆశ్చర్యంగా ఉందని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు.ఈ మేరకు ఆమె పలు ప్రశ్నలు. ఆరో పణలతో ఒక ప్రకటన విడుదల చేసారు. అడ్వాన్స్‌డ్ ఆంధ్రప్రదేశ్ అంటే? వాట్ పేరుతో జనాలను బాదడమా దేశానికి ఏపీ రోల్ మోడల్ ? సెస్ ల పేరుతో జనాల పర్సులు ఖాళీ చేయ డమా విజన్ ఆంధ్రప్రదేశ్? పొదుపు మంత్రం సరే మరి వ్యాట్ దోపిడీ సంగతేంటి? సైకిళ్ళు, ఈ వెహికిల్లు ఒకే.. మరి లీటర్ ధర మీద అదనంగా రూ.4 గుంజడంపై నియంత్రణ లేదా ? పొదుపు చర్యలు ప్రజలకేనా.. పన్నులు తగ్గించడంలో ప్రభుత్వానికి బాధ్యత లేదా ? అభివృద్ధిలో చివరిస్థానం, ఇంధనం ధరల్లో మొదటి స్థానం ఉన్నందుకు సిగ్గుపడాలి. దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 97.77 పైసలు. ఢిల్లీని తలదన్నే అమరావతిలో లీటర్ పెట్రోల్ ధర 113. 62 పైసలు. మోడీ సొంత రాష్ట్రం గుజరాత్ లో లీటర్ డీజిల్ ధర రూ . 93.75 పైసలు. ఎన్ డి ఏ లో పెద్దన్న పాత్ర పోషించే రాష్ట్రం ఏపీలో డీజిల్ ధర రూ 101.24 పైసలు. పక్కరాష్ట్రం తమిళనాడుతో పోల్చినా రూ.10 రూపాయలు అదనం. కర్ణాటకతో రూ. 7, తెలంగాణ, కేరళతో చూసినా రూ.4 రూపాయలు ధరాభారం. అధిక వ్యాట్ , అడిషనల్ వ్యాట్ పేరుతో ఏటా ప్రజలపై పడుతున్న అదనపు భారం అక్షరాల 10 వేల కోట్లు. ఆదాయం పెంపు మార్గాలని 2014 నుంచి టీడీపీ , వైసీపీ ప్రభుత్వాలు ముక్కుపిండి వసూలు చేయడం దుర్మార్గపు చర్య.ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన ముఖ్యమంత్రి చంద్రబాబు గారిని డిమాండ్ చేస్తున్నాం. పెట్రోల్,డీజిల్ పై వసూలు చేస్తున్న 31 శాతం అధిక వ్యాట్ ను తగ్గించాలి. కర్ణాటకలో సేల్స్ టాక్స్ గరిష్టంగా 29శాతం మాత్రమే. తమిళనాడులో వ్యాట్ కేవ లం 13 శాతమే. తెలంగాణలో 35 శాతం వ్యాట్ విధింపు ఉన్నా..అదనపు వ్యాట్ 4 రూపాయల చార్జీల భారం లేదు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు దృష్ట్యా ఇంధనంపై వాట్‌ను భారీగా తగ్గిస్తూ, అద నంగా వసూలు చేస్తున్న 4రూ పాయలను, రోడ్డు సెస్ పేరుతో దోపిడీ చేస్తున్న రూ.1ని , మొత్తం గా లీటర్ ధరపై కనీసం 5 రూపాయలు అయినా ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు పడే భారాన్ని మోడీ మెడలు వంచి తీసుకు రండి అన్నారు.

## చనిపోయిన ఉపాధి కార్మికుల కుటుంబాలకు

## రూ.25లక్షల చొప్పున పరిహారం చెల్లించాలి: సిపిఎం

**విజయవాడ, మే 16,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రమా దంలో చనిపోయిన ఉపాధి కార్మికుల కుటుం బాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. దీనికి సంబంధించి శనివారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనను విడుదల చేశారు. కాకినాడ జిల్లా చీడిక గ్రామం లో ఉపాధి హామీ పనులకు వెళ్లి లారీ ప్రమా దంలో ఆరుగురు మహిళా ఉపాధి కార్మికులు మరణించడం పట్ల సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నదన్నారు. వారి మృతికి సంతాపం తెలియజేస్తున్నదన్నారు. మరణించిన కుటుంబాలకు రూ.25 లక్షలు, గాయపడిన వారికి రూ.5 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నదని పేర్కొన్నారు.

**GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION**

Tender Notice No. 02/2026-27 / SE (W-V) / EE (ANAKAPALLI) / DB / GVMC, Dt. 15-05-2026

Number of Works - 01 — Value of works : Rs. 104.64 Lakhs

Tender Opening Date : 15.05.2026

Closing Date : 01.06.2026

Note : Further details at http://www.tender.apeprocurement.gov.in

O/o the EE-AKP Cell : 7386957240

For COMMISSIONER, (GVMC)

# వాయులింగేశ్వరుని దర్శనం కోసం జనసందోహం

## రికార్డు స్థాయిలో పూజలు, ఆదాయాలు

## ఇఒ స్వీయ పరిశీలనలు



ఆలయం వద్ద నిరీక్షిస్తున్న భక్తులు

**శ్రీకాళహస్తి,మే 16 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయానికి రెండు రోజులుగా భక్తులు కదలి వస్తున్నారు. ఓ వైపు అమావాస్య,కిర్తిక కావటంతో శనివారం ఆలయం కిట కిట లాడింది. వేసవి కాలం తమిళనాడులో ఎన్నికలు ముగియటంతో ఆలయానికి భక్తులు తండోపతండాలుగా వస్తున్నారు.ఈ నేపధ్యంలో శనివారం ఆలయం భక్తులతో కిక్కిరిసింది.ఎటు చూసినా భక్త జనమే. ఎటు చూసినా వాహనాల రద్దీయే కనబడింది. వరుస సెలవులతో జిల్లాలోని ఆలయాలు కిట కిట లాడుతున్నాయి. ఓ వైపు ఎండ మాడు పగల గొడుతున్నా, లెక్క చేయక భక్తులు కదలి వచ్చారు. దాంతో వాయులింగేశ్వరుని దర్శనం కోసం భక్త జనులు సతమతమయ్యారు.అయితే ఆలయానికి ఒకే రోజు రూ.కోటి ఆదాయం వచ్చింది.ఇక రాహుకేతుదోష నివారణ పూజలు 8వేలు జరగటం గత రెండు సంవత్సరాల్లో ఇదే మొదటి సారి, ఇక శనీశ్వరాభిషేకాలు కూడా సుమారు 600 జరగటం గమనించదగ్గ విషయం

**తండోపతండాలుగా భక్తులు:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలకు విశేష స్పందన లభిస్తుంది. దేశ విదేశాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తున్నారు. అయితే ఇక్కడకు వచ్చిన భక్తుల సమస్యలు వచ్చిన తరువాత కానీ అర్థం కావటం లేదు. ముఖ్యంగా శని,ఆదివారం రాత్రి వచ్చే భక్తుల సంఖ్యను బట్టి ఇక్కడి లాడ్జి యజమానులు రేట్లు ఖరారుచేస్తున్నారు. సింగిల్ గది కూడా రూ.2500లు వసూలు చేసుకుంటున్నారంటే ఇక్కడి లాడ్జిల యజమానుల దోపిడి అర్థమౌతుంది. ఇక్కడి లాడ్జిలకు ఎక్కడా పార్కింగ్ సదుపాయం లేదు. రోడ్ల మీదనే వాహనాలను పార్కింగ్ చేస్తారు.

**పార్కింగ్ కోసం తిప్పలు:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తుల వాహనాలు పార్కింగ్ చేయటానికి సరైన సదుపాయం లేదు. సన్నిధివీధిలో ఎక్కడ బడితే అక్కడ పార్కింగ్ చేయాల్సి వస్తోంది. కానీ ఎక్కడా నిలువ నీడ లేదు. దేవస్థానం ముక్కుపిండి పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారు తప్ప వారికి కనీస సదుపాయాలే కల్పించాలనే ధ్యాస లేకపోవటం శోచనీయం.

**సన్నిధివీధిలో గందరగోళం:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తుల పరిస్థితి సన్నిధివీధిలో గందరగోళంగా మారుతుంది. భిక్షాల గాలి గోపురం వద్దనుంచి ఆర్‌టిసి బస్సులను అపసవ్యదిశగా అనుతించటంతో సన్నిధివీదిలో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. దేవస్థానం,పోలీసు,ఆర్‌టిసి శాఖల మధ్య సమన్వయ లోపంతో బస్సులు ఈ మార్గం గుండా పయనించటంతో ట్రాఫిక్‌కు తీవ్ర విఘాతం ఏర్పడింది.

వాస్తు రీత్యా ఈ ఆలయం అపదక్షిణ క్షేత్రం. కాబట్టి శాస్త్ర ప్రకారం భిక్షాల గాలిగోపురం నుంచి భక్తులు ప్రవేశించాలి. అయితే కొందరు అధికారుల తీరుతో దర్శనాలను నాల్గవగేటు నుంచి వస్తున్నారు. వివిఐపిలుకూడా ఇదే దారిలో వస్తున్నారు. దాంతో నాల్గవ గేటు వద్ద పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతుంది. ఇక్కడ ఓ వైపు బస్సులు, మరో వైపు వివిఐపి వాహనాలతో కిట కిట లాడుతున్నాయి. ఇక ఆటోల వ్యాపారం కోసం ఇక్కడ తిష్టవేయటంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. మాస్టర్ ప్లాన్ అమలులో ఆలయానికి దక్షిణం వైపు ఉన్న స్థలాలనుసేకరిస్తామని అధికారులు చెబుతున్నారు. ఇది జరిగితే తప్ప ఇక్కడ ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం ఉండదు.

# జోనల్ కోఆర్టినేటర్లకు పార్లమెంట్లు కేటాయింపు

**విజయవాడ, మే 16 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్ర బాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ కింది మార్పులతో నూతన జోనల్ కోఆర్డినేటర్లను నియమించడం జరిగింది. అరిమిల్లి రాధాకృష్ణ శ్రీకాకుళం, విజయనగరం, అరకు. బెందాలం అశోక్ అనకాపల్లి, విశాఖపట్నం. సుజయ కృష్ణ రంగారావు కాకినాడ, అమలాపురం. ప్రతిపాటి పుల్లారావు నరసాపురం, ఏలూరు, రాజమండ్రి. మంతెన వెంకట సత్య నారాయణ రాజు మచిలీపట్నం, గుంటూరు, విజయవాడ. బీ.టి. నాయుడు బాపట్ల, నరసరావుపేట. మద్దిపాటి వెంకట రాజు నెల్లూరు,ఒంగోలు. దామచర్ల సత్య చిత్తూరు, రాజంపేట, తిరుపతి. రెడ్డప్ప గారి శ్రీనివాస రెడ్డి అనంతపురం, హిందూపురం. పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి కర్నూలు, నంద్యాల, కడప జోన్లు కేటాయించారు.

# రోడ్డు ప్రమాదంపై మంత్రి నారాయణ దిగ్భ్రాంతి

**విజయవాడ, మే 16 ప్రభాతవార్త ప్రతినిధి:** కాకినాడ జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై పురపాలక శాఖ మంత్రి నారా యణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పొట్టకూటి కోసం పనులకు వెళ్తున్న నలుగురు మహిళలు ప్రమాదంలో మృతి చెందడం అత్యంత బాధాకరం అన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారు.మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రి. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని నారాయణ తెలిపారు.



# ఏనుగుల దాడులతో రైతులు విలవిల

## ప్రభుత్వం ఆదుకోవాలని ఎదురుచూపు

**చిన్నగొట్టిగల్లు, మే 16 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలం ఎగువూరు పంచాయతీ బోగంవారిపల్లిలో శుక్రవారం రాత్రి అడవి ఏనుగులు రైతుల పంట పొలాల్లోకి చొరబడి తీవ్ర నష్టం కలిగించాయి. గ్రామానికి చెందిన రైతులు అమరేంద్ర, చంద్రశేఖర్, చెల్లప్ప, మునిచంద్ర, విశ్వనాథం లకు చెందిన మామిడి తోటలు, పశుగ్రాసం , నీటి పైపులను ఏనుగులు ధ్వంసం చేశాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చేతికి వచ్చిన మామిడి పంటను పూర్తిగా నాశనం చేయడంతో తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. గత కొంత కాలంగా మండల పరిధిలో ఏనుగుల సంచారం పెరుగుతున్నప్పటికీ అటవీశాఖ అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. రాత్రివేళల్లో ఏనుగులు గ్రామాలపైకి వస్తున్నా, ప్రజలకు ముందస్తు హెచ్చరికలు ఇవ్వడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని ఆరోపించారు. పంటలను కాపాడుకునేందుకు రైతులు రాత్రంతా పొలాల వద్ద కాపలా కాస్తున్నా, అధికారులు మాత్రం నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి ఏనుగులను అటవీ ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని, నష్ట పోయిన రైతులకు తక్షణ పరిహారం అందించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. రైతుల ప్రాణాలు, పంటల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# నెల్లూరు కామాక్షి అమ్మవారికి

## దుర్గమ్మవారి పట్టువస్త్రాలు

**ఇంద్రకీలాద్రి, మే 16, ప్రభాతవార్త :** నెల్లూరులోని ప్రసిద్ధ శ్రీ కామాక్షి అమ్మవారికి విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానం తరఫున శనివారం సాంప్రదాయ బద్ధంగా పట్టువస్త్రాలను సమర్పించారు. దుర్గమ్మవారి ఆలయ ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు, ఆలయ ముఖ్య అర్చకులు శ్రీనివాస శాస్త్రి, ట్రస్ట్ బోర్డు సభ్యులు మరియు అర్చక బృందం కలిసి నెల్లూరు కామాక్షి అమ్మవారికి పట్టువస్త్రాలు పసుపుకుంకుమలు, ప్రసాదాలను తీసుకెళ్లగా నెల్లూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి ప్రభాకర్ రెడ్డి దుర్గమ్మవారి ఆలయ బృందానికి స్వాగతం పలికి కామాక్షి అమ్మవారి సన్నిధికి తోడ్కొని వెళ్లారు. అక్కడ శ్రీ అమ్మవారికి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించి వేద ఆశీర్వచనం చేశారు. రెండు ప్రసిద్ధ శక్తీపీఠాల ఆధ్యాత్మిక బంధాన్ని ప్రతిబింబించేలా ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా సాగింది.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు:** దుర్గమ్మవారి ఆలయ ఈవో వికె శీనా నాయక్ శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలని హెచ్చరించారు. భక్తుల భద్రత, వసతులు, ఆలయ నియమ నిబంధనల అమలును ఆయన స్వయంగా పరిశీలించారు. దేవస్థాన ప్రథమ చికిత్స కేంద్రాన్ని పరిశీలించిన ఈవో, ప్రథమ చికిత్స కేంద్రాన్ని మరింత ఆధునీకరించేందుకు త్వరలోనేచర్యలుతీసుకుంటామని ప్రకటించారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** శ్రీ కనకదుర్గమ్మ వారి నిత్య అన్నదాన పథకానికి హోసూర్ బాగలూర్‌కు చెందిన సిద్దిరెడ్డి మునిరెడ్డి, జాహ్నవి రెడ్డి దంపతులు తమ కుటుంబ సభ్యులు అందరి తరపున రూ. 1,00,000లు విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు.

**తక్షణ వైద్య సహాయంతో బాలిక సురక్షితం:** శుక్రవారం గుంటూరుకు చెందిన ఒక కుటుంబం శ్రీ కనకదుర్గమ్మ వారి దర్శనం కోసం పాత మెట్ల మార్గం గుండా కొండపైకి వస్తుండగా, స్లాబ్ పెచ్చు ఊడి స్నేహ (9 సం) అనే బాలిక తలపై పడిస్వల్ప గాయమవ్వగా వెంటనే స్పందించిన దేవస్థానం సిబ్బంది బాలికను ఆలయ ప్రథమ చికిత్స కేంద్రానికి తరలించి వైద్యం అందించగా బాలిక సురక్షితంగా వున్నట్లు ఇఓ వికె



శీనా నాయక్ తెలిపారు. సుమారు 50 సంవత్సరాల క్రితం నాటి పురాతన కట్టడం వల్ల ఈ ఇబ్బంది జరిగిందని, భక్తుల భద్రత దృష్ట్యా తక్షణమే ఆ మెట్ల మార్గంలో రాకపోకలను నిలిపివేసి, అత్యవసర మరామత్తు పనులు పూర్తి చేయించామన్నారు.

కాగా ఆ బాలికకు దేవాలయ ప్రాథమిక చికిత్స కేంద్రంలో చికిత్స అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడానికి ఏర్పాట్లు చేశామని, కానీ ఆ బాలిక కుటుంబం వారు శ్రీ అమ్మవారి దర్శనం చేసుకుంటామనగా వెంటనే అంతరాలయ దర్శన ఏర్పాట్లు చేసిన తదుపరి ఆ బాలికను వారి కుటుంబసభ్యులతో సహా ప్రభుత్వ ఆసుపత్రికి దేవస్థానం అం బులెన్స్‌లో తరలించి అక్కడ చికిత్స అందించే ఏర్పాటు చేయగా అనంతరం ఆ బాలిక కుం టుంబం వారు సురక్షితంగా తమ గ్రామానికి చేరుకున్నారని ఇఓ వివరించారు.

ఈసంఘ టనపై రాష్ట్ర దేవాదాయ శాఖ ఎక్స్ అఫిషియో సెక్రటరీ డాక్టర్ ఎం. హరిజవహార్ లాల్ మాట్లాడుతూ ఇటువంటి దురదృష్టకరమైన సంఘటన మరలా జరగకుండా భక్తుల భద్రత నిమిత్తం ప్రణాళికా బద్ధమైన చర్యలు చేపట్టాలన్నారు.

# బయో వ్యర్థాల నిర్వహణపై నివేదికలు పంపాలి

## సూపరింటెండెంట్లను కోరిన డిఎంఇ

**విజయవాడ, మే 16 ప్రభాతవార్త ప్రతినిధి:** బోధనాసుపత్రుల్లో ప్రస్తుత బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ యథాస్థితిపై వెంటనే నివేదికలు పంపాలని సూపరింటెండెంట్లను వైద్య ఆరోగ్యశాఖ ఆదేశించింది. విజయవాడ జి.జి.హెచ్.లో తాజాగా చోటుచేసుకున్న ఘటన నేపథ్యంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జారీచేసిన ఆదేశాలు అనుసరించి డీఎంఈ డాక్టర్ రాధికారెడ్డి బోధనాసుపత్రులు సూపరింటెండెంట్లకు పంపిన ఉత్తర్వుల్లో ప్రస్తుత బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, తరలింపు, ఇతర వివరాలను సోమవారం నాటికి పంపాలని స్పష్టంచేశారు. ముఖ్యంగా బయో మెడికల్ వ్యర్థాల స్టోరేజ్ గది నిర్వహణ ఎలా ఉంది? ప్రవేశ మార్గాల వద్ద ముఖ్యంగా తలుపులను మూసివేయడంలో ఉపయోగిస్తున్న విధానాలు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నుంచి గుర్తింపు మంజూరు, దాని కాలపరిమితి ఎంత వరకు ఉందో తెలియ బరచాలని డీఎంఈ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే స్టోరేజీ రూములను సీసీ కెమెరాల ద్వారా పరిశీలించేలా సూపరింటెండెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల ద్వారా వ్యర్థాల తరలింపు ఎలా జరుగుతుంది? ఆపరేషన్ థియేటర్లు, ల్యాబ్స్, ఇతరచోట్ల నుంచి వ్యర్థాలను స్టోరేజి రూముకు తీసుకువస్తున్న విధానం, ఇతర వివరాలను తగిన ఆధారాలతో నివేదికలో పొందుపరచాలని డీఎంఈ సూపరింటెండెంట్లకు పంపిన ఆదేశాల్లో స్పష్టం చేశారు. బయోమెడికల్ వెస్టేజ్ మేనేజ్ మెంట్ రూల్స్ 2016, ఇతర నిబంధనలు అనుసరించి, ఆసుపత్రుల సూపరింటెండెంట్లు బయో మెడికల్ వ్యర్థాల తరలింపు విధానాన్ని వ్యక్తిగతంలో ప్రతిరోజూ నిశితంగా పరిశీలించాలని స్పష్టం చేశారు. బయోమెడికల్ వ్యర్థాలను స్టోరేజ్ రూముల నుంచి ఎప్పటికప్పుడు తొలగించాలని పేర్కొన్నారు. వైద్యులు, నర్సులు, శానిటేషన్ ఉద్యోగులు, ల్యాబ్స్, ఆపరేషన్ థియేటరు సెక్యూరిటీ, వైద్య విధ్యార్థులకు బయోమెడికల్ వెస్టేజ్ నిర్వహణ విధానం, రంగుల బ్యాగుల్లో వాటిని భద్రపరచడం, తరలించడం, ఇతర ప్రమాణాల అనుసరించడంపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని డీఎంఈ సూపరిటెండెంట్లకు దిశ, నిర్దేశం చేశారు. బోధన ఆసుపత్రుల నుంచి వచ్చే నివేదికలపై ఉన్నత స్థాయిలో సమీక్ష జరుగు తుంది. విజయవాడ ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో శస్త్రచికిత్స అనంతరం రోగి నుంచి తొలగించిన కాలి భాగాన్ని శునకం నోట కరుచుకుని తిరగడాన్ని మంత్రి సత్యకుమార్ సీరియస్‌గా తీసుకున్నారు.

ఈ నేపథ్యంలో పర్యవేక్షణ లోపం కింద ఆర్ఎంఒకు ఆసుపత్రి సూపరింటెండెంట్ షోకాజ్ నోటీసులు జారీచేశారు. అలాగే శానిటేషన్ ఉద్యోగిని విధుల నుంచి తప్పించారు. వ్యర్థాల తరలింపు నిర్వహణ ప్రైవేటు సంస్థకు నోటీసును కూడా జారీచేశారు.

# వైద్యునిపై ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసు

## మహిళను మోసగించినట్లుగా పలు కేసులు నమోదు

### ఫిర్యాదు నమోదు చేసామన్న మహిళా ఎసిపి దైవప్రసాద్

**విజయవాడ కార్పొరేషన్,మే 16,ప్రభాతవార్త:** ఎస్‌సి, ఎస్‌టి మహిళను వివాహం చేసుకుంటానని నమ్మించి ఆనక ఆమెను మోసం చేసినట్లుగా సదరు మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై మహిళా పోలీస్‌స్టేషన్ ఎసిపి దైవప్రసాద్ విచారణ చేపట్టారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం విజయవాడలో ఒక వైద్యుడు ఒక ప్రైవేటు క్లినిక్‌ను నిర్వహిస్తున్నాడు. అతని వద్ద ఓ మహిళ కొంత కాలం నుండి నర్సుగా పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో సదరు మహిళను వివాహం చేసుకుంటానని నమ్మించి సుమారు 5 సంవత్సరాల నుండి సదరు వైద్యుడు నర్సుగా పనిచేస్తున్న మహిళతో వివాహేతర సంబంధం నెరపుతున్నాడు. అయితే సదరు వైద్యునికి వివాహమైందని, అతని భార్య కూడ వైద్యురాలేనని,వీరికి ఇద్దరు పిల్లలని డాక్టరు వివాహేతర సంబంధం ఏర్పర్చుకున్న మహిళకు తెలియడంతో సదరు మహిళ తనను డాక్టరు మోసం చేశాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు పోలీసులు సదరు ప్రైవేటు డాక్టర్‌పై ఎస్‌సిఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం,ఛీటింగ్ కేసుతో పాటు పలు సెక్షన్ల క్రింద కేసు నమోదు చేశారు. దీనిపై మహిళా పోలీసు స్టేషన్ ఎసిపి దైవప్రసాద్ విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

# విజయవాడ విమానాశ్రయం మూసివేత అవాస్తవం

**విజయవాడ, మే 16 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం మూసివేస్తారంటూ జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఏపీ ప్రభుత్వం ఖండించింది. ఇది పూర్తిగా అవాస్తమని స్పష్టం చేస్తూ ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. గన్నవరం ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల రద్దీని తట్టుకొనేందుకు రూ.611.80 కోట్ల అంచనా వ్యయంతో నూతన ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని తెలిపింది. దీన్ని త్వరలోనే ప్రారంభించేందుకు ఎయిర్‌పోర్ట్సు అథారిటీ ఆఫ్ ఇండియా, రాష్ట్ర ప్రభుత్వ వేగంగా అడుగులు వేస్తున్నట్లు తెలిపింది. అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ఒక దీర్ఘకాలిక వ్యూహాత్మక ప్రాజెక్ట్. రాజధాని అమరాకతి పరిధిలోని గుంటూరు జిల్లా, తాడికొండ మండలం రావెల గ్రామ సమీపంలో సుమారు 4618 ఎకరాల్లో కొత్త గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు సిద్ధమయ్యారు. అయితే, ఇది భవిష్యత్తులో అమరావతిని గ్లోబల్ ఏవియేషన్ హబ్‌గా, విమానాల మరమ్మతుల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన దీర్ఘకాలిక ప్రాజెక్టు. రెండు విమానాశ్రయాలూ కలిసే కొనసాగుతాయి. మెట్రో నగరాలు, అభివృద్ధి చెందుతున్న రాజధాని ప్రాంతాల్లో ఒకటి కంటే ఎక్కువ విమానాశ్రయాలు ఉండటం సాధారణం. అదే విధంగా అమరావతిలో కొత్త ఎయిర్‌పోర్టు వచ్చినా, విజయవాడ గన్నవరం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు యథావిధిగా తన సేవలను కొనసాగిస్తుంది. ఈ అంశంలో తప్పుడు ప్రచారం నమ్మవద్దని కోరుతున్నాం అని పేర్కొంది.

# ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణకు ప్రైవేట్ ఆపరేటర్లు తప్పనిసరి: కొనకళ్ల

## మహిళల ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆర్టీసీపై తీవ్ర ప్రభావం పడుతోందని వ్యాఖ్య

## టికెట్ ఛార్జీలను పెంచబోమని వెల్లడి

**విజయవాడ,మే 16, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో ఎలక్ట్రిక్ బస్సుల ప్రైవేటీకరణ అనేది తప్పనిసరి అని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ అభిప్రాయపడ్డారు. సంస్థ ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, భవిష్యత్తు అవసరాలను వివరిస్తూ ఆయన పలు కీలక విషయాలను వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 10 వేల ఆర్టీసీ బస్సులు సేవలు అందిస్తున్నాయని, పర్యావరణ పరిరక్షణ కోసం వీటి స్థానంలో 10 వేల ఎలక్ట్రికల్ బస్సులను తీసుకురావాల్సి ఉందని ఛైర్మన్ తెలిపారు. అయితే, ప్రస్తుతం మార్కెట్లో ఒక్కో ఎలక్ట్రికల్ బస్సు ధర దాదాపు రూ. కోటి 60 లక్షలు పలుకుతోందని, మొత్తం 10 వేల బస్సుల కొనుగోలుకు సుమారు రూ. 15,000 కోట్లు ఖర్చవుతుందని వివరించారు. అంతటి భారీ మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టే ఆర్థిక స్తోమత అటు ఆర్టీసీకి గానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వానికి గానీ ప్రస్తుతానికి లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలను వాడుకుంటూ, ప్రైవేటు ఆపరేటర్లను ఆహ్వానించడం ఒక్కటే ప్రత్యామ్నాయమని పేర్కొన్నారు. ప్రైవేటు ఆపరేటర్లు పెట్టుబడి పెట్టి బస్సులు నడిపించడం వల్ల సంస్థపై అదనపు భారం తప్పుతుందని అభిప్రాయపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల ఆర్టీసీపై తీవ్ర ఆర్థిక భారం పడిందని కొనకళ్ల నారాయణ స్పష్టం చేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో డీజిల్ ధరలు పెరుగుతున్నప్పటికీ ప్రయాణికులపై భారం పడకుండా బస్సు ఛార్జీలను పెంచబోమని తేల్చిచెప్పారు. డీజిల్ బస్సుల నిర్వహణకు కిలోమీటర్‌కు రూ. 19 ఖర్చవుతుండగా, ఎలక్ట్రికల్ బస్సులకు కేవలం రూ. 7 మాత్రమే అవుతుందని గణాంకాలను వివరించారు.ప్రైవేటు భాగస్వామ్యంతో ఎలక్ట్రికల్ బస్సులను రంగంలోకి దించడం వల్ల కాలుష్యం తగ్గడంతోపాటు, సంస్థకు ఖర్చులు కలసివచ్చి ప్రయాణికులకుమరిన్ని మెరుగైన సేవలు అందించడానికి వీలవుతుందని ఆర్టీసీ ఛైర్మన్ తెలిపారు.

# నైరూప్య చిత్రకారుడు అలెక్స్ ఇక లేరు..



**విజయవాడ, మే 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రఖ్యాత నైరూప్య చిత్రకారుడు, సీనియర్ పాత్రికేయుడు మద్దాల జేమ్స్ అలెగ్జాండర్ అలియాస్ అలెక్స్ ఈరోజు విజయవాడలో కన్నుమూశారు. అలె గ్జాండర్ కొంతకాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన వయసు 70 సం వత్సరాలు. అలెగ్జాండర్ ఒక దిన పత్రికలో పేజీ లే అవుట్ అర్టిస్టుగా, చిత్రకారుడిగా చాలా కాలం పని చేశారు. ఆయనకు భార్య శ్రీలక్ష్మి, పిల్లలు నిఖిలేష్, తేజ,ఒకప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కొడుకు రాకేష్ ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు. అలెగ్జాండర్ కుటుంబం కొంతకాలం క్రితం బుడమేరు వరదల్లో సర్వస్వం కోల్పోయి చాలా ఇబ్బందులు పడింది. అలెగ్జాండర్ అనేక కవితా సంపుటాలకు, సంకలనాలకు ముఖచిత్రాలు గీశారు. యాబ్ స్ట్రాక్ ఇమేజెస్ గీయడంలో అలెగ్జాండర్ తిరుగులేని చిత్రకారుడిగా పేరు సంపాదించుకున్నాడు. చాలామంది కవులు తమ కవితలకు అలెక్స్ చేత బొమ్మ గీయించుకోవాలనే ఆకాంక్షను వ్యక్తం చేస్తుంటారు. అలెక్స్ మృతికి కలిమిశ్రీ, బెల్లం కొండ శివాజీ, చిత్రకారులు పి.చిదంబరం, కళాసాగర్, డా.రావెళ్ల, కవి, అనువాదకుడు పి.శ్రీనివాస్‌గౌడ్,అలెక్స్ సన్నిహితుడు, విశ్రాంత జర్నలిస్ట్అవ్వారు శ్రీనివాసరావు.మట్టా ప్రభాత్ కుమార్,సింగంశెట్టిదుర్గాకుమార్, పలువురు కవులు, చిత్రకారులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

# ప్రతిశుక్రవారం నోవెహికల్ డే : ఎన్‌టిఆర్ కలెక్టర్ లక్ష్మీశా

**విజయవాడ, మే 16, ప్రభాతవార్త :** ఇంధన పొదుపు చర్యల్లో బాగంగా ప్రతి శుక్రవారం ఎన్‌టిఆర్ జిల్లాలో నోవెహికల్‌డే ను పాటించేలా అధికారులను ప్రోత్సహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. ఈమేరకు శనివారం ఉదయం ఆయన విజయవాడలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి కలెక్టరేట్‌కు ఎలక్ట్రికల్ సైకిల్‌పై వెళ్లారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఇంధన సంక్షోభం ఏర్పడిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సైకిళ్ళు, విద్యుత్ వాహనాలపై ప్రయాణించాలని పిలుపునిచ్చారు. పెట్రోలు, డీజిల్ వాహనాల వినియోగం తగ్గించటం ద్వారా వాతావరణ కాలుష్యం నివారించటంతోపాటు, పర్యావరణ పరిరక్షణకు కృషిచేసినట్లు అవుతుందన్నారు. సంక్షోభ పరిస్థితుల్లో ఖర్చులు తగ్గించుకోవాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచలన మేరకు తాము పొదుపు చర్యలు పాటిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. స్థానిక యువత రూపొందించిన ఈసైకిళ్ళను తాను రెండిటిని కొనుగోలు చేసానని, ఇవి ఒక్కసారి చార్జిచేస్తే 40 కిలోమీటర్ల మైలేజి వస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి విద్యుత్ సైకిళ్ళ సమాచారం కావాల్సి న వారు కలెక్టరేట్‌లో సంప్రదించాలని స్థానిక యువతను ప్రోత్సహించాలని కలెక్టర్ కోరారు.



సైకిల్‌పై కలెక్టరేట్‌కు వెళుతున్న ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా

**మ్యూజియం వేడుకలకు తరలి రండి : కలెక్టర్ పిలుపు**

ఈనెల 18వతేదీ అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవ వేడుకలను విజయవాడలోని బాపు మ్యూజియంలో ఉదయం 6.30గంటల నుండి ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. ఉదయం 6.30కు బాపు మ్యూజియం నుండి మొగల్రా జపురం గుహల వరకు హెరిటేజ్‌వాక్, ఉదయం 10గంటలకు కార్యక్రమం ప్రారంభోత్సవం ఉంటుందని, 10.30గంటలకు మ్యూజియంలను అభివృద్ధి చేయటంపై మేధోమదనం జరుగుతుందన్నారు. 12.30గంటలకు ఇంట్లోని పురాతన వస్తువులను తీసుకోవచ్చి వాటి వెనుక ఉన్న చరిత్రను ప్రజలకు వివరిస్తారన్నారు. 11.30గంటలకు చిత్రలేఖనం, మద్యాహ్నం 2గంటలకు హెరిటేజ్ క్విజ్, అనంతరం మన రాష్ట్రంలోని వారసత్వ కట్టడాలు, మ్యూజియంలు, వారసత్వంపై పోటోగ్రఫి పోటీలు, బాపు మ్యూజియంలోని ఏదైనా ఒక వస్తువును తీసుకుని దాని ఆధారంగా 100 పదాలతో కల్పిత కథ రాయాల్సి ఉంటుంద న్నారు. సాయంత్రం ఇంది రాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సాంప్రదాయ కళా ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖ టాలీవుడ్ గాయకుల సంగీత విభావరి ఉంటుందన్నారు. ఈకార్యక్రమాలకు విద్యార్థులు, యువత, జర్నలిస్టులు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, అందరూ పాల్గొని కార్యక్రమాలను జయప్రధం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# పుల్లేటి కాలువపై వంతెన నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

## ఎంపీ వల్లభనేని బాలశౌరికి యలమర్రు గ్రామ అభివృద్ధి కమిటీ వినతి

**విజయవాడ, మే 16 ప్రభాతవార్త ప్రతినిధి:** మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరిను యలమర్రు గ్రామ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సూరపనేని వెంకట సత్యనారాయణ శనివారం ఉదయం కలిసి పుల్లేటి కాలువపై యలమర్రు శివారు కండ్రిక గ్రామం వద్ద నిర్మించాల్సిన నూతన వంతెనకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వంతెన నిర్మాణానికి సంబంధించిన అంచనా వ్యయ వివరాలతో కూడిన మెమొరాండంను ఎంపీ బాలశౌరికి సమర్పించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో వంతెన లేకపోవడం వల్ల స్థానిక ప్రజలు, రైతులు, విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సూరపనేని వెంకట సత్యనారాయణ వివరించారు. ముఖ్యంగా వ్యవసాయ పనులు, రవాణా, అత్యవసర సేవల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోందని తెలిపారు. పుల్లేటి కాలువపై వంతెన నిర్మాణం చేపడితే కృష్ణా జిల్లా పెద పారుపూడి మండలం యలమర్రు సహా పరిసర గ్రామల ప్రజలకురవాణా సౌకర్యం మెరుగుపడి, గ్రామీణ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. గ్రామస్తుల వినతిపై స్పందించిన ఎంపీ వల్లభనేని గ్రామస్తుల వినతిపై స్పందించి ఎంపీ వల్లభనేని బాలశౌరి సమస్యను సానుకూలంగా పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. వంతెన నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరు విషయమై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తో స్వయంగా మాట్లాడారు. ఈసమస్య పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని, వంతెననిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభమయ్యేలా తన వంతు సహకారాం అందిస్తానని గ్రామ కమిటీ ప్రతినిధులకు భరోసా ఇచ్చారు.

# పొదిలి సమీపంలో రోడ్డు ప్రమాదం

## డీసీఎం, మోటారు సైకిల్ ఢీ ఒకరు దుర్మరణం

**కొనకనమిట్ల, మే 16, ప్రభాతవార్త:** జార్లవాగు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. అతి వేగంతో దూసుకొచ్చిన డీసీఎం వాహనం, ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద తీవ్రతను బట్టి చూస్తే బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తికితీవ్ర రక్తస్రావమై ఘటనా స్థలంలోనే కన్నుమూశారు. మృతుడిని గుండ్లసముద్రం గ్రామానికి చెందిన లాఇల్ల రామయోగిగా గుర్తించారు. ఆయన కొంత కాలంగా పొదిలిలోనే నివాసం ఉంటున్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పొదిలి ఎస్సై ఎస్.రాజేష్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డుపై వెళ్తున్న డీసీఎం వాహనం ఒక్క సారిగా నియంత్రణ కోల్పోవడం వల్లే ఈ ఘోర ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం ప్రమాదానికి కారణమైన డీసీఎం వాహనాన్ని స్వాధీనం చేసుకుని, పరారీలో ఉన్న డ్రైవర్ వివరాలను సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. చేతికి అందివచ్చిన రామయోగి రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం ఆయన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. కుటుంబంలో విషాధ ఛాయలు అలుముకున్నాయి.

# రాష్ట్రవ్యాప్తంగా ఏపీ ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళన

**విజయవాడ,మే 16,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా ఏపీ ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం, ఆర్టీసీని ప్రైవేటీకరణ చేయాలనే ప్రయత్నాలు మానుకోవాలంటూ వారు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రమంతటా బస్‌స్టేషన్లు, డిపోలు ఎదుట వారు నిరసనలు చేపట్టారు.వృత్తిలో ఇబ్బందులకు గురైన కార్మికుల ప్రత్యామ్నాయ అవకాశాలు.బీమా మొత్తాలు పెంపుతదితరంశాలపై ఆర్టీసీ కార్మికులు తమకు న్యాయం చేయాలని కోరారు. కారుణ్య నియమకాలు వెంటనే చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్నఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు.

17-5Pg5.qxd:17-5Pg5.qxd 1/1/02 6:14 AM Page 1



# ఇరాన్‌పై మళ్లీ అమెరికా దాడులు!

## ఒప్పందానికి రాకుంటే మళ్లీ సైనిక చర్య తప్పదంటున్న ట్రంప్



**వాషింగ్టన్, టెహ్రాన్, మే 16:** శాంతి ఒప్పందానికి రాకుంటే మళ్లీ సైనిక చర్య తప్పదంటూ ఇరాన్‌కు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీచేస్తున్న ట్రంప్ తీరును చూస్తుంటే ఇరాన్‌పై అమెరికా మరోసారి దాడులకు సిద్ధమవుతోందని తాజా పరిణామాలు స్పష్టంచేస్తున్నాయి. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ, శాంతి చర్చలు కొలిక్కి రావడం లేదు. చర్చల్లో చాలా రోజులుగా ప్రతిష్టంభన కొనసాగుతోంది. చర్చలు ఎటూ తేలడం లేదు. ఇరాన్, అమెరికాఎవరికి వారు మొండి పట్టుదలతో ఉన్నారు. దీంతో సమస్య పరిష్కారానికి సైనిక చర్య ఒక్కటే సరైన దారి అని అమెరికా భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోసారి ఇరాన్‌పై దాడులు చేసేందుకు అమెరికా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈసారి దాడులకు ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ 2.0 అనే పేరు పెట్టినట్లు తెలుస్తోంది. అందులోనూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా చైనాలో పర్యటించడం ఈ ప్రచారానికి మరింత బలం చేకూరుస్తోంది. ఇరాన్ అణ్వాయుధ దేశం కావడాన్ని అమెరికాతోపాటు చైనా కూడా వ్యతిరేకించినట్లు అమెరికా తెలిపింది. ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండకూడదని ఇరు దేశాలు భావిస్తున్నాయి. దీంతో తాజా చర్చల్లో ఇరాన్‌పై దాడులు, అణ్వాయుధ తయారీ, హార్ముజ్ జలసంధి వంటి అంశాలు కూడా చర్చకు వచ్చాయి. ఇరాన్‌పై దాడులకు చైనా మద్దతును అమెరికా కోరినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, మళ్లీ దాడులకు దిగే అంశంపై అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. రెండు దేశాల మధ్య గత ఏప్రిల్ 7 నుంచి కాల్పుల విరమణ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. నెల రోజులు గడిచినప్పటికీ శాశ్వత శాంతి ఒప్పందం మాత్రం కుదరడం లేదు. ఇరాన్ శాంతి ప్రతిపాదనల్ని అమెరికా అంగీకరించడం లేదు. అణ్వాయుధ తయారీ అంశంలో అంగీకారం కుదరడం లేదు. అమెరికా ప్రతిపాదనల్ని ఇరాన్ వ్యతిరేకిస్తోంది. ప్రస్తుత పరిస్తితుల్లో ఇరాన్‌పై దాడులకు అమెరికా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మరోవైపు ఇజ్రాయెల్ కూడా ఇందుకు సిద్ధంగా ఉన్నట్లు అమెరికా ప్రతినిధులు తెలిపారు. త్వరలో ఇరాన్-అమెరికా మధ్య శాంతి ఒప్పందం కుదరకపోతే మళ్లీ దాడులు ప్రారంభమయ్యే అవకాశం మాత్రం ఉంది. ఇదే సమయంలో అవసరమైతే తిరిగి యుద్ధం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఇరాన్ కూడా ప్రకటించింది. మరోవైపు ఇరాన్‌పై యుద్ధం అంశం ట్రంప్‌కు రాజకీయంగా ఎలాంటి ఇబ్బందుల్ని తెస్తుందో చూడాలి. ఈ ఏడాది నవంబర్‌లో అమెరికాలో మిడ్ టర్మ్ ఎన్నికలు జరుగుతాయి.

### తైవాన్ స్వాతంత్ర్యం కోసం మేం పోరాడబోం: ట్రంప్

తైవాన్ అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. అది తమకు కష్టమైన సమస్యేనని వెల్లడించారు. భౌగోళికంగా ఆ ప్రాంతం తమకు చాలా దూరంలో ఉందని వ్యాఖ్యానించారు. 'తైవాన్ అంశం క్లిష్టమైన సమస్యే. ఈ ద్వీపం.. చైనాకు కేవలం 95 కిలోమీటర్ల దూరంలో ఉండగా, అమెరికాకు మాత్రం 15 వేల కి.మీ.లకు పైగా దూరాన ఉంది. ఎక్కువవ దూరం కావడంతో మేం వేగంగా స్పందించడం కష్టమే. చైనా చాలా శక్తివంతమైన, పెద్ద దేశం కూడా. ఉద్రిక్తతల విషయంలో చైనా, తైవాన్‌లు సంయమనం పాటించాలి' అని ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ ట్రంప్ చెప్పారు. వారి స్వాతంత్ర్య ఆకాంక్షల కోసం అంతదూరం ప్రయాణించి మేం యుద్ధం చేయాలని అనుకోవడం లేదన్నారు. చైనా పర్యటన అనంతరం ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. తైవాన్ సమస్యను సరిగ్గా పరిష్కరించకపోతే.. అమెరికా-చైనా మధ్య ఘర్షణ తలెత్తే ప్రమాదం ఉందని ట్రంప్‌నకు జిన్‌పింగ్ స్పష్టం చేసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అమెరికా-చైనాలు భాగస్వామ్య దేశాలుగా ఉండాలే తప్పా.. ప్రత్యర్థులుగా కాదని జిన్‌పింగ్ పేర్కొనడం గమనార్హం. తైవాన్‌న తనలో పూర్తిగా విలీనం చేసుకోవాలని చైనా కోరుకుంటోంది. తైవాన్ స్వాతంత్ర్యాన్ని అమెరికా బహిరంగంగా వ్యతిరేకించాలన్నది చైనా వాదన. 'తైవాన్ విషయంలో చైనా ఏకపక్ష చర్యలకు దిగరాదు' అని ఇంతకాలం అమెరికా స్పష్టం చేస్తూ వచ్చింది. దానికి భిన్నంగా ఇప్పుడు ట్రంప్ మాట్లాడుతున్నారు. తైవాన్‌కు ఆయుధాలు విక్రయించాలా, వద్దా అనే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పడమూ ఆయన వైఖరిలో మార్పును వెల్లడిస్తోంది.



# నెదర్లాండ్స్‌లో ప్రధానిమోడీకి ఎన్ఆర్ఐల అపూర్వ స్వాగతం

**హేగ్, మే 16:** ప్రధాని నరేంద్ర మోడీ తన నెదర్లాండ్స్ పర్యటనలో భాగంగా రాజధాని హేగనగరంలో ప్రవాసభారతీయులు శనివారం అపూర్వస్వాగతం పలికారు. ప్రధాని మోడీ రాక పట్ల వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రధానిని చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రవాస భారతీయులు ఆనందోత్సాహాలతో నిండిపోయారు. ఈ సందర్భంగా పలువురు ప్రవాసులు తమ సంతోషాన్ని పంచుకున్నారు. "మా దేశానికి విచ్చేసిన ప్రధాని మోడీకి స్వాగతం పలకడం మాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాం. ఆయన రాక మా అందరికీ గర్వకారణం" అని ఒకరు వ్యాఖ్యానించారు. "ఈ ఉదయం హేగ్‌లో ప్రధాని మోడీని చూసే అవకాశం రావడం నా అదృష్టం" అని మరో ప్రవాస భారతీయుడు తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. రామాయణ వరల్డ్ సంస్థ ప్రతినిధులు కూడా ప్రధానిని కలిసేందుకు ఎంతో ఉత్సాహంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, తమకు అవకాశం కల్పించినందుకు భారత రాయబార కార్యాలయానికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. మరోవైపు, ప్రవాస భారతీయులు చూపిన ఆదరణపై ప్రధాని మోడీ కూడా స్పందించారు. నెదర్లాండ్స్‌లో తనకు లభించిన స్వాగతం అద్భుతంగా ఉందని ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ లో పేర్కొన్నారు. కథక్, ఒడిస్సీ, భరతనాట్యం, కూచిపూడి, మోహినియాట్టం వంటి శాస్త్రీయ నృత్యాలతో పాటు గర్బా ప్రదర్శనతో తనకు స్వాగతం పలకడం విశేషమని ఆయన తన పోస్టులో వివరించారు. ఆ కార్యక్రమానికి సంబంధించిన కొన్ని ఫోటోలను కూడా పంచుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ, నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. డచ్ రాజు విల్లెంఅలెగ్జాండర్, రాణి మాక్సిమాతో కూడా సమావేశమవుతారు. మే 17 వరకు కొనసాగనున్న ఈ పర్యటనలో, అక్కడి ప్రముఖ వ్యాపారవేత్తలతోనూ ప్రధాని భేటీ కానున్నారు. 2017 తర్వాత మోడీ నెదర్లాండ్స్‌లో పర్యటించడం ఇది రెండోసారి. భారత్‌నెదర్లాండ్స్ ద్వైపాక్షిక సంబంధాలలో ఈ పర్యటనను చాలా కీలకమైనదిగా నెదర్లాండ్స్ భావిస్తోంది.

# యూరోప్ జనాభా కంటే ఎక్కువ మంది భారత్‌లో ఓటర్లు

### నెదర్లాండ్స్ పర్యటనలో ప్రధాని మోడీ

**హేగ్, మే 16:** మొత్తంయూరోప్‌లో ఉన్న జనాభాకంటే ఎక్కువోటర్లు భారత్‌లో ఉన్నారని, తమ దేశంలో 90 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని ప్రధాని నరేంద్రమోడీ చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 64 కోట్ల మంది ఓటు వేశారని యూరప్ దేశాల జనాభా మొత్తం కలిపినా 64 కోట్ల మంది కూడా లేరని వ్యాఖ్యానించారు. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ఆయన హేగ్ నగరంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధానికి అక్కడ సాంస్కృతిక కార్యక్రమాలతో ఘనస్వాగతం లభించింది. ప్రవాస భారతీయులతో కరచాలనం, మాటామంతీ నిర్వహించారు. నెదర్లాండ్స్ నాయకత్వంతో ఎప్పుడు మాట్లాడినా ప్రవాస భారతీయులను ఎంతో ప్రశంసించేవారని ఈ సందర్భంగా ప్రధాని గుర్తు చేసుకున్నారు. హేగ్ నగరం భారతీయ స్నేహానికి సజీవ చిహ్నంగా మారిందన్నారు. కాలం మారినా భారతీయ సంస్కృతి మారలేదని కొనియాడారు. ఈ సందర్భంగా ఈయూ దేశాలను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. డిజిటల్ చెల్లింపుల్లో భారత్ అగ్రస్థానంలో ఉన్నదని, నెలకు 20 బిలియన్ డాలర్ల విలువైన డిజిటల్ చెల్లింపులు జరుగుతున్నాయని చెప్పారు. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవని, ఇప్పుడు ఆ సంఖ్య 100 దాటిందని తెలిపారు. సెమీకండక్టర్ల విషయంలో భారత్ కీలక ముందడుగు వేసిందని అన్నారు. భారత్‌లో సెమీ కండక్టర్ ప్లాంట్ల పనులు జరుగుతున్నాయని చెప్పారు. మేడిన్ ఇండియా చిప్‌లు తయారవుతున్నాయని, ఏఐ సమ్మిట్, జీ20 సమావేశాలను విజయవంతంగా నిర్వహించగలిగామని ప్రధాని గుర్తుచేశారు.

# వెళ్తే వెళ్లండి.. కొత్తగా పార్టీ నిర్మిస్తా!

### పార్టీ నేతల సమావేశంలో మాజీ సిఎం మమతా బెనర్జీ



**కోల్‌కత్తా, మే 16:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేధాలు తలెత్తాయనే ఊహాగానాలు వినిపించాయి. ఈ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారని తెలుస్తోంది. పార్టీలో ఉండాలనుకునే వారు ఉండవచ్చని, వద్దనుకునే వాళ్ళు వెళ్ళిపోవచ్చని ఆమె స్పష్టంగా చెప్పినట్లు టీఎంసీ వర్గాలు వెల్లడి ంచాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులతో కాళీఘాట్‌లోని తన నివాసంలో మమతా బెనర్జీ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ పార్టీ తిరిగి పుంజుకుంటుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ మారాలనుకునే వారిని వెళ్ళనీయండని, పార్టీని కొత్తగా నిర్మిస్తానని ధీమా వ్యక్తం చేశారు. దెబ్బతిన్న పార్టీ కార్యాలయాలను పునర్నిర్మించాలని సూచించారు. వాటికి రంగులు వేద్దామని, అవసరమైతే తాను కూడా వేస్తానని తెలిపారు. టీఎంసీ ఎప్పటికీ తలవంచదని అన్నారు. ప్రజల తీర్పును వారు దొంగిలించారని విమర్శించారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ పార్టీ మళ్లీ పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. పార్టీ నుంచి వెళ్లాలనుకునేవారు వెళ్లిపోవచ్చని, తాను పార్టీని మళ్లీ కొత్తగా నిర్మిస్తానని అన్నారు. పార్టీలోనే ఉండాలని అనుకునేవాళ్ల ప్రత్యర్థుల చేతిలో దెబ్బతిన్న పార్టీ కార్యాలయాలను పునర్నిర్మించాలని పిలుపునిచ్చారు. కార్యాలయాలను పునర్నిర్మించి రంగులు వేయాలని సూచించారు. అవసరమైతే తాను కూడా స్వయంగా పార్టీ కార్యాలయాలకు రంగులు వేస్తానని చెప్పారు. టీఎంసీ ఎప్పటికీ తల వంచదని చెప్పారు.

ప్రజల తీర్పును బీజేపీ దొంగిలించిందని విమర్శించారు. తృణమూల్ పార్టీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఈ సమావేశానికి సంబంధించిన ఫోటోలను పంచుకుంది.

ఆ పోస్టుకు టీఎంసీ ఒక కుటుంబంలా ఐక్యంగా నిలుస్తుంది. ప్రజల తీర్పును దోచుకునే వారి ముందు మేం ఎప్పటికీ తలవంచం. సత్యమే గెలుస్తుందని క్యాప్షన్ రాసింది. కాగా బెంగాల్‌లో మొత్తం 294 స్థానాలకు ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా 3 దఫాలుగా అధికారంలో ఉన్న టీఎంసీ కేవలం 80 సీట్లనే గెలుచుకుంది.

మమతకు కంచుకోట అయిన భవానీపూర్‌లో ఆమె ఓటమి పాలయ్యారు.

# 19, 20 తేదీల్లో పుతిన్ చైనా పర్యటన..



**మాస్కో, మే 16:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చైనాలో పర్యటించనున్నారు. ఈనెల19, 20వ తేదీల్లో ఆయన పర్యటన కొనసాగుతుంది. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ఆయన భేటీ కానున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టూర్ చేసిన కొన్ని రోజుల తేడాలోనే రష్యా అధ్యక్షుడు చైనా ట్రిప్‌కు వెళ్తున్నారు. పుతిన్, జిన్‌పింగ్ ఇద్దరూ ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. అంతర్జాతీయ, ప్రాంతీయ సమస్యలపై స్పందించనున్నారు. సంయుక్త డిక్లరేషన్‌పై ఇద్దరు నేతలు సంతకం చేయనున్నారు. ఇరాన్ సంక్షోభం నేపథ్యంలో ఇద్దరు నేతల భేటీ కీలకం కానున్నది. రష్యా అధ్యక్షుడికి చైనా ఆహ్వానం పంపినట్లు క్రెమ్లిన్ తన ప్రకటనలో తెలిపింది. పుతిన్ తన పర్యటనలో చైనా ప్రధాని లీక్వి యాంగ్‌ను కూడా కలుసుకుంటారు. వాణిజ్యం, ఆర్థిక సంబంధాలపై చర్చించనున్నారు. గత ఆగస్టులోనే పుతిన్ చైనాలో విజిట్ చేశారు. బీజింగ్‌లో షాంఘై కార్పొరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్ జరిగినప్పుడు పుతిన్ వెళ్లారు. చైనాలో పర్యటించనున్నారు. నవంబర్‌లో షెన్‌జెన్‌లో జరిగే ఏషియా పసిఫిక్ ఎకనామిక్ కార్పొరేషన్ మీటింగ్‌కు హాజరుకానున్నారు.

# యుపిలో ప్రసాదం తిన్న భక్తుల్లో 62 మందికి అస్వస్థత

**కన్నౌజ్, మే 16:** ఉత్తర ప్రదేశ్‌లోని ఒక గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రసాదం తిన్న భక్తుల్లో 62 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన యూపీలోని కన్నౌజ్ జిల్లా, సిమోపూర్ గ్రామానికి చెందిన మున్నాలాల్ కశ్యప్ అనే వ్యక్తి తన ఇంటిలో ఒక ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా బంధువులు, సన్నిహితుల్ని ఆహ్వానించారు. కార్యక్రమం అనంతరం అందరికీ భోజన ప్రసాదం అందించారు. అయితే, ఈ ప్రసాదం తిన్న తర్వాత భక్తులకు కొన్ని గంటల్లోనే కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు వంటివి మొదలయ్యాయి. రాత్రి పూట బలహీనంగా తయారయ్యారు. దీంతో వారి బంధువులు, కుటుంబ సభ్యులు ముందుగా ప్రథమ చికిత్స కోసం స్థానిక ప్రైవేటు క్లినిక్‌లకు తీసుకెళ్లారు. అయితే, ఇలాంటి లక్షణాలే ఎక్కువ మందికి కనిపించడం, కొందరి పరిస్థితి మరీ విషమించడంతో జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రికి అర్ధరాత్రి తరలించారు.

# మంత్రులకు శాఖలు కేటాయించిన సిఎం విజయ్

### హోం, మహిళా శిశుసంక్షేమం, రెవెన్యూ సిఎం వద్దనే..



**చెన్నై,మే 16:** తమిళనాడులో కొత్తగా ఏర్పడిన టీవీకే ప్రభుత్వంలోని మంత్రులకు శాఖలను శనివారం కేటాయించారు. హోం, పోలీస్, మహిళా శిశు సంక్షేమం వంటి కీలక శాఖలను ముఖ్యమంత్రి విజయ్ తన వద్దే ఉంచుకున్నారు. ప్రజా, సాధారణ పరిపాలన, రెవెన్యూ, ప్రత్యేక కార్యక్రమాల అమలు, యువజన, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమం, పురపాలక పరిపాలన, పట్టణ, నీటి సరఫరా శాఖల బాధ్యతలు కూడా ఆయన నిర్వహించనున్నారు. సీనియర్ నేత కేప సెంగోట్టయ్యన్‌కు ఆర్థిక శాఖ కేటాయించారు. కొత్త ప్రభుత్వంలో ఆర్థిక, పెన్షన్లు, పెన్షన్ అలవెన్సుల శాఖలను ఆయన నిర్వహిస్తారు. విజయ్ కేబినెట్‌లో పిన్న వయస్కురాలైన మంత్రి సెల్వి ఎస్ కీర్తనకు పరిశ్రమల శాఖను కేటాయించారు. పెట్టుబడుల ప్రోత్సాహ శాఖ బాధ్యతలను కూడా ఆమె పర్యవేక్షిస్తారు. మరోవైపు టీవీకేలో కీలకమైన ఎన్ ఆనంద్ గ్రామీణాభివృద్ధి, జలవనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీలు, పంచాయతీ యూనియన్, పేదరిక నిర్మూలన, గ్రామీణ రుణగ్రస్తత, చిన్న నీటిపారుదలతో సహా సాగునీటి ప్రాజెక్టులు ఆయన పరిధిలోని శాఖల్లో ఉన్నాయి. మరో మంత్రి ఆదవ్ అర్జునకు ప్రజా పనులు, క్రీడాభివృద్ధి శాఖలు కేటాయించారు. క్రీడాభివృద్ధితో పాటు భవనాలు, రహదారులు, చిన్న ఓడరేవులతో సహా ప్రజా పనులను ఆయన పర్యవేక్షిస్తారు. డాక్టర్ కేజీ అరుణ్‌రాజ్‌కు ఆరోగ్యం, వైద్య విద్య, కుటుంబ సంక్షేమ శాఖలను కేటాయించారు. పి. వెంకటరమణన్‌కు ఆహార, పౌర సరఫరాల శాఖలు లభించాయి. వినియోగదారుల పరిరక్షణ, ధరల నియంత్రణ వ్యవహారాలు కూ ఆయన పర్యవేక్షణలో ఉన్నాయి. మరో మంత్రి ఆర్. నిర్మల్ కుమార్‌కు ఇంధన వనరులు, న్యాయ శాఖ బాధ్యతలు అప్పగించారు. విద్యుత్, సంప్రదాయేతర ఇంధన అభివృద్ధి, న్యాయ శాఖ, న్యాయస్థానాలు, జైళ్లు, అవినీతి నివారణ, శాసనసభ, గవర్నర్, ఎన్నికలు, పాస్‌పోర్ట్‌ల శాఖలు ఆయన పరిధిలోకి వస్తాయి. మంత్రి రాజ్‌మోహన్‌కు పాఠశాల విద్య, తమిళ అభివృద్ధి, సమాచార, ప్రచార శాఖ బాధ్యతలు అప్పగించారు. పురావస్తు శాస్త్రం, తమిళ అధికార భాష, తమిళ సంస్కృతి, ఫిల్మ్ టెక్నాలజీ, సినిమాటోగ్రాఫ్ చట్టం, న్యూస్‌ప్రింట్ నియంత్రణ, స్టేషనరీ, ప్రింటింగ్, ప్రభుత్వ ముద్రణాలయాలను కూడా ఆయన పర్యవేక్షిస్తారు. మరో మంత్రి డాక్టర్ టి.కె. ప్రభుకు సహజ వనరుల శాఖను కేటాయించారు. ఖనిజాలు, గనుల శాఖల బాధ్యతలను ఆయనకు అప్పగించారు.



# మాల్దీవుల్లో విషాదం.. స్కూబా డైవింగ్‌కు వెళ్లి ఐదుగురు మృతి

### కొనసాగుతున్న గాలింపు చర్యలు

**మాలె, మే 16:** పర్యాటక కేంద్రమైన మాల్దీవుల్లో విషాదం జరిగింది. అక్కడి దీవుల్లోని ఒక సముద్ర గర్భంలోని గుహలోకి స్కూబా డైవింగ్ చేస్తూ వెళ్లిన ఐదుగురు అన్వేషకులు ప్రాణాలు కోల్పోయారు. దేశ చరిత్రలోనే ఇది అతిపెద్ద స్కూబా డైవింగ్ ప్రమాదమని అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. ఇటలీకి చెందిన మోనికా మాంటె ఫాల్కన్, జార్జియా సోమాకల్, ఫెడెరికో గ్వాల్టైరి, మ్యురియెల్ ఒడెనినో, జియాన్లుకా బెనెడెట్టి అనే ఐదుగురు స్కూబా డైవర్లు వావు అటోల్ అనే సముద్ర గర్భంలోని గుహలోకి గురువారం అన్వేషణకు వెళ్లారు. ఇది దాదాపు 50 మీటర్ల లోతు ఉంటుంది. నీళ్లలో అన్వేషణకు వెళ్లిన వారు ఎంతసేపటికి పైకి రాలేదు. దీనిపై సమాచారం అందుకున్న అధికారులు, రక్షక దళాలు సహాయక చర్యలు ప్రారంభించాయి. ఐదుగురి కోసం అన్వేషణ సాగిస్తున్నాయి. వీరిలో బెనెడెట్టి అనే ఒక స్కూబా డైవర్ మృతదేహం మాత్రమే దొరికింది. నీళ్లలో గుహ ముఖద్వారం వద్ద అతడి మృతదేహం లభ్యమైంది. మిగతా నలుగురి కోసం ఆపరేషన్ కొనసాగుతోంది.

# సంక్షిప్తంగా..

## తమిళ సిఎం విజయ్‌కి ఇంటినుంచే లంచ్‌బాక్స్!

**చెన్నై, మే 16:** తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నటుడు సి. జోసెఫ్ విజయ్, తన విలక్షణమైన పనితీరుతో వార్తల్లో నిలుస్తున్నారు. ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచే ఆయన అనుసరిస్తున్న క్రమశిక్షణ, సమయపాలన రాష్ట్ర అధికార వర్గాల్లో చర్చకు దారితీసాయి. ఓ సాధారణ ప్రభుత్వ ఉద్యోగి మాదిరిగా ఆయన వ్యవహరిస్తున్న తీరుపై ఉన్నతాధికారులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 10న ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విజయ్ ప్రతిరోజూ నిర్దేశిత సమయానికి పావుగంట ముందే చెన్నైలోని సెయింట్ జార్జ్ కోటలో ఉన్న సచివాలయానికి చేరుకుంటున్నారు. ఇంటి నుంచి స్వయంగా లంచ్ బాక్స్ తెచ్చుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. భోజన విరామ సమయంలో కూడా తన ఛాంబర్‌కే పరిమితమై, భోజనం ముగించి వెంటనే తిరిగి విధుల్లో నిమగ్నమవుతున్నారు.

## అతీంద్రియ శక్తులున్నాయని నమ్మించి పలువురిపై అత్యాచారం!

**లండన్, మే 16:** తనకు అతీంద్రియ శక్తులున్నాయని నమ్మించి 12 ఏళ్ల బాలికలు సహా పలువురు మహిళలపై అత్యాచారాలకు పాల్పడిన భారత సంతతి ఇమామ్‌కు యూకే కోర్టు జీవిత ఖైదు విధించింది. తూర్పు లండన్‌కు చెందిన 54 ఏళ్ల అబ్దుల్ హాలీమ్ ఖాన్ కనీసం 20 సంవత్సరాలు జైలులో గడపాలని స్నారెస్‌బ్రూక్ క్రౌన్ కోర్టు తీర్పు వెలువరించింది. ఓల్డ్ ఫోర్డ్ రోడ్‌లో ఇమామ్‌గా పనిచేస్తున్న అబ్దుల్ హాలీమ్ ఖాన్ తన మతపరమైన హోదాను అడ్డం పెట్టుకుని తొమ్మిదేళ్ల పాటు ఘోరాలకు పాల్పడ్డాడు. 2005 నుంచి 2014 మధ్య కాలంలో ఏడుగురు మహిళలు, బాలికలను లైంగికంగా హింసించాడు. బాధితులతో ఏకాంతంగా మాట్లాడాలని చెప్పి వారిని ఫ్లాట్లు, రహస్య ప్రదేశాలకు పిలిపించేవాడు. అక్కడ వారిపై లైంగిక దాడికి పాల్పడుతూ తనను ఒక అతీత శక్తి (జిన్) ఆవహించిందని నమ్మించే ప్రయత్నం చేసేవాడని విచారణలో తేలింది.

## గ్యాంగ్‌రేప్ కేసు-ఇద్దరు మహిళలు సహా ఐదుగురి అరెస్ట్

**గ్వాలియర్, మే 16:** మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో కిడ్నాప్‌కు గురైన బాలికపై బెంగళూరులో సామూహిక అత్యాచారం జరిగిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఈ దారుణమైన కేసులో ఇద్దరు మహిళలు సహా ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది జనవరిలో గ్వాలియర్‌కు చెందిన బాలికను నిందితులు కిడ్నాప్ చేసి బెంగళూరుకు తరలించారు. బాలిక కనిపించకపోవడంతో ఆమె తల్లి ఫిబ్రవరిలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కుమార్తెను మాయమాటలు చెప్పి బెంగళూరుకు తీసుకెళ్లారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించి, బెంగళూరులో బాలికను గుర్తించి రక్షించారు. ఆ సమయంలో ఆమెను బందీగా ఉంచిన ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు.

## ఐసిస్ అగ్ర కమాండర్ హతం : ట్రంప్ పోస్టు

**వాషింగ్టన్, మే 16:** ఐసిస్ అగ్ర కమాండర్ అబు-బిలాల్ అల్-మినూకిని మట్టుబెట్టినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అమెరికా, నైజీరియా సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించాయి. అతడి మృతితో ప్రపంచవ్యాప్తంగా ఐసిస్ కార్యకలాపాలు మరింత బలహీనమవుతాయని ట్రూత్‌లో ట్రంప్ పోస్టు పెట్టారు. 'నా ఆదేశాల మేరకు అమెరికా బలగాలు, నైజీరియా భద్రతా బలగాలు ఐసిస్ అగ్ర కమాండర్ అబు-బిలాల్ అల్-మినూకిని మట్టుబెట్టాయి. ఐసిస్‌లో రెండో అత్యున్నత హోదాలో ఉన్న మినూకి ఆఫ్రికాల్లో దాక్కోగలనని భావించాడు. కానీ మా గూఢచార వర్గాలు అక్కడా ఉన్నాయనే విషయం తెలుసుకోలేకపోయాడు. ఇక అతడు ఆఫ్రికా ప్రజలను భయభ్రాంతులకు గురిచేయలేడు. అమెరికన్ల లక్ష్యంగా ఆపరేషన్లకు ప్లాన్ చేయడంలో సహకరించలేడు. అమెరికాతో కలిసి పనిచేసిన నైజీరియా ప్రభుత్వానికి థాంక్స్' అని ట్రంప్ రాసుకొచ్చారు.

## మనీలాండరింగ్ కేసులో ప్రియాంకగాంధీ భర్త వాద్రాకు ఊరట!

**గురుగ్రామ్, మే 16:** హర్యానాలోని గురుగ్రామ్ భూ కుంభకోణం, మనీలాండరింగ్ కేసులో ప్రముఖ వ్యాపారవేత్త, కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రాకు బెయిల్ లభించింది. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. దాంతో వాద్రాకు పెద్ద ఉపశమనం లభించినట్లయ్యింది. ఇవాళ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరైన వాద్రాకు ప్రత్యేక న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రాబర్ట్ వాద్రాకు చెందిన స్కై లైట్ హాస్పిటాలిటీ సంస్థ 2008లో హర్యానాలోని శిఖోపూర్ గ్రామంలో ఒంకార్వేగర్ ప్రాపర్టీస్ నుంచి 3.53 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. ఈ డీల్ సమయంలో వాద్రా తప్పుడు పత్రాలు సమర్పించారని, ఎలాంటి నగదు చెల్లించకుండా (నగదుగా మారని చెక్కు ద్వారా) లావాదేవీలు జరిపారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరోపించింది.

# మైనర్‌బాలిక 28 వారాల ప్రెగ్నెన్సీ తొలగించండి

### ప్రభుత్వ వైద్యకళాశాలకు మద్రాస్ హైకోర్టు ఆదేశం

**చెన్నై, మే 16:** 12 ఏళ్ల మైనర్ బాలిక గర్భం దాల్చిన కేసులో తీర్పు ఇచ్చింది. 28 వారాల ప్రెగ్నెన్సీ తొలగించాలని మద్రాసు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.ప్రభుత్వ నమ్మక్కల్ మెడికల్ కాలేజీ, ఆస్పత్రికి ఈ ఆదేశాలు జారీ చేసింది. మైనర్ అమ్మాయిపై లైంగిక దాడికి పాల్పడి ఆమెను గర్భవతిని చేశారు. ఆమె ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రెగ్నెన్సీ తొలగించాలని మద్రాసు హైకోర్టు ఆదేశించింది. హైకోర్టుకు చెందిన వెకేషన్ బెంచ్ ఈ ఆదేశాలు ఇచ్చింది. మైనర్లు గర్భం దాల్చడాన్ని ఇటీవల సుప్రీంకోర్టు వ్యతిరేకించిన విషయం తెలిసిందే. కేసులను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే కొత్త చట్టాన్ని రూపొందించాలని సుప్రీం తన ఆదేశాల్లో పేర్కొన్నది. పాత చట్టాల ప్రకారం మైనర్లు తమ గర్భాన్ని తొలగించుకునేందుకు 20 వారాల వరకు అనుమతి ఉన్నది. తమిళనాడు కేసులో బాధితురాలి తల్లి మద్రాసు హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. 12 ఏళ్ల తన కూతుర్ని ఓ నిందితుడు రేప్ చేసినట్లు ఆమె పేర్కొన్నది. బీఎన్ఎస్ సెక్షన్ 87 కింద క్రిమినల్ కేసు నమోదు చేశారు. 2021 పోక్సో చట్టంలోని వివిధ సెక్షన్లకింద మరియు 6 కింద కేసు బుక్ చేశారు. ప్రస్తుతం ఆ మైనర్ గర్భం దాల్చి 28 వారాలు అవుతోంది. ఆ అమ్మాయికి ప్రభుత్వ నమ్మకల్ మెడికల్ కాలేజీలో చికిత్స జరుగుతోంది. అయితే ప్రెగ్నెన్సీ తొలగించేందుకు ప్రభుత్వ అనుమతి కావాలని తల్లి తన పిటీషన్‌లో కోరింది. మద్రాసు హైకోర్టు జస్టిస్ ఎల్ విక్టోరియా గౌరి ఈ కేసులో తీర్పు ఇచ్చారు. ప్రెగ్నెన్సీ తీసివేసేందుకు ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరం లేదని, కానీ పాజిటివ్ దిశలో ఆదేశాలు కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరారు. ప్రభుత్వ వివరణను ఆమోదించిన కోర్టు ప్రెగ్నెన్సీ తొలగించాలని ఆదేశిస్తూ, పిటీషన్‌ను క్లోజ్ చేశారు. ప్రెగ్నెన్సీ తొలగింపు విషయంలో కొన్ని రూల్స్ ఉన్నాయి.

# దేశంలో తొలిసారి రూ.182 కోట్ల జీహాదీ డ్రగ్స్ రికవరీ

### కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

**న్యూఢిల్లీ, మే 16:** దేశంలో తొలిసారి జిహాదీ డ్రగ్ ను స్వాధీనం చేసుకున్నట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చెప్పారు. అంతర్జాతీయ నార్కోటిక్స్ ట్రాఫిక్కింగ్ బృందంపై ఉక్కుపాదం మోపినట్లు తెలిపారు. కాప్టగాన్ అనే ఆ డ్రగ్ విలువ మార్కెట్లో సుమారు 182 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. డ్రగ్స్ పట్టివేతకు ఆపరేషన్ రేజ్‌పిల్ అనే కోడ్ నేమ్ పెట్టారు. డ్రగ్ ట్రాఫిక్కింగ్‌కు పాల్పడిన విదేశీ వ్యక్తిని అరెస్టు చేశారు. ఆ కన్‌సైన్మెంట్ ను పశ్చిమాసియా దేశాలకు తరలిస్తున్నారు. ఇండియాను ట్రాన్సిట్ మార్గంలో వాడేందుకు ప్రయత్నించారు. అమిత్ షా తన ఎక్స్ అకౌంట్‌లో ఈ విషయాన్ని చెప్పారు. డ్రగ్ ఫ్రీ ఇండియా కావలన్న లక్ష్యంతో మోడీ సర్కారు పనిచేస్తోందని వివరించారు.



## తిరుపతిలో వైసిపి,కూటమినేతల ధర్నాతో ఉద్రిక్తత

**తిరుపతి,మే 16ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో అటు వైసిపి నేతలు ఇటు కూటమి పార్టీల మహిళలు రోడ్డుపైకి రావడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. తిరుపతిలో రౌడీయిజం పెరిగిపోయిందని వైసిపి నేతలు, వైసిపి గంజాయి ఆగడాలు ఎక్కువయ్యాయని కూటమి పార్టీల మహిళలు రోడ్డుపైకి రావడంతో శనివారం ఉదయం గాంధీ విగ్రహం వద్ద ఆందోళనకు దిగారు. ఇరువర్గాలు మాటామాటా నినాదాలతో పరిస్థితి అదుపుతప్పింది. గొడవలకు దిగే పరిస్థితితో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. దీంతో పరిస్థితి చక్కబడింది. భూమన కుటుంబానికి వ్యతిరేకంగా మహిళల ఆందోళనచేయడం, రౌడీబ్యాచ్‌ను అరెస్టు చేయాలని వైసిపి నేతలు హంగామాతో ఈ పరిస్థితి ఏర్పడింది.

## ప్రేమ విఫలమవడంతోనే యువతి ఆత్మహత్య



ఆదిలక్ష్మి (ఫైల్)

**తిరుపతి, మే 16 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి నగరంలోని గరుడ వారధిపై నుండి క్రిందపడి ఆత్మహత్య చేసుకున్న యువతి ఘటనలో ప్రేమ విఫలమే కారణంగా పోలీసులు తెలిపారు. వారధిపై నుండి దూకి నంద్యాల జిల్లా జూపాడు బంగ్లా పాయ మంచాలకు చెందిన ఆదిలక్ష్మి (27)ఆత్మహత్య చేసుకుంది. తిరుపతికి వలస వచ్చిన సోదరుడు అన్నాసాములు వివరాలతో ప్రేమ విఫలమ వడంతోనే ఈ అఘాయిత్యానికి పాల్పడింది. తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయిందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు తిరుపతి ఈస్ట్ ఎస్ఐ స్వాతి తెలిపారు.



## తిరుపతిలో కామాంధుడి దిష్టిబొమ్మ దగ్ధం

### నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలన్న ప్రజా సంఘాలు

**తిరుపతి,మే 16ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జిఎస్‌టి కార్యాలయంలో పనిచేస్తున్న రామ్మూర్తి తన వదిన కుమార్తె అని కూడా చూడకుండా(16 )ఏళ్ల బాలికను మాయమాటలు చెప్పి లొంగదీసుకుని పలుమార్లు అత్యాచారానికి పాల్పడి, అనంతరం బాలికను కిడ్నాప్ చేసి పరారీలో ఉన్నాడని ఆరోపిస్తూ ఐద్వా మహిళ సంఘాలు ఆందోళన చేపట్టారు. తిరుపతి సుందరయ్య నగర్ కూడలి వద్ద ఐద్వా ,వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కామాంధుడి దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి. సాయి లక్ష్మి, సిఐటియు శ్రామిక మహిళా కన్వీనర్ లక్ష్మి మాట్లాడుతూ కూతురితో సమానమైన మైనర్ బాలికను మోసం చేసి అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబం పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా అధికారులు సరైన స్పందన ఇవ్వడం లేదని విమర్శించారు. హైదరాబాద్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ, ఇక్కడ కేసు నమోదు చేయడంలోను నిందితున్ని అరెస్టు చేయడంలోనూ పోలీసులు నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బాధితురాలి కుటుంబ సభ్యుల వేదనను పట్టించుకోకుండా మీ కేసును మీ ఊరికి వెళ్లండి.. మేము చూసుకుంటాం అనే విధంగా మాట్లాడటం బాధాకరమని అన్నారు. కన్న కూతురు ఎక్కడుందో ఎలా ఉందో తెలియకుండా ఊరికి ఎలా పోగలమని బాధిత కుటుంబం ఆవేదన చెందుతోంది. నిందితుడిని వెంటనే పట్టుకుని మైనర్ బాలికను సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగంలో ఉండి కూడా నైతిక విలువలు పాటించకుండా వ్యవహరించిన నిందితుడిని వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని సంబంధిత అధికారులను కోరారు. అతనిపై పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో తక్షణమే అరెస్ట్ చేసి, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ పూర్తి చేసి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వందవాసి నాగరాజు, సుబ్రహ్మణ్యం, జయచంద్ర, వేణు, బాలసుబ్రమణ్యం, కెఆర్ఎస్ మన్యం,వేణు, బుజ్జి, సిద్దు, రాజు, ఎన్.డి. శ్రీను, ఐద్వా నగర ప్రధాన కార్య దర్శి జయంతి, సుజాతమ్మ, షకీలా, హేమలత, కోమలమ్మ తదితరులు పాల్గొన్నారు.




## ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కండి

### తిరుపతిలో భారీ ర్యాలీ

**తిరుపతి,మే 16ప్రభాతవార్తప్రతినిధి:** ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని తిరుపతిలో నగరపాలక సంస్థ, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ప్లాస్టిక్ నివారణపై తిరుపతిలోని పాత మునిసిపల్ కార్యాలయం నుండి శనివారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే నష్టాల గూర్చి ప్రజలకు అవగాహన కల్పించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర భాగంగా ప్రతి మూడవ శనివారం ఒక థీమ్ తో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. "ప్లాస్టిక్ ఫ్రీ రాష్ట్రం" అనే ఆశయంతో ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే నష్టాలను ప్రజలకు వివరించి, పూర్తిగా ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యమని తెలిపారు. తిరుపతిని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వలన అనేక అనర్థాలు కలుగుతున్నాయని వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని తెలిపారు.

ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు,జ్యూట్ బ్యాగులు వంటి పర్యావరణహితమైన వస్తువులను వినియోగించాలని తెలిపారు. ఈ ర్యాలీలో రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం,నగరపాలక సంస్థ కమిషనర్ శారదాదేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఇ శ్యాం సుందర్, ఎంఇలు తులసి కుమార్, గోమతి, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులురూయాప్స్ స్ పి. చిట్టిబాబు, ప్రగతి రమణ, వర్ధ గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

## తాతయ్యగుంట గంగమ్మకు వెండిజడ విరాళం



**తిరుపతి,మే16ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి నగర గ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మకు దాత వెండిజడ ఆభరణం విరాళంగా అందించారు. ఇమ్మడి సిల్వర్ జువెలరీ ఆధ్వర్యంలో తాతయ్యగుంట గంగమ్మకి ప్రత్యేకంగా తయారు చేసిన వెండి జడ ఆభరణాన్ని భక్తి శ్రద్ధలతో సమర్పించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో ఇమ్మడి సిల్వర్ జువెలరీ అధినేత మురళీకృష్ణ ,సతీమణి కీర్తి ,కుమార్తె హైరా చేతుల మీదుగా ఆలయ ఇఒ ఎ.జయకుమార్‌కు వెండి జడ ఆభరణాన్ని అందజేశారు. గంగమ్మకు జాతర తరువాత వచ్చే ఐదు మంగళవారాలు, శుక్రవారాల్లో ఈ ఆభరణం అలంకరిస్తారు.

## ఆధ్యాత్మికత శోభిల్లేలా గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

### 27న గరుడ సేవ, 30న రథోత్సవం



**తిరుమల,మే 16ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలుఈనెల 23 నుండి 31వ తేదీ వరకు అత్యంత వైభవంగా, మరింత ఆధ్యాత్మిక శోభ కనిపించేలా నిర్వహించనున్నట్లు టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర తెలిపారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను టిటిడి జెఇఒలు వి వీరబ్రహ్మం, డాక్టర్ ఎ.శరత్, సివిఎస్ఒ కే వి మురళీకృష్ణ ,సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలిసి శనివారం ఉదయం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇఒ రవిచంద్ర మాట్లాడుతూ శ్రీ గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయ వైభవాలకు ప్రతీకగా నిలిచేలా అన్ని శాఖలు సమన్వయంతో విశేష ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వేసవి దృష్ట్యా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో కళ కళ లాడేలా చలువ పందిళ్లు, ఆకర్షణీయమైన విద్యుత్ అలంకరణలు, రంగురంగుల ముగ్గులు, పుష్పాలంకరణలు, వైట్ పెయింటింగ్, సాంప్రదాయ చిత్రకళా అలంకరణలు, ఎల్ఇడి స్క్రీన్లు తదితర ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. 22న సాయంత్రం 5.30 గంటల నుండి 8 గంటల వరకు అంకురార్పణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 23న ఉదయం 7.35 గంటల నుండి 8.49 గంటల వరకు మిథున లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. అదే రోజు రాత్రి పెద్దశేష వాహనంపై స్వామి వారు భక్తులకు దివ్య దర్శనమివ్వనున్నారు. ప్రతిరోజూ ఉదయం 7 నుండి 9 గంటల వరకు, రాత్రి 7నుండి 9 గంటల వరకు నిర్వహించనున్న వాహనసేవలు భక్తి పారవశ్యాన్ని పంచనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా మే 27న గరుడవాహన సేవ, మే 30న రథోత్సవం బ్రహ్మోత్సవాలకు ఆకర్షణగా నిలవనున్నాయి. **24న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం, 25న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనం, 26నఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం, 27న ఉదయం మోహినీ అవతారం, రాత్రి గరుడ వాహనం, 28న ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజ వాహనం, 29న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, 30న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, చివరగా 31వతేదీ ఉదయం చక్రస్నానం,** రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

ఈ సందర్భంగా టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్ట్, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ వి.ఆర్. శాంతి, ఎఇఒ ఏబీ నారాయణ చౌదరి, ఆలయ అర్చకులు ,సిబ్బంది పాల్గొన్నారు.

## మొరాయించిన 'మనమిత్ర యాప్'

### సకాలంలో పూజలు చేయించుకోలేని భక్తులు

### అమావాస్య రద్దీ



**శ్రీకాళహస్తి,మే 16 ప్రభాతవార్త:** భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం తీసుకొస్తున్న సాంకేతిక పరిజ్ఞానం కొన్ని సమయాల్లో ఇబ్బందులకు గురి చేస్తుంది. శనివారం అమావాస్య, కిర్తిక కావటంతో ప్రముఖ శైవ క్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తులతో కిట కిట లాడింది. అమావాస్య సందర్భంగా ఆలయంలో వెలసిన శనీశ్వర స్వామి ఆలయం వద్ద పూజలు చేయించుకొనుటకు భక్తులు తండోపతండగాలుగా కదలి వచ్చారు. ఈ నేపథ్యంలో శనివారం శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల సుదీర్‌రెడ్డి దంపతులు కూడా పాల్గొన్నారు.

**పని చేయని మన మిత్ర యాప్:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో పూజలు, సేవలు,అభిషేకాలు,హోమాలు అన్ని అన్‌లైన్ చేసారు. అయితే శనివారం దేవస్థానంకు సంబంధించిన 'మన మిత్ర యాప్' ఉదయం నుంచి సాయంత్రం వరకు పని చేయలేదు. దాంతో రాహుకాలంలో రాహుకేతుదోష నివారణ పూజలు, శనీశ్వరస్వామి అభిషేకాల కోసం దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. భక్తులు రాహుకాలంలో పూజలు జరిపించుకోవాలనే లక్ష్యంతో వచ్చి ఇక్కడ తీవ్ర నిరాశకు గురయ్యారు. అయితే ఇక్కడకు వచ్చే భక్తుల సౌకర్యార్థం కీయో స్కాన్‌లు కూడా అన్‌లైన్ కావటంతో అవి కూడా సక్రమంగా పని చేయాలేదు. అయితే కీయో స్కాన్ వద్ద ఒక్కొక్క భక్తుని నమోదుకు కనీసం 5 నిముషాల టైం తీసుకుంది. దాంతో ఇక్కడ బారులు తీరారు. అయితే వచ్చిన భక్తులకు ఇబ్బంది లేకుండా ఓ వైపు ఇఒ బికె వెంకటేశులు,మరో వైపు ఎఇఒ మోహన్‌లు ఎంత ప్రయత్నించినా పని చేయని 'మన మిత్ర యాప్‌తో' తిప్పలు పడక తప్పలేదు. అయితే అధికారులు కొందరు విఐపిలకు వారి చరవాణిలోనే టిక్కెట్లు బుక్ చేయటం గమనించదగ్గ విషయం. అమావాస్య శనివారం రావటంతో తమిళనాడు,కర్నాటక, కేరళ, రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది తరలి వచ్చారు. కానీ ఇక్కడ పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఓ వైపు సామాన్యభక్తుల తిప్పల్లో అధికారులు తలమునకలై ఉండగా మరో వైపు విఐపిల దర్శనాలతో అగమ్యగోచరంగా మారింది. ఏమి చేయలేని నిస్సహాయ స్థితి చోటు చేసుకుంది. అధికారులు అందించిన సమాచారం మేరకు శనీశ్వరాలయం వద్ద సుమారు వెయ్యి అభిషేకాలు, అలాగే రాహుకేతుదోష నివారణ పూజలు 7వేలకు పైగా దర్శనం చేసుకున్న భక్తులు 35వేలుగా నమోదు చేసారు.

## తిరుపతి పార్లమెంట్ పరిధిలో రైల్వే సమస్యలు పరిష్కరించండి

### ఎంపి గురుమూర్తి

**తిరుపతి,మే 16ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి పార్లమెంట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యల పరిష్కారం, డిజిటల్ విద్యా సైబర్ పరిశోధన రంగాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ



సహకారం కోరుతూ తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి కేంద్ర రైల్వే, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను న్యూఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా తిరుపతి, రేణిగుంట, గూడూరు ప్రాంతాలకు సంబంధించిన పలు రైల్వే సమస్యలు పరిష్కరించాలని కోరారు. రేణిగుంట రైల్వే స్టేషన్‌ను ఆధునిక సౌకర్యాలతో కూడిన ప్రధాన టెర్మినల్‌గా అభివృద్ధి చేయాలని, ఇందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎంపీ కోరారు. ప్రయాణికుల కోసం మెరుగైన వసతులు, పార్కింగ్, కార్గో సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. శ్రీకాళహస్తి, నడికుడి రైల్వే లైన్ తుది దశ పనులను వేగవంతం చేయాలని కోరారు. సింహపురి ఎక్స్‌ప్రెస్‌ను గూడూరు నుంచి తిరుపతి వరకు పొడిగించాలని, దీని ద్వారా నెల్లూరు జిల్లా ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులకు ఎంతో ఉపయోగం ఉంటుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గూడూరులోని అంబేద్కర్ నగర్ అండర్‌పాస్ విస్తరణ పనులు త్వరగా చేపట్టాలని, వెందోడు రైల్వే స్టేషన్‌లో కృష్ణా ఎక్స్‌ప్రెస్, పూరి ఎక్స్‌ప్రెస్, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపేజీలు కల్పించాలని కోరారు. తిరుపతి వెస్ట్ రైల్వే స్టేషన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం అత్యవసరమని కూడా వివరించారు.

## జడ్జిలను నియమించి కక్షిదారుల ఇబ్బందులు తీర్చండి



**శ్రీకాళహస్తి,మే 16 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలో న్యాయస్థానాలకు జడ్జిలను నియమించాలని కక్షిదారులు కోరుతున్నారు. ఇక్కడ పక్కా భవనాలకు కోట్లు వెచ్చించారు. అయితే నాలుగు న్యాయస్థానాలలో జడ్జిల్లేక కక్షిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ 172 మంది న్యాయవాదులున్నారు. ఎప్పటికప్పుడు బార్ అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించుకుంటూ కార్యవర్గాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ నాలుగు కోర్టుల్లో సుమారు 7వేల కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. అయితే కోర్టులకు పక్కా భవనాలు,సకల సదుపాయాలున్నా 'కేసుల పరిష్కారానికి తీర్పులు ఇచ్చే' రెగ్యులర్ జడ్జిల్లేరు. ఉన్న ఒకే ఒక జడ్జి కృష్ణప్రియ బదిలితో ఖాళీ అయ్యింది. 12వ అదనపు జిల్లా కోర్టు జడ్జిగా శ్రీనివాస్‌నాయక్ సుమారు మూడు సంవత్సరాలు పని చేసారు. ఈయనను కడప ఫ్యామిలీ కోర్టుకు బదిలి చేసారు. ఇక్కడకు ఇన్‌చార్జి రెడ్ శ్యాండల్ కోర్టు జడ్జి నియమించారు. సీనియర్ సివిల్‌జడ్జికోర్టు బేబీరాణి మూడు సంవత్సరాలకు పైగా పని చేసారు. ఈమెను చీరాలకు మార్చారు. ఇక్కడకు పుంగనూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జిని ఇన్‌చార్జిగా నియమించారు. అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి కృష్ణ ప్రియ ఈమెను ఒంగోలుకు బదిలి చేసారు. ఈమె స్థానంలో చిత్తూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిని ఇన్‌చార్జిగా నియమించారు. ఏదైనా కేసలు వాయిదా ఉంటే అక్కడకు వెళ్లి వాదనలు వినిపించాలి. గతంలో తిరుపతి కి చెందిన జడ్జిని ఇన్‌చార్జిలుగా నియమిస్తే వారు వారంలో ఒక రోజు వచ్చే వారు. ప్రస్తుతం పుంగనూరు, చిత్తూరు కోర్టులకు చెందిన జడ్జిలను నియమించటంతో ఇబ్బంది ఏర్పడుతుంది. జిల్లా జడ్జి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

**మూడున్నర ఏళ్ళుగా ప్రిన్సిపల్ జూనియర్ కోర్టు జడ్జిలేదు:** శ్రీకాళహస్తిలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు మూడున్నర సంవత్సరంగా రెగ్యూలర్ జడ్జి లేదు. ఇక్కడ గతంలో రాఘవేంద్ర అనే జడ్జి పుత్తూరుకు బదిలి అయ్యారు. ఆయన తరువాత ఎవ్వరిని నియమించలేదు. ఈ మూడున్నర సంవత్సరాల్లో జడ్జి కృష్ణప్రియ పర్యవేక్షించారు. ప్రస్తుతం ఆమె ఒంగోలుకు బదిలి అయ్యారు. దాంతో అన్ని కోర్టుల్లో జడ్జిల్లేక కక్షిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఇప్పటికైనా హైకోర్టు స్పందించి నియమించాల్సి ఉంది. కొత్త వారిని నియమించాలంటే పరీక్షలు రాయాల్సి ఉంది. కొంత మంది ఇప్పటికే పరీక్షలు రాసి అర్హత సాధించి ఉన్నారు. హైకోర్టు నిర్ణయం తీసుకొని నియమించాల్సి ఉంది.

## వైభవంగా శ్రీమల్లికార్జునస్వామి, కామాక్షితాయి కల్యాణం

**బుచ్చి (నెల్లూరు), మే 16, ప్రభాతవార్త :** ముత్యాల తలంబ్రాలు ! మంగళవాయిద్యాలు ! వేదమంత్రోచ్చరణ మధ్య జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి, కామాక్షితాయి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం కళ్యాణం కన్నులపండుగగా జరిగింది. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రాష్ట్ర నలుమూలల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. మొదట అమ్మవారికి ఉభయకర్తలు వల్లూరు రవీంద్రకుమార్‌రెడ్డి - సంధ్యల (కామాక్షమ్మ) శ్రీశక్తి ఆగ్రో ఆయిల్స్(నెల్లూరు) అమ్మవారికి ముత్యాల తలంబ్రాలు తీసుకొని వచ్చారు. అనంతరం కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు అందజేశారు. అనంతరం అమ్మవారికి స్వామి వారికి ఎదురుకోల ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీమల్లికార్జునస్వామి పార్వతీదేవి ఒక పక్కన ఎదురుగా పెండ్లికుమార్తెగా కామాక్షిదేవి ఎదురురాగా దేవదాయశాఖ వారు అబ్బాయి (శ్రీమల్లికార్జునస్వామి) ఉభయకర్తలు అమ్మాయి (కామాక్షితాయి) తరుపున రాగా ఇరు వర్గాల వారు గంధం చల్లుకుంటు ఎదురుకోల కార్యక్రమాన్ని అత్యంత ఆసక్తికరంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారిని అమ్మవారిని కళ్యాణ వేదికపైన ఉంచి అంగరంగ వైభవంగా కళ్యాణాన్ని నిర్వహించారు. మొదట పుణ్యాహవచనం, విఘ్నేశ్వర పూజ, కంకణదారణ, జిలకర్రబెల్లం తదితర కార్యక్రమాల అనంతరం మాంగల్యదారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తదుపరి ముత్యాల తలంబ్రాల కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీవార్ల కళ్యాణోత్సవ ప్రత్యక్ష వ్యాఖ్యాతగా పుల్లాభట్ల వెంకటేశ్వర్లు గుంటూరు వారు వ్యవహారించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఆలయ ఇఒ ఆర్వభూమి శ్రీనివాసులురెడ్డి ట్రస్టు బోర్డు మెంబర్లు నక్కల శివకృష్ణ,, తిరువాయి పాటి నందకుమార్, పెన్నత్తూరు సుమలత, జొన్నలగడ్డ వరలక్ష్మీ. పాలూరు చాముండేశ్వరీ,కీలుకుప్ప శ్రీనివాసులు, సూరాయపాళెం ప్రత్యూషా,



ముంగ సుధాకర్, రామయాణం సుధారాణి, కొల్లపూడి శారద, వివిఎస్ జి.గంగాప్రసాద్ ఎక్స్ అఫీషియో సభ్యులు పర్యవేక్షించారు. జొన్నవాడ పిహెచ్‌సి వారు వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. వేలాది మంది కళ్యాణాన్ని తిలకించేందుకు రాగా పోలీసులు ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చాలా జాగ్రత్త వహించారు. సిఐ శ్రీనివాసరావు,ఎస్ఐ సంతోష్‌రెడ్డి గట్టు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడ ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూశారు.

ముత్యాలు, తలంబ్రాల కోసం మహిళలు పోటి పడ్డారు. అనేక చోట్ల అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అలాగే దేవస్దానం వారు కూడా భక్తులకు పెద్ద ఎత్తున బోజన వసతిని ఏర్పాటు చేశారు.



## కామాక్షితాయికి కనకదుర్గమ్మ సారె: సమర్పించిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

**బుచ్చి (నెల్లూరు), మే 16, ప్రభాతవార్త :** మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయికి బెజవాడ కనకదుర్గమ్మ ఆలయం నుండి సారె రాగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, దుర్గమ్మ ఆలయ చైర్మన్,జొన్నవాడ కామాక్షితాయి ఆలయ చైర్మన్ దంపతులు మేళతాళాల నడుమ కామాక్షితాయికి సారెను సమర్పించారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్వామి అమ్మవార్ల ఉరేగింపును కూడా మోసి భక్తులను ఆనందింపచేశారు. శ్రీశైలం,కాళహస్తి,విజయవాడ కనకదుర్గమ్మ ఆలయాల నుండి సారె తీసుకొని రావడం ఇదే ప్రథమం. ఇది శాశ్వతంగా కొనసాగుతుందని ఇఒ ఆర్వభూమి శ్రీనివాసులురెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలోఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఆలయ ఇఒ ఆర్వభూమి శ్రీనివాసులురెడ్డి ట్రస్టు బోర్డు మెంబర్లు నక్కల శివకృష్ణ,, తిరువాయి పాటి నందకుమార్, పెన్నత్తూరు సుమలత, జొన్నలగడ్డ వరలక్ష్మీ. పాలూరు చాముండేశ్వరీ,కీలుకుప్ప శ్రీనివాసులు, సూరాయపాళెం ప్రత్యూషా, ముంగ సుధాకర్, రామయాణం సుధారాణి, కొల్లపూడి శారద, వివిఎస్ జి.గంగాప్రసాద్ ఎక్స్ అఫీషియో సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం: వారించిన పోలీసులు

**కుప్పం, మే 16 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలం పొగురుపల్లి వద్ద ఏర్పాటయ్యే పరిశ్రమలకు తమ భూములు ఇచ్చేది లేదని పేర్కొంటూ ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నంకు పాల్పడగా పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని వారించిన సంఘటన శనివారం గుడుపల్లెలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. పొగురుపల్లి గ్రామంకు చెందిన మాజీ సర్పంచ్ భర్త అయిన సోమశేఖర్‌రెడ్డి కు టుంబీకులకు సుమారు ఇరవై ఎకరాల భూములు ఉన్నాయి. వీరు ఐదుమంది అన్నదమ్ములు ఉన్నారు. అయితే వీరి తండ్రి పేరిట ఉన్న ఇరవై ఎకరాల భూములు పరిశ్రమలకు తీసుకునేందుకు అధికారులు నిర్ణయించారని తెలిసింది. ఇందుకు అంగీకరించక సోమశేఖర్‌రెడ్డి శనివారం పెట్రోల్ తీసుకుని గుడుపల్లె తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని ఒంటిపై పోసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై శ్రీకాంత్ అక్కడకు చేరుకుని వెంటనే అతనిపై నీళ్లు చల్లించారు. అధికారులు తమ భూములు బలవంతంగా సేకరించాలని చూస్తున్నారని తనకు న్యాయం చేయాలని సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నాడు. అనంతరం అతన్ని ఇంటికి పంపేశారు.



ఆత్మహత్యాయత్నాన్ని వారిస్తున్న ఎస్సై శ్రీకాంత్

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
వార్త
ఆదివారం 17, మే 2026


# పోర్ట్ స్టేడియంలో వాకర్స్ పాస్‌ల జారీ ప్రారంభం..

- 18 నుంచి సమ్మర్ కోచింగ్ శిబిరాలు కూడా ప్రారంభం



8 లో

# స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర స్ఫూర్తితో
# స్వచ్ఛ విశాఖ - సుందర విశాఖ

8లో



- జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

# శ్రీ మోదకొండమ్మ తల్లి అందుకో
# కోటి దండాలు



8వ పేజీలో

# ముడుపుల మత్తులో
# గ్రేటర్ టౌన్ ప్లానింగ్

- తూర్పు జోన్ లో అక్రమ కట్టడాల జోరు
- అవినీతిలో కూరుకుపోతున్న సిబ్బంది.. స్పందించని యంత్రాంగం





వార్త 8లో

10వ వార్డు, ఆదర్శనగర్ లో.. అక్రమ నిర్మాణాల జోరు

10వ వార్డు, ఆదర్శనగర్ లో..

# వేయటేజీ వద్దు.. క్రమబద్ధీకరణే ముద్దు

- ఎంవీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య ఆధ్వర్యంలో ఏయూలో నిరసన
- కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్

విశాఖపట్నం, మే 16, ప్రభాతవార్త:

ఎంవీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య ఆధ్వర్యంలో కొనసాగుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యల పరిష్కార ఉద్యమానికి విశ్వవిద్యాలయ అధ్యాపకులు, సిబ్బంది సంఘీభావం తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా కాంట్రాక్ట్ విధానంలో సేవలందిస్తున్న అధ్యాపకులను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ వారు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ, విద్యా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు ఎన్నో ఏళ్లుగా తక్కువ వేతనాలతో, ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా వారి సమస్యలు మాత్రం పరిష్కారం కాకపోవడం దురదృష్టకరమన్నారు. కాంట్రాక్ట్ విధానాన్ని కొనసాగిస్తూ అధ్యాపకుల జీవితాలతో ఆటలాడటం తగదని పేర్కొన్నారు. డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య మాట్లాడుతూ, కాంట్రాక్ట్ అధ్యాపకులు విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేస్తున్నప్పటికీ వారికి కనీస గౌరవం,

తరువాయి 8వ పేజీలో



# ఇండోర్‌స్టేడియం ప్రారంభించిన గంటా

మధురవాడ, మే 16, ప్రభాతవార్త:

జీవీఎంసీ 6వ వార్డు పరిధిలోని పీఎం పాలెం అశోక్ నగర్ పార్కులో రూ.40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన స్టేడియాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. పీపీపీ మోడల్ లో ప్రతిపాదించిన స్టేడియానికి దిడ్ల అశోక్ కుమార్ రూ. 25 లక్షలు సమకూర్చగా.. అశోక్ నగర్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రూ.15 లక్షలు అందజేసింది. కార్యక్రమంలో అశోక్ నగర్ ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల గౌతం బాబు ప్రతినిధులు కెవిఆర్ పట్నాయక్, గంటి మోహనరావు బి.ఎస్.ఎన్. మూర్తి, జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు ఏఎమ్ఓహెచ్ రవికుమార్, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గరే గురునాథ్, లొడగల జానకి రామ్, దాసరి శ్రీనివాస్, మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకట్రావు, లొడగల అప్పారావు, చెట్టుపల్లి గోపి, బోయి శ్రీనివాసు, నాగోతి వెంకట సత్యనారాయణ, కానూరు అచ్యుతరావు, నాగోతి సూర్యప్రకాష్, పిల్లా మోహన్ కృష్ణ, గొల్లంగి ఆనందబాబు, పోతిన ప్రసాద్ పాల్గొన్నారు.



# వైజాగ్ సిటీ పోలీస్ నూతన వెబ్‌సైట్ ప్రారంభం




8లో

ప్రజలకు మరింత చేరువగా పోలీస్ సేవలు : డీజీపీ హరీష్ కుమార్ గుప్తా

# ముడుపుల మత్తులో 'గ్రేటర్' టౌన్ ప్లానింగ్..!

(ప్రభాతవార్త-విశాఖపట్నం)

మహా విశాఖ నగరంలో అక్రమ నిర్మాణాల జోరందుకున్నాయి. 'గ్రేటర్' టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగర అభివృద్ధి, ప్రణాళికాబద్ధ నిర్మాణాల పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించాల్సిన అధికారులు తమ విధులను పక్కనపెట్టి.. అవినీతిలో కూరుకుపోయి అక్రమ నిర్మాణాలకు పత్తాస్ పలుకుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా భారీ భవనాలు నిర్మాణమవుతున్నా, టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. జీవీఎంసీ తూర్పు జోన్ పరిధిలో పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారిందని ప్రజలు చెబుతున్నారు. 10వ వార్డు పరిధి ఆదర్శనగర్ లో నిబంధనలకు విరుద్ధంగా ఒకే ప్రాంతంలో రెండుచోట్ల అక్రమంగా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నా.. టౌన్ ప్లానింగ్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు ఒత్తిడి ఉంటే.. స్లాబ్ కి చిన్నపాటి కన్నాలు కొట్టడం.. వారం, పది రోజులు తరువాత ఆ కన్నాలను పూడ్చుడానికి అధికారులు తమ వంతు సహకారం అందిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా, అనుమతులకు మించి అంతస్తులు నిర్మించడం, పార్కింగ్ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించడం, సెట్‌బ్యాక్‌లు లేకుండా నిర్మాణాలు చేపట్టడం, నివాస అనుమతులతో వాణిజ్య భవనాలు నిర్మించడం వంటి ఘటనలు రోజువారీగా కనిపిస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి.

### ఫిర్యాదులోస్తున్నా.. పట్టించుకోని అధికారులు..

అక్రమ నిర్మాణాలపై స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల నోటీసులు జారీ చేసినట్లు చూపించి తర్వాత వాటిని పట్టించుకోకపోవడం, కేసులను పెండింగ్‌లో ఉంచడం జరుగుతోందని ఆరోపణలు ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్లే అక్రమ నిర్మాణాల దందా మరింత వేగంగా సాగుతోందని ప్రజలు అంటున్నారు. కొంతమంది బిల్డర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది కుమ్మక్కయ్యారన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. భారీ స్థాయిలో ముడుపులు చేతులు మారుతున్నాయన్న చర్చ నగరంలో జోరుగా సాగుతోంది. "డబ్బులు ఉంటే ఏ నిబంధనలైనా పక్కన పెట్టొచ్చు" అన్న భావన బిల్డర్లలో పెరిగిపోయిందని స్థానికులు విమర్శిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రాత్రి వేళల్లోనే నిర్మాణాలు వేగంగా పూర్తిచేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు తనిఖీలకు వచ్చే సమయానికి పనులు నిలిపివేసి, తర్వాత మళ్లీ కొనసాగిస్తున్నారని చెబుతున్నారు. కొందరు టౌన్ ప్లానింగ్ అధికారుల అండతోనే ఈ వ్యవహారం సాగుతోందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

### అవినీతి ప్రభావంతో గాఢ నిద్రలో యంత్రాంగం..

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగంలో కొందరు అధికారుల వ్యవహారశైలిపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు కఠినంగా వ్యవహరించిన అధికారులు ఇప్పుడు అక్రమ నిర్మాణాలపై మౌనం పాటిస్తున్నారన్న చర్చ జరుగుతోంది. అవినీతి ప్రభావంతో కొందరు అధికారులు నిబంధనలను గాలికొదిలేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 'ఈ అంశం గ్రేటర్' వర్గాల్లోనే చర్చనీయాంశమవుతున్నాయి. ఇప్పటికైనా అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# వేయటీజీ వద్దు.. క్రమబద్ధీకరణే ముద్దు!

7వ తరువాయి ..

భద్రత లభించడం లేదన్నారు. సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. వెంటనే క్రమబద్ధీకరణ ప్రక్రియ చేపట్టి, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధ్యాపకులు మరింతగా మాట్లాడుతూ, ఉన్నత విద్యా సంస్థల్లో ఖాళీలను భర్తీ చేయకుండా కాంట్రాక్ట్ విధానాన్ని ప్రోత్సహించడం వల్ల విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని తెలిపారు. కాంట్రాక్ట్ అధ్యాపకులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, పదోన్నతులు వంటి ప్రాథమిక హక్కులు కల్పించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, అధ్యాపక సంఘ నాయకులు, సిబ్బంది పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

# పోర్ట్ స్టేడియంలో వాకర్స్ పాస్‌ల జారీ ప్రారంభం

విశాఖపట్నం, మే 16, ప్రభాతవార్త:

విశాఖపట్నం పోర్ట్ అథారిటీ పరిధిలోని అక్కయ్యపాలెం పోర్ట్ స్టేడియంలో వాకర్స్ కోసం నూతన పాస్‌ల జారీ ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు పోర్ట్ యాజమాన్యం ప్రకటించింది. ఈ నెల 18వ తేదీ నుంచి స్టేడియం ప్రాంగణంలోనే పాస్‌ల జారీ ప్రక్రియ ప్రారంభమై మే 31 వరకు కొనసాగనున్నట్లు వెల్లడించింది. వాకర్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించిన పోర్ట్ అధికారులు, పాస్‌లు పొందదలిచిన వారు స్టేడియంలో అందించే దరఖాస్తు ఫారమ్‌ను నింపి, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్‌ను సమర్పించాలని తెలిపారు. గతంలో అమలులో ఉన్న నిబంధనలే ప్రస్తుతం కూడా కొనసాగుతాయని స్పష్టం చేశారు. మే 31లోపు అందరూ తమ పాస్‌లు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇక వేసవి సెలవులను పురస్కరించుకుని చిన్నారుల కోసం వివిధ క్రీడల్లో సమ్మర్ కోచింగ్ శిబిరాలను కూడా సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు పోర్ట్ యాజమాన్యం వెల్లడించింది. పోర్ట్ స్టేడియంలో నిర్వహించే ఈ శిక్షణా కార్యక్రమాల్లో అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్ వంటి క్రీడల్లో ఆసక్తి ఉన్న చిన్నారులు పాల్గొనవచ్చని తెలిపారు. ఈ వేసవి శిక్షణ పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తున్నామని, ప్రతిరోజూ సాయంత్రం నిపుణులైన కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల చిన్నారులు నేరుగా పోర్ట్ స్టేడియానికి వచ్చి నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఈ వివరాలను పోర్ట్ కార్యదర్శి ఎం. శంకర బాబు వెల్లడించారు.

# వైజాగ్ సిటీ పోలీస్ నూతన వెబ్‌సైట్ ప్రారంభం

విశాఖపట్నం, మే 15, ప్రభాతవార్త

డిజిపి హరీష్ కుమార్ గుప్తా నగరంలో శనివారం పర్యటించారు. వెబ్ సైట్ ప్రారంభించడంతోపాటు ప్రతిభ కనబరిచిన పరువురికి అవార్డులు అందజేశారు. పోలీసు వెబ్ సైట్ సేవలను ప్రజలు విస్తృతంగా వినియోగించుకోవాలని డిజిపి హరీష్ కుమార్ గుప్తా పేర్కొన్నారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో వైజాగ్ సిటీ పోలీస్ నూతన వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం విధుల్లో ప్రతిభ కనబర్చిన పలువురు పోలీసు అధికారులకు డిస్క్ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఈ వెబ్‌సైట్ ద్వారా తక్షణ సేవలు పొందవచ్చని తెలిపారు. వైజాగ్ సిటీ పోలీస్ వెబ్‌సైట్ రాష్ట్రానికి మోడల్‌గా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం సైబర్ క్రైమ్ పెద్ద సవాలుగా మారిందని, వివిధ మార్గాల్లో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు. ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో రూపొందించిన ఈ వెబ్‌సైట్‌లో కేసుల స్థితి, ఈ-చలాన్ల వివరాలు, పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు, వాహనాలు, అలాగే మిస్సింగ్ వ్యక్తుల సమాచారం నమోదు చేసే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఈ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తే పోలీసులు వెంటనే దర్యాప్తు చేపట్టేలా ప్రత్యేక విధానంతో వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా ప్రత్యేక మొబైల్ యాప్‌ను కూడా త్వరలో తీసుకురావాలని ఆలోచిస్తున్నామని వెల్లడించారు. వైజాగ్ సిటీ పోలీస్ వెబ్‌సైట్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. విశాఖపట్నం దేశంలో ప్రముఖ కాలేజ్ సిటీగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. ప్రజలకు పోలీస్ శాఖ అందించే అనేక సేవలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు.

# రోటరీ వైజాగ్ డైమండ్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

### -22 యూనిట్ల రక్తం సేకరణ.. స్వచ్ఛందంగా ముందుకు రావాలని ప్రజలకు పిలుపు



విశాఖపట్నం, మే 16, ప్రభాతవార్త:

వేసవి కాలంలో పెరుగుతున్న రక్త అవసరాలను దృష్టిలో ఉంచుకొని రోటరీ వైజాగ్ డైమండ్స్ ఆధ్వర్యంలో శనివారం నగరంలో రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరంలో రోటరీ సభ్యులు జి. విష్ణు దేవ్, కార్యదర్శి శివ కుమార్ చురుకుగా పాల్గొని రక్తదానం చేశారు. శిబిరంలో మొత్తం 22 యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. వేసవి కాలంలో విశాఖ పట్నంలో తీవ్రమైన రక్త కొరత నెలకొంటున్న నేపథ్యంలో, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్త దానం చేసి ప్రాణాలను కాపాడాలని రోటరీ వైజాగ్ డైమండ్స్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. రోటరీ వైజాగ్ డైమ ండ్స్ అధ్యక్షులు ఎస్. కామేశ్వరరావు నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ ఛైర్మన్ గోకవరపు రాంబాబు తో పాటు బృంద సభ్యులు సమన్వయంతో పనిచేసి శిబిరాన్ని విజయవంతం చేశారు.

# బస్ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే గంటాకు వినతి

ఆనందపురం, మే 16, ప్రభాతవార్త:



వెల్లంకి గ్రామంలో బస్సులు ఆగకపోవడం, బస్ స్టాండ్ లేకపోవడం వల్ల విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామ ప్రతినిధులు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. వృక్ష ఫౌండేషన్ చైర్మన్ కాకర సురేష్ కుమార్ మాట్లాడుతూ, ఎన్‌హెచ్ విస్తరణలో పాత బస్ స్టాండ్ తొలగించగా ఇప్పటికీ కొత్తది నిర్మించలేదని తెలిపారు. అలాగే 222, 999 ఆర్టీసీ బస్సులు వెల్లంకి, గారిపేట వద్ద ఆగకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఆర్టీసీ మరియు నేషనల్ హైవేస్ అథారిటీ అఫ్ ఇండియా అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# శ్రీమోదకొండమ్మ తల్లి అందుకో కోటి దండాలు..!!!

### ✪ అమ్మవారి జాతర చూద్దాం రా.. రండీ..!!
### ✪ నేటి నుంచి పాడేరు శ్రీమోదకొండమ్మ "అమ్మ"జాతర మహోత్స వాలు

పాడేరు,మే16, ప్రభాతవార్త:

ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దేవత.. మన్య ప్రజల ఇలవేల్పు పాడేరు శ్రీమోదకొండమ్మ. "అమ్మ" అమ్మవారి ఉత్సవాలు ఆదివారం నుండి అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు ఉత్సవ కమిటీ చైర్మన్,పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో కమిటీ పూర్తి చేసింది. భక్తుల కోర్కెలు తీర్చే ఆశ్రిత కల్పవల్లిగా, మన్య ప్రజల ఆరాధ్య దైవంగా పిలువబడే శ్రీ మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా ఈ ఏడాది భారీగా నిర్వహించ డానికి పాడేరు శ్రీ మోద కొండమ్మ ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. పాడేరు ప్రాంతానికే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవంగా పిలవబడే శ్రీ మోదకొండమ్మ జాతర మహోత్సవాలను ఈ ఏడాది భారీ ఎత్తున నిర్వహించడానికి ఉత్సవ కమిటీ సన్నద్ధమైంది. అశేష జనవాహినిచే 'మోదకొండమ్మా అమ్మా కోటి దండాలమ్మా... అని ప్రస్తుతింప చేసే అమ్మవారి ఉత్సవాలకు మూడు రోజుల పాటు లక్షలాది మంది భక్తులు పాడేరు కు తరలివస్తారని ఉత్సవ కమిటీ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అమ్మవారి జాతరను రాష్ట్ర గిరిజన జాతరగా ప్రకటించిన దగ్గర నుంచి పాడేరు జాతరకు ప్రత్యేకగుర్తింపు ఖ్యాతి నెలకొంది. లక్షలాది ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకొని అందరికీ ప్రీతిపాత్రమైన శ్రీ మోదకొండమ్మ అమ్మవారి మహిమలు గురించి తెలియని వారు ఉండరు పాడేరు శ్రీ మోదకొండమ్మ అమ్మవారి జీవిత విశేషాలు చరిత్ర తెలుసుకోవాల్సిందే...

**పాడేరు శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ అమ్మవారి చరిత్ర:**

శ్రీ మోదకొండమ్మ అమ్మవారు మహిమల గురించి ఈ ప్రాంత పూర్వికులు చెప్పే కథ సారాంశం ఇలా ఉన్నాయి.పూర్వం మహిషాసురుడనే రాక్షసుడు నరజాతి వినాశనాన్ని కోరుకుంటూ బీభత్యాన్ని సృష్టించేవాడు. రాక్షసుడు సృష్టించిన బీభత్సానికి లోకంలో అశాంతి ఎక్కువైంది ఈ పరిస్థితుల్లో భక్తుల ఆక్రందనలు విన్న సమస్త మహిమలు కలిగిన ఆదిపరాశక్తి దుష్ట శిక్షణ శిక్ష రక్షణ చేయాలనీ భూలోకంలో అవతరించింది. ఆదిపరాశక్తికి మహిషాసురుని మధ్య భీకర యుద్ధం జరిగిందని పూర్వీకులు చెబుతారు అయితే రాక్షసుని మాయా యుద్ధానికి ఆదిపరాశక్తి చాలా కాలం మహిషాసురునితో యుద్ధం చేయవలసి వచ్చిందని అంటారు ఆదిపరాశక్తి రాక్షసునికి మధ్య జరిగే యుద్ధంలో రాక్షసుని శరీరం నుంచి నేలరాలిన ప్రతి రక్తపు బొట్టు నుంచి ఒక్కొక్క రాక్షసుడు పునర్జన్మించడంతో ఆదిపరాశక్తి తన మహిమలతో 101 స్త్రీ మూర్తులను అవతరింప చేసిందని పూర్వకులు కథనం. ఈ స్త్రీ మూర్తులకు తన శక్తి మహిమలను ఇచ్చి రాక్షసుకుని చుట్టూ వలయాకారంలో చుట్టుముట్టి మహిషాసురుని రక్తపు బొట్టులను నేలపడకుండా ఈ స్త్రీ మూర్తులు సేవించడం ద్వారా రాక్షసుని మాయలను అంతరింపజేసి చివరికి సంహరించడంలో ఆదిపరాశక్తి విజయం సాధించిందని పూర్వీకులను చెప్పే కథను బట్టి ప్రచారంలో ఉంది రాక్షసుని సంహరించ డంలో తనకు సహకరించిన 101 రికీ ఆదిపరాశక్తి తన సమస్త మహిమలను ప్రసాదించి లోకంలో వివిధ ప్రాంతాలకు పంపినట్టు చెబుతుంటారు. ఈ విధంగా పలు ప్రాంతాలలో వెలసివున్న అమ్మ వారిలో శ్రీ మోదకొండమ్మ అమ్మవారు కూడా ఒకరిని చెబుతారు. అమ్మవారు పాడేరు మండలం గిరిజన ప్రాంతమైన మోదపల్లి గ్రామంలో వెలసి ఉన్నట్టు మొట్టమొదటిసారిగా 1968లో గుర్తించినట్టు చెబుతారు. విశాఖ సముద్రం మొత్తానికి 3,600 అడుగుల ఎత్తున ఉన్న భయంకర అరణ్య ప్రాంతమైన మాదాపల్లి గ్రామంలో వెలసిన అమ్మవారు గిరిజనులను ఆపదల నుండి ఆదుకునేదని చెబుతారు. గిరిజనుల వెన్నంటే ఉండి వారి శ్రేయోభివృద్ధికి కోర్కెలు తీర్చగలే కార్యాలను నెరవేర్చే తల్లి మోదకొండమ్మ తల్లి ఆనాటి నుండి మన్యప్రాంత ఇలవేల్పు అయినట్లు మోదకొండమ్మ మాదాపల్లి గ్రామంతో పాటు ఏజెన్సీ లో ఉన్న అన్ని గిరిజన గ్రామాల గిరిజనులు అరణ్య ప్రాంతంలో తమ చింతనే నివసిస్తున్న మోదకొండమ్మను అప్పట్లో గిరిజనులు కొండ దేవతగా కొండమ్మ తల్లిగా పిలుస్తుండేవారు. కాలక్రమేనా అమ్మవారి పేరు మార్పు చేసినట్లు చెబుతారు. మోదుకొండమ్మగా పేరు అమ్మవారి పేర్లలో మోద,.., కొండ,.. అమ్మ ...అనే పదాల కలయిక కొండమ్మగా సార్థకతగా చెబుతారు. అరణ్యప్రాంత వాసుల కష్టాలను తీరుస్తూ అందరికీ ఆమోదంగా అమ్మవారు ఉండటంతో మోద దా.. కొండపై వెలసిన. వెలసినందున కొండ...గాను అందరితో అమ్మగా పిలవబడుతున్నందున అమ్మ..వారికి శ్రీ మోదకొండమ్మగా నామకరణ సార్థకం అయింది. అమ్మవారు ఇప్పటికీ ఈ ప్రాంతంలో పులిరూపంలో సంచరిస్తుందని గిరిజనుల ప్రగాఢ విశ్వాసం. మన్య ప్రాంతంలో పులులు కల్పించిన అమ్మవారిని ఎవరు గుర్తించలేరని పూర్వకులు ప్రచారంలో ఉండేది. ఒకవేళ అమ్మవారు పులి రూపంలో తిరుగుతున్నప్పుడు ఏ వ్యక్తికి ఎదురైనా ఎటువంటి హాని తలపెట్టదని నమ్మకంతో ఈ ప్రాంత గిరిజనులు ఉంటారు. ఇటువంటి సందర్భాలు కూడా ఎన్నోసార్లు ఈ ప్రాంతంలో ఎదురయ్యాయనీ చెబుతుంటారు. సముద్రమట్టానికి 3,600 అడుగుల ఎత్తున ఉన్న పాడేరు ప్రాంతానికి ఘాట్ రోడ్డు నిర్మించడంలో శ్రీ మోదకొండమ్మ అమ్మవారు దయాదాక్ష్యాలే కారణమని ఈ ప్రాంతంలో ప్రగాఢంగా విశ్వసిస్తారు. ఎంతో చరిత్ర కలిగిన శ్రీ మోదకొండ అమ్మవారి ఉత్సవాలను 1984 సంవత్సరం నుండి ప్రతి ఏటా వైభవంగా నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ మే నెలలో మూడు రోజులపాటు నిర్వహించే ఉత్సవాలు ఈ ఏడాది మే 17 18 19 తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మొదటి రోజు ఆదివారం అమ్మవారి ఆలయం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తల్లి ఘటాన్ని పాదాలను డప్పు వాయిద్యాలతో మందు గుండు సామాగ్రి కాల్చుతూ భారీ ఊరేగింపుగా మెయిన్ రోడ్డు వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శతకం పట్టు వద్దకు తీసుకువచ్చి ప్రతిష్టించడంతో అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ మూడు రోజులపాటు ఘటాలను మాదిగ డప్పులతో గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తారు. చివరి రోజు మంగళవారం ఘటాలను ఉత్సవ విగ్రహాన్ని అమ్మవారి పాదాలను శతకం పట్టు నుంచి బయటకు తీసి భక్తులు శిరస్సుపై పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి యధా స్థానంలో ఉంచుతారు. అమ్మవారి జాతర మహోత్సవానికి తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలతోపాటు ఒడిస్సా,ఛత్తీస్గఢ్ మల్కనగిరి డివిజన్ నుండి కూడా పెద్ద ఎత్తున ప్రజల హాజరై అమ్మవారు దర్శనం చేసుకుంటారు.శ్రీ మోదకొండమ్మ తల్లి నీకు నీరాజనాలు.. అందుకో.. కోటి దండాలు ..అంటూ భక్తులు ప్రస్తుతించే తీరు అందర్నీ ఆకర్షిస్తుంది. చివరి రోజైన అమ్మవారి అనుపు ఉత్సవాల్లో భారీ ఊరేగింపు తో పాటు నేల వేషాలు భారీ ఎత్తున మందు గుండు సామాగ్రి కాల్చుతూ అమ్మవారి ఆలయంలో ఘటాలు ఉంచి ఉత్సవాలకు ముగింపు పలుకుతారు. అమ్మవారి జాతర మహోత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేస్తూ ఉంది. ఉత్సవాల సందర్భంగా పాడేరు పట్టణంలో అన్ని ముఖ్య కూడల్లో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

# స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర స్ఫూర్తితో స్వచ్ఛ విశాఖ.. సుందర విశాఖ..

### ● ప్లాస్టిక్ ఫ్రీ విశాఖ లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యం చాలా కీలకం ● శివాజీ పార్కులో జరిగిన స్వర్ణాంధ్ర ● స్వచ్ఛాంధ్రలో జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

విశాఖపట్నం, మే 16, ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా విశాఖ మహా నగరం మరింత సుందరంగా మారుతుందని, ఇక్కడి ప్రజల సహకారంతో ప్రపంచంలోనే క్లీనెస్ట్ సిటీగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. ఇప్పటికే అన్ని విధాలుగా చైతన్యం, క్రమశిక్షణ కలిగిన విశాఖ ప్రజలకు ఇదొక కొత్త స్ఫూర్తిగా నిలుస్తుందని ఉద్ఘాటించారు. స్థానిక శివాజీ పార్కులో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర జిల్లాస్థాయి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. అనంతరం మొక్క నాటి పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం నింపారు. ఈ క్రమంలో "ప్లాస్టిక్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ - ప్లాస్టిక్ ఫ్రీ విశాఖ" లక్ష్యంతో రూపొందించిన అవగాహన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ప్రదర్శనలను కలెక్టర్ పరిశీలించారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను అభినందిస్తూ వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నియంత్రణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విశాఖపట్నం దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరాల్లో ఒకటిగా నిలవడానికి ప్రజల భాగస్వామ్యమే ప్రధాన కారణమని గుర్తు చేశారు. హుద్ హుద్ తుఫాన్ అనంతరం కూడా ప్రజల సహకారంతో నగరం తిరిగి పచ్చదనాన్ని సాధించిందన్నారు. ప్రపంచ స్థాయిలో విశాఖకు మంచి గుర్తింపు పెరుగుతోందని, గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థలు కూడా విశాఖపై ఆసక్తి చూపుతున్నాయని పేర్కొన్నారు. శానిటేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రంగాల్లో విశాఖ ఆధునిక సదుపాయాలతో ముందంజలో ఉందని, గ్లోబల్ ప్రమాణాలకు అనుగుణంగా వ్యర్థాల నిర్వహణ జరుగుతోందని తెలిపారు. అయితే ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల అవగాహన, సహకారం కూడా అత్యంత అవసరమని స్పష్టం చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణంతో పాటు ఆహార వినియోగంపై తీవ్ర ప్రభావం పడుతోందని హెచ్చరించిన కలెక్టర్, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ ప్రత్యామ్నాయ వస్తువులను అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా అవతరించే సామర్థ్యం విశాఖకే ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మళ్లీ అగ్రస్థానం సాధించేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. చెత్తను వేరు చేసి శానిటేషన్ సిబ్బందికి అందించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావచ్చన్నారు. "స్వచ్ఛత కోసం పని చేయడం దేవుడికి పూజ చేసినట్టే" అనే భావన ప్రతి ఒక్కరిలో రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ పి. నల్లనయ్య, సీఎంహెచ్వో నరేశ్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ రామిరెడ్డి, జోనల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు, సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల తనిఖీలో డీఎంహెచ్‌వో

### -స్వచ్ఛ ఆంధ్ర, డెంగ్యూ అవగాహన కార్యక్రమాల పర్యవేక్షణ

పిఎం పాలెం, మే 16, ప్రభాతవార్త:



జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. పి. జగదీశ్వర రావు శనివారం మధురవాడ, ఆర్. తాళ్లవలస, రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి పలు ఆరోగ్య కార్యక్రమాల అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్రఉస్వర్ణ ఆంధ్ర కార్యక్రమంతో పాటు జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన ర్యాలీలను పర్యవేక్షించారు. రోగ్య కేంద్రాల్లో కొనసాగుతున్న హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన, కార్యక్రమం సమర్థవంతంగా అమలు కావడానికి అవసరమైన సూచనలు చేశారు. అనంతరం ఈ-హెల్త్ రికార్డులు (ఈహెచ్‌ఆర్), అభా ఐడి నమోదు ప్రక్రియ, ఐవీఆర్ఎస్ ద్వారా ఆసుపత్రి సేవలపై ప్రజల అభిప్రాయ సేకరణ (పబ్లిక్ పర్సెప్షన్), కేపీఐ ఇండికేటర్లు, ఎఫ్ఆర్ఎస్ హాజరు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రతిరోజూ జూమ్ సమావేశాల ద్వారా ప్రతి ఆరోగ్య కార్యక్రమానికి సంబంధించిన మార్గదర్శకాలు అందిస్తున్నామని, వాటిని కచ్చితంగా అమలు చేయాలని డా. జగదీశ్వర రావు సూచించారు. వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది అందరూ ప్రజలకు ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డా. బి. ఉమావతి, డిపిఎంఓఉఎన్‌హెచ్ఎం, సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శిల్పారామంలో నేడు జానపద కళల సందడి

### -కోలాటం, జానపద నృత్యాలతో సాంస్కృతిక వేడుకలు

పిఎం పాలెం, మే 16, ప్రభాతవార్త:

నగర పరిధి మధురవాడ శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ప్రత్యేక జానపద కళా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు శిల్పారామం పరిపాలనాధికారి రమేష్ రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు శ్రీ లక్ష్మీ నరసింహ కోలాటం గ్రూప్ ఆధ్వర్యంలో కోలాటం, జానపద నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సంప్రదాయ తెలుగు సంస్కృతి, జానపద కళారూపాలను ప్రతిబింబించే ఈ కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించనున్నాయని తెలిపారు. సాంస్కృతిక కళాప్రియులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శిల్పారామం యాజమాన్యం కోరింది.

# మహిళలకు తోడుగా పోలీసులు

### - సరస్వతి పార్క్‌లో అవగాహన కల్పించిన టూ టౌన్ పోలీసులు :సీఐ ఎర్రం నాయుడు

విశాఖపట్నం, మే 15, ప్రభాతవార్త



ప్రజల్లో భద్రతా చైతన్యం పెంపొందించేందుకు విశాఖ నగర పోలీసులు మహిళలకు ఎప్పుడూ తోడుగా ఉంటారని రెండవ పట్టణ పోలీస్ సీఐ ఎర్రమనాయుడు చెప్పారు. పోలీస్ కమిషనర్ మరియు డీసీపీ-1 మణికంఠ ఆదేశాలతో టూ టౌన్ సీఐ ఎర్రం నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు ప్రజలతో సరస్వతి పార్క్‌లో అవగాహన సమావేశం నిర్వహించి, తాజా నేరాలు, మహిళల భద్రత, సైబర్ మోసాలు, ఇళ్ల చోరీలు మద్యం వ్యసనంపై తెలియజేసారు. పార్క్‌కు వచ్చిన సాధారణ ప్రజలకు వివిధ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం జరుగుతున్న తాజా నేరాల ధోరణులు, మహిళలపై జరిగే నేరాలు, పగలు మరియు రాత్రి వేళల్లో జరుగుతున్న ఇళ్ల చోరీలు, సైబర్ మోసాలు, మద్యం వ్యసనంతో కలిగే సమస్యల గురించి ప్రజలకు వివరించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సైబర్ మోసాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజల భద్రత కోసం విశాఖ నగర పోలీసులు నిరంతరం చర్యలు చేపడుతున్నట్లు సీఐ ఎర్రం నాయుడు తెలిపారు.

# జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

### -డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు వైద్యాధికారుల సూచనలు



పిఎం పాలెం, మే 16, ప్రభాతవార్త:

జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. పి. జగదీశ్వర రావు, జోనల్ మలేరియా అధికారి డా. బి. ప్రభావతి సంయుక్తంగా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ సత్యం కూడలి వరకు సాగింది. ఈ సందర్భంగా డా. పి. జగదీశ్వర రావు మాట్లాడుతూ, రాష్ట్రంలో మొట్టమొదటి డెంగ్యూ కేసు 1964లో విశాఖపట్నం జిల్లాలో నమోదైందన్నారు. డెంగ్యూ వ్యాధి ఆర్బో వైరస్ జాతికి చెందినదని, ఈడిస్ ఈజిప్ట్ జాతి దోమ కాటుతో ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందని వివరించారు. దోమ కుట్టిన 5 నుంచి 8 రోజులలోపు జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, వాంతులు, నోరు ఎండిపోవడం, రక్తపోటు పడిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. ఇటువంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డెంగ్యూ నివారణకు ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, 'డ్రైడే-ఫ్రైడే' పాటించాలని, నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమల కాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలని తెలిపారు. జోనల్ మలేరియా అధికారి డా. బి. ప్రభావతి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మే 16న జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇంటి పరిసరాలతో పాటు కార్యాలయాల పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

# కొమ్మాది మోడల్ ప్రైమరీ స్కూల్‌లో కొత్త అడ్మిషన్లతో కళకళ

### -పాఠశాల ప్రారంభానికి ముందే 17 మంది విద్యార్థుల చేరిక

పిఎం పాలెం, మే 16, ప్రభాతవార్త:



కొమ్మాది మోడల్ ప్రైమరీ స్కూల్‌లో కొత్తగా విద్యార్థులు చేరడంతో పాఠశాల ప్రాంగణం కళకళలాడుతోంది. పాఠశాల ప్రారంభానికి ముందే మొత్తం 17 మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకోవడం విశేషంగా మారింది. ఇందులో 1వ తరగతిలో 13 మంది, ఇతర తరగతుల్లో 4 మంది విద్యార్థులు చేరినట్లు పాఠశాల వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా కొత్తగా చేరిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి మండల విద్యాశాఖ అధికారి చింతాడ రవీంద్రబాబు, ఎంఈవో-2 అనురాధ ప్రత్యేకంగా ఫోటోలు దిగారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన తల్లిదండ్రులను అభినందిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని, భవిష్యత్తులో మరిన్ని అడ్మిషన్లు నమోదవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ సియ్యాద్రి రాంబాబు, హెచ్ఎం సుదర్శన్ పట్నాయక్, ఉపాధ్యాయులు కె. కృష్ణయ్య, పల్లి పద్మజ, ఇమంది సత్యవాణి, ముక్కలకోట లక్ష్మి ప్రియా తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే 'స్వర్ణాంధ్ర' సాకారం -ఎమ్మెల్యే గణబాబు



గాజువాక, మే 16 ప్రభాతవార్త:

ప్రజల భాగస్వామ్యం, అవగాహనతోనే 'స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రా' (సాసా) లక్ష్యం నెరవేరుతుందని ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గణబాబు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శనివారం శ్రీహరిపురం కోరమాండల్ గ్రౌండ్‌లో నిర్వహించిన 'సాసా' ప్రత్యేక డ్రైవ్‌కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ అవగాహన ర్యాలీని ప్రారంభించి, అందరితో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విడనాడి ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులనే వాడాలని పిలుపునిచ్చారు. డెంగ్యూ దోమలు ఇళ్లలోని స్వచ్ఛమైన నీటిలోనే పెరుగుతాయని, వారానికి ఒకరోజు నీటి నిల్వలను తనిఖీ చేసుకోవాలన్నారు. ఇంధన పొదుపుపై ప్రధాని మోదీ పిలుపునకు మద్దతుగా ఎమ్మెల్యే గణబాబు ఈ కార్యక్రమానికి బ్యాటరీ కార్‌లో విచ్చేసి ఆదర్శంగా నిలిచారు. అనంతరం ప్రజలకు క్లాత్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమావతి, ఏఎంహెచ్ఓ, కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

## గాజువాకలో 'శాప్' రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు ప్రారంభం



గాజువాక, మే 16,ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆదేశాల మేరకు విశాఖ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో 'శాప్ లీగ్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ టోర్నమెంట్' శనివారం ఘనంగా ప్రారంభమైంది. గాజువాక వికాస్ నగర్‌లోని రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా ఈనెల 16 నుండి 18వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి. గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, శాప్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.భరణి (ఐఎఫ్ఎస్)లు ముఖ్య అతిథులుగా హాజరై ఈ పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల ద్వారా ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, వారిని ప్రోత్స హించడమే ఈ లీగ్స్ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఈ టోర్నమెంట్‌లో అండర్-15 విభాగంలో 15 కేటగిరీలు, అండర్-19 విభాగంలో 10 కేటగిరీలలో బాలురు, బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి సుమారు 400 మంది క్రీడాకారులు, 104 మంది కోచ్‌లు, మేనేజర్లు, 50 మంది సాంకేతిక అధికారులు ఈ పోటీల్లో పాల్గొంటు న్నారు. విశాఖ జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి జూన్ గ్యాలియెట్, శాప్ డైరెక్టర్ ఎం.డి.రమేష్ కుమార్ (రాజా), ఒలింపియన్ ఎం.వి. మాణిక్యాలు, ద్రోణాచార్య అవార్డీ ఐ.వెంకటేశ్వర రావు, అర్జున అవార్డీ ఎస్. జయరాం, జీవీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ ఈ.ఏ. రాజు, అనకాపల్లి జిల్లా క్రీడా అధికారి పూజారి శైలజ, నడుపూరు హెడ్ మాస్టర్ రాచకొండ శ్రీనివాస రావు, బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడా సిబ్బంది పాల్గొన్నారు.

## విలాసఖానపాలెంలో 16 సం.ల తరువాత బంగారమ్మ ఊరి పండుగ

పద్మనాభం, మే 16, ప్రభాతవార్త



మండలంలో విలాసఖానపాలెం గ్రామంలో పచ్చని పంటపొలాల మధ్య వేంచేయున్న బంగా రమ్మ తల్లి గ్రామ దేవత ఉత్సవాలు ఈ నెల 18 నుండి 20 వరకు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. 2010వ సంవత్సరం తరువాత బంగారమ్మ ఉత్సవాలను జరుపుతున్నట్లు వారు తెలిపారు. 18న తొలేళ్ల ఉత్సవం, 19న సాయంత్రం అనుపోత్సవం జరుగుతా యని చెప్పారు. ఇప్పటికే ఆలయానికి రంగులు వేసి సిద్ధం చేసారు. అనుపోత్సవం నాడు జరగనున్న రథోత్సవానికి సంబంధించి రథాలుగా ఎడ్లబండ్లుకి రంగులు వేసి తయారు చేసారు. పండగ సందర్భంగా గ్రామంలో మంచినీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఉత్సవాన్ని గ్రామ ప్రజలు అందరూ ఐకమత్యంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## మైగ్రేన్ నిర్ధారణకు వినూత్న డయాగ్నస్టిక్ కిట్ అభివృద్ధి

### ఆంధ్ర విశ్వవిద్యాలయ విద్యార్థుల పరిశోధనకు పేటెంట్ దరఖాస్తు



విశాఖపట్నం, మే 16, ప్రభాతవార్త

ఆంధ్ర విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగానికి చెందిన పీజీ విద్యార్థుల రెండు బృందాలు మైగ్రేన్‌ను ఖచ్చితంగా గుర్తిం చేందుకు వినూత్న ఇన్ విట్రో డయా గ్నస్టిక్ కిట్ (ఐవీడీ)ను అభివృద్ధి చేసి పరీక్షించాయి. ఈ పరిశోధనకు ఎమెరిటస్ ప్రొఫెసర్ డా.బి.భరతలక్ష్మి నాయకత్వం వహించగా, ఆంధ్ర విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగంలో అభివృద్ధి చెందుతున్న స్టార్టప్ సంస్థ టీసీఏబీఎస్ఈ లాబొరేటరీస్ వ్యవస్థాపకుడు, ప్రధాన శాస్త్రవేత్త డా.రవికిరణ్ యేడిది శాస్త్రీయ సహకారం అందించారు. ఈ పరిశోధన ఫలితంగా అభివృద్ధి చేసిన డయా గ్నస్టిక్ కిట్‌కు సంబంధించి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఐపీఆర్ సెల్ ద్వారా పేటెంట్ దరఖాస్తు కూడా దాఖలు చేసినట్లు తెలిపారు. టీసీఏబీఎస్ఈ లాబొరేటరీస్‌లో బయో ఫిజిక్స్ ప్రోగ్రామ్ మేనేజర్ ఎస్. మణికాంత పర్యవేక్షణలో ఎంఎస్సీ జువాలజీ విద్యార్థులు పి.దివ్యసాయి, జె.కళ్యాణి, సి.మాధురి, టి.సౌజన్య, పి.శ్రావణి బృందం మైగ్రేన్‌కు సంబంధించిన బయోమార్కర్లపై విస్తృత పరిశోధన నిర్వహించారు. మరోవైపు జి.భాగ్యశ్రీ, పి.మహాలక్ష్మి, కె.రమ్య, డి.సత్యలతో కూడిన రెండో బృందం ఆసుపత్రుల సహకారంతో మైగ్రేన్ రోగుల రక్త, మూత్ర నమూనాలను సేకరించింది. అనంతరం డా.రవికిరణ్ యేడిది మార్గదర్శకత్వంలో ప్రోటియోమిక్స్, ఎల్‌సీఎంఎస్ వంటి అధునాతన సాంకేతిక పద్ధతులతో నమూనాలను విశ్లేషించారు. ఈ విశ్లేషణల్లో రక్త నమూనాల్లో ఇన్‌ఫ్లమేటరీ బయో మార్కర్లు, మూత్ర నమూనాల్లో న్యూరో ట్రాన్స్‌మిటర్ మెటబొలైట్లు గుర్తించగలిగినట్లు వెల్లడించారు. ఈ ఫలితాలు సానుకూలంగా ఉండటంతో మైగ్రేన్ నిర్ధారణలో ఈ కిట్ ఉపయోగకరంగా మారే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు. అయితే ఈ ఐవీడీని మార్కెట్లోకి తీసుకురావడానికి ముందు మరిన్ని రోగి నమూనాలపై పరీక్షలు నిర్వహించాల్సి ఉందని డా. రవికిరణ్ యేడిది పేర్కొన్నారు. ప్రస్తుతం ఆసుపత్రులతో మరిన్ని క్లినికల్ సహకారాల కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

## గాజువాక సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

### నియోజకవర్గంలో రూ.250 కోట్లతో పనులు -తోకాడలో రూ.49.50 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన -పనుల్లో జాప్యంపై అధికారులపై ఆగ్రహం

గాజువాక, మే 16,ప్రభాతవార్త



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం గాజువాక నియోజకవర్గంలోనే రూ. 250 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని స్థానిక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. జీవీఎంసీ 71వ వార్డు పరిధిలోని తోకాడ గ్రామంలో సుమారు రూ.49.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సి.సి. రోడ్లు, డ్రెయినేజీ కాలువల నిర్మాణ పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాక ప్రాంతాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన, అత్యంత అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. అయితే, కొన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు పూర్తయినప్పటికీ పనులు అసంపూర్తి స్థాయిలో జరగకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిధులు మంజూరైన పనుల్లో జాప్యాన్ని సహించేది లేదని, అధికారులు వెంటనే ప్రత్యేక దృష్టి సారించి పనులను పూర్తిస్థాయిలో వేగవంతం చేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లోనూ ప్రస్తుతం కాలువలు, కల్వర్టుల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఇవి పూర్తి కాగానే అంతర్గత రహదారుల (రోడ్ల) నిర్మాణం చేపడతామని వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, టీడీపీ పార్లమెంట్ కార్పొరేటర్ రాజాన రామారావు, వార్డు టీడీపీ అధ్యక్షుడు బొడ్డేడ నాయుడు, కార్యదర్శి పైడి రామచంద్రరావు, ముఖ్య నాయకులు పప్పు శంకరరావు, మళ్ల రాముడు, గోవింద్, ప్రసాద్, గోపి, నాయుడు, నక్కా రాజారావు, రమణ, శేఖ, పైడిరాజులతో పాటు జీవీఎంసీ డీఈ అప్పారావు, ఏఈ సంతోష్, వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో వీఎంఆర్డీఏ ఈఈ...ఆర్కిటెక్ట్ భేటీ



గాజువాక, మే 16,ప్రభాతవార్త

గాజువాక ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుతో శనివారం వారి క్యాంప్ కార్యాలయంలో వీఎంఆర్డీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజు, ప్రాజెక్ట్ ఆర్కిటెక్ట్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నియోజకవర్గ పరిధిలో వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిపై వారు ఎమ్మెల్యేకు నివేదించారు. ముఖ్యంగా నియోజక వర్గంలో చేపట్టనున్న నూతన ప్రాజెక్టులు, హరిత వనాల కల్పన, రహదారుల విస్తరణకు సంబంధించిన మాస్టర్ ప్లాన్లు, ఆర్కిటెక్చరల్ డిజైన్లను ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వారు క్షుణ్ణంగా వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఎక్కడా నాణ్యత లోపించకుండా, నిర్దేశిత కాలపరిమితిలోగా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజాధనం సద్వినియోగం అయ్యేలా, గాజువాక సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా వీఎంఆర్డీఏ అధికారులు, ఆర్కిటెక్ట్ బృందం సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గాజువాక జెడ్పీ శేషాద్రి ఎంఆర్ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణలో రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలపాలి: గంటా

విశాఖపట్నం, మే 16, ప్రభాతవార్త



పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వానికి ప్రజలందరూ సహకరించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 6వ వార్డు అశోక్ నగర్ పార్కు వద్ద శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో ఉంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి కృషి చేయాలన్నారు. తమ ప్రాంతాలను పరిశుభ్రతగా ఉంచుకొని అందరితో ప్రతిజ్ఞ చేయించారు.

## హెడ్ కానిస్టేబుల్‌కు అవార్డు



గోపాలపట్నం, మే 16 ప్రభాతవార్త:

స్థానిక గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న బి.వీర్రాజుకు అత్యుత్తమ పోలీసు అవార్డు లభించింది. గత రెండేళ్లుగా ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తున్న వీర్రాజును గుర్తించి డీజీపీ హెల్ప్ డెస్క్ అవార్డు ప్రధానం చేశారు. ఈ మేరకు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అవార్డును వీర్రాజుకు అందించారు. విశాఖ కమిషనర్ ఆఫ్ పోలీస్ శంఖ బ్రత బాగ్చి, గోపాలపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్.సన్యాసినాయుడు తదితరులు వీర్రాజును అభినందించారు.

## గాజువాకలో 'డిజైర్ సొసైటీ' వేసవి శిబిరం ప్రారంభం




గాజువాక, మే 16,ప్రభాతవార్త

గాజువాక శ్రీనగర్ అఫీషియల్ కాలనీలోని 'డిజైర్ సొసైటీ' హెచ్ఐవి బాధిత బాలల వసతి గృహ ప్రాంగణంలో సమ్మర్ క్యాంప్-2026 ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్, గాజువాక ఇన్‌ఛార్జ్ కరణంరెడ్డి నరసింగరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు జరగనున్న ఈ వేసవి శిబిరంలో విద్యార్థులందరూ ఆటపాటలతో ఉత్సాహంగా గడపాలని సూచించారు. డిజైర్ సొసైటీ వ్యవస్థాపకులు రవిబాబు సేవలను కొనియాడిన ఆయన.. దేశంలోని ఐదు ప్రధాన నగరాల్లో 1500 మంది హెచ్ఐవి బాధిత పిల్లలకు సంస్థ ద్వారా ఉచితంగా వసతి, చదువు, పౌష్టికాహారం, వైద్యం అందించడం అభినందనీయ మన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ ఇంధనాన్ని ఆదా చేయాలని, పెట్రోల్, డీజిల్‌కు బదులుగా ఎలక్ట్రికల్ వాహనాలు వాడాలని కోరారు. బంగారం కొనుగోళ్ల వల్ల విదేశీ మారక ద్రవ్యం విదేశాలకు తరలిపోతుందని, అందుకే ఏడాది పాటు బంగారం కొనుగోళ్లను తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సుధీర్ రెడ్డి, వీరయ్య, యూట్యూబర్ నిషిత, శరత్, డాక్టర్ సురేష్, లక్ష్మణ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మదర్సా ఆధ్వర్యంలో ముగిసిన ఉచిత వేసవి శిబిరం

గాజువాక, మే 16,ప్రభాతవార్త



గాజువాక బీసీ రోడ్డులోని దారుల్ ఉలూమ్ ఇషాకియా నూరియా మదర్సా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వేసవి శిబిరం విజయవంతంగా ముగిసింది. మే 1 నుండి 15 వరకు ఇషాకియా నూరియా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఆరు సంవత్సరాల పైబడిన పిల్లల కోసం ఈ క్యాంప్ నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 150 మంది విద్యార్థి, విద్యార్థినులు పాల్గొని హ్యాండ్ రైటింగ్, ఆర్ట్ క్రాఫ్ట్, కంప్యూటర్ బేసిక్స్, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, బ్రెయిన్ జిమ్ వంటి అంశాలపై శిక్షణ పొందారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మదర్సా కమిటీ వైస్ ప్రెసిడెంట్, మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ చేతుల మీదుగా సర్టిఫికెట్లు, మెమొంటోలను అందజేశారు. మదర్సా ప్రిన్సిపాల్ ముఫ్తీ జాఫర్ అలీ, ముజాహిద్, కమిటీ సభ్యులు అన్వర్, రిజ్వాన్, జహంగీర్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శ్రీరామ్‌నగర్‌లో క్షయ వ్యాధిపై అవగాహన



గాజువాక, మే 16,ప్రభాతవార్త

గాజువాక 71వ వార్డు శ్రీరామ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో 'టిబి ముక్త భారత్ అభియాన్' లో భాగంగా క్షయ (టిబి) వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర పరిశీలకులు, వీవర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పప్పు రాజారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పప్పు రాజారావు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుల ఆదేశాల మేరకు ప్రతి వార్డులోనూ టిబిపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం, మందులు అందుబాటులో ఉన్నాయని, సకాలంలో మందులు వాడితే టిబి నుండి పూర్తిగా బయటపడొచ్చని సూచించారు. అనంతరం జిల్లా కో-ఆర్డినేటర్ పి. లోకేష్ టిబి వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిబి ల్యాబ్ సూపర్‌వైజర్ ఎం. శ్రీనివాస్, అనిల్ కుమార్, జి. శైలజ, టి. లోవరాజు, అంగన్‌వాడీ కార్యకర్త సిహెచ్. నాగమణి ప్రజలు పాల్గొన్నారు.

## ఆరిలోవలో స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన

ఆరిలోవ, మే 16, ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం 'ప్లాస్టిక్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్' కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పించుటకు కనకమహాలక్ష్మినగర్ ఈ సేవా సెంటర్ దగ్గర వార్డు శానిటరీ ఇన్స్పెక్టర్ పీతల వెంకటేశ్వర్రావు అధ్యక్షతన ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరు ఉద్యమించాల్సిన అవసరం వచ్చిందని, ప్లాస్టిక్ వల్ల క్యాన్సర్ కి సంబంధించిన వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, మూగజీవాలు రోడ్లపై పడేసిన ప్లాస్టిక్ తిని మృత్యువాత పడటం జరుగుతుందని, ప్లాస్టిక్ సంచులు మట్టిలో కలవడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుంది కావున ప్రజలందరూ ఇకపై ప్లాస్టిక్ సంచులకు బదులుగా గుడ్డ,నార సంచులను మాత్రమే వాడి ప్లాస్టిక్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ గా మన రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని దీనిలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి నాయకులు కెల్లా సత్యనారాయణ, విశాఖ పార్లమెంట్ అధికార ప్రతినిధి పొత్రకండ ధర్మారావు, ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి, ఉపాధ్యక్షులు కిల్లంశెట్టి శ్రీనివాస్, మహిళా ప్రధాన కార్యదర్శి కర్రి మణి, మహిళా ఉపాధ్యక్షురాలు మచ్చ జ్యోతి, అనకాపల్లి రామలక్ష్మి, ఓశెట్టి పైడిరాజు, డ్వాక్రా సంఘాల ఆర్‌పిలు, సచివాలయం శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సొంత్యాం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### కారు-ఆటో-బైక్ ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలు



ఆనందపురం, మే 16, ప్రభాతవార్త

ఆనందపురం మండలంలోని సొంత్యాం సమీపంలో శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. కారు, ఆటో, మోటార్ సైకిల్ పరస్పరం బలంగా ఢీకొనడంతో ప్రమాదం తీవ్రరూపం దాల్చింది. ఘటన స్థలంలో వాహనాలు నుజ్జునుజ్జయ్యేలా దెబ్బతినడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనందపురం ప్రాంతానికి చెందిన కొవ్వాడ భిక్ష (28) తన కారులో గండిగుండం వైపు వెళ్తుండగా, ఎదురుగా సింహాచలం వైపు నుంచి వస్తున్న ఆటో, మోటార్ సైకిల్ ఒకేసారి సమీపించడంతో అదుపుతప్పి మూడు వాహనాలు బలంగా ఢీకొన్నాయి. ఢీకొన్న ప్రభావం తీవ్రంగా ఉండటంతో వాహనాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ప్రమాదంలో గర్భాం గ్రామానికి చెందిన ఎ. శ్రీను (35) కుడికాలుకు తీవ్ర గాయాలయ్యాయి. మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న శ్రీకాకుళం జిల్లా కొంగరాం గ్రామానికి చెందిన కురాన చిన్నారావు (45) గాయపడ్డాడు. ఆయనతో పాటు ఉన్న కె. లక్ష్మి (40) ఎడమ కాలు, చేతికి తీవ్ర గాయాలు కాగా, గూడాలపేటకు చెందిన పి. రాంబాబు (30) కడుపు, వీపు భాగాల్లో అంతర్గత గాయాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అప్రమత్తమై క్షతగాత్రులను వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇటీవల ఆనందపురం పరిసర ప్రాంతాల్లో వరుసగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్లే ఇటువంటి ప్రమాదాలు పెరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. రద్దీ ప్రాంతాలు, కూడళ్లు, విద్యాసంస్థల వద్ద వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## డెంగ్యూ నివారణపై ప్రజలకు అవగాహన

ఆరిలోవ, మే 16, ప్రభాతవార్త



తూర్పు నియోజకవర్గం స్థానిక 12వ వార్డు పరిధిలోగల దుర్గానగర్ ప్రాంతంలో శానిటరీ ఇన్స్పెక్టర్ అబ్దుల్ మీరా ఆధ్వర్యంలో "స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా "ప్లాస్టిక్ ఫ్రీ ఆంధ్ర" అంశంతో పాటు జాతీయ డెంగ్యూ దినోత్సవం పురస్కరించుకొని డెంగ్యూ నివారణపై ప్రజలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు 'బ్రింగ్ యువర్ ఓన్ బ్యాగ్'పై అవగాహన కల్పిస్తూ, షాపింగ్‌కు వెళ్లేటప్పుడు తమ సొంత బ్యాగులు తీసుకువెళ్లాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు. అదేవిధంగా "జీరో లిటరింగ్" లక్ష్యంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు తెలియజేశారు. అలాగే డెంగ్యూ జ్వరంపై అవగాహన కల్పిస్తూ, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల పెరుగుదలను అరికట్టేందుకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు అప్పలరాజు, గాడి సత్యం, స్థానిక నాయకులు తిమోతి, శ్రీనివాస్, రవి, లక్ష్మి, రామకృష్ణ మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు



### పరిసరాల పరిశుభ్రతతోనే డెంగ్యూకు అడ్డుకట్ట

ఆనందపురం, మే 16, ప్రభాతవార్త:

జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ఆనందపురం మండలంలో దగలవాని పాలెంలో శనివారం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డెంగ్యూ వ్యాధిపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు గ్రామాలు, పాఠశాలలు, ప్రజా ప్రదేశాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వైద్య అధికారి సహనాద్ సాదియా మాట్లాడుతూ డెంగ్యూ అనేది ఏడిస్ ఈజిప్టై దోమ కాటు వల్ల వ్యాపించే వైరల్ వ్యాధి అని తెలిపారు. స్వయంగా మందులు వాడకుండా వైద్యుల సలహా మేరకు చికిత్స పొందాలని తెలిపారు. ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు డెంగ్యూ నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి దోమల నివారణకు చర్యలు చేపట్టారు. "మన పరిసరాలు శుభ్రంగా ఉంటేనే డెంగ్యూను దూరం పెట్టగలం" అని వైద్యాధికారులు పేర్కొన్నారు. ప్రజలందరూ ఆరోగ్య శాఖకు సహకరించాలని కోరారు.

## గంజాయి పట్టివేత.. ఇద్దరు నిందితుల అరెస్టు



గోపాలపట్నం, మే 16, ప్రభాతవార్త:

విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసిన గోపాలపట్నం పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను రిమాండ్ కు తరలించారు. ఈ మేరకు గోపాలపట్నం పోలీస్ స్టేషన్ హౌస్ అధికారి ఎల్.సన్యాసినాయుడు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గంజాయి అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారాన్ని అందుకున్న గోపాలపట్నం పోలీసులు స్థానిక సింహాచలం రైల్వే క్వార్టర్స్ సమీపంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా తిరుగాడుతున్న పశ్చిమ బెంగాల్ కు చెందిన జామిల్ అత్తర్ (53) ఒరిస్సా కోరాపుట్టుకు చెందిన ప్రఫుల్ల కుమార్ కిల్ల (44)లను తనిఖీ చేయగా వారి వద్ద నుంచి 2.760 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## భోగాపురం ఎయిర్‌పోర్ట్ దృష్ట్యా ఆనందపురం జంక్షన్‌కు ప్రాధాన్యం

### ట్రాఫిక్ సమస్యలపై కలెక్టర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన



ఆనందపురం, మే 16, ప్రభాతవార్త:

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి విశాఖ పట్నం నగరం నుంచి వెళ్లే ప్రధాన మార్గంగా ఉన్న ఆనందపురం జంక్షన్‌లో రోజురోజుకూ తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్యలపై జిల్లా అధికారులు దృష్టి సారించారు. శనివారం విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ తేజ్ భరత్, ఎన్‌హెచ్ఏఐ అధికారులు, పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి ఆనందపురం జంక్షన్‌ను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. విశాఖ, పెందుర్తి, తగరపువలస, ఆనందపురం వైపుల నుంచి ఒకేసారి భారీ సంఖ్యలో వాహనాలు జంక్షన్‌కు చేరుకోవడంతో తరచూ గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. గంటల తరబడి ట్రాఫిక్ జామ్ ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే మార్గంలో తరచూ రోడ్డు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమైన తర్వాత ఈ మార్గంలో వాహనాల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు ఈ రహదారి కీలక మార్గం కావడంతో ఇప్పటి నుంచే ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం అవసరమని అధికారులు అభిప్రాయపడ్డారు. ఇటీవల భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా ఆనందపురం జంక్షన్‌ను సందర్శించి రోడ్డు విస్తరణ అత్యవసరమని పేర్కొంటూ వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు ఆనందపురం జంక్షన్‌తో పాటు భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు అనుసంధానంగా ఉన్న రహదారులను పరిశీలించారు. జంక్షన్‌లో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి ఉన్న అవకాశాలను పరిశీలించడంతో పాటు ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటుపై కూడా చర్చించారు. భూసేకరణ, రోడ్డు విస్తరణ వంటి అంశాలపై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి త్వరలోనే పనులు ప్రారంభించేందుకు అధికారులు నిర్ణయించారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభానికి ముందే ఆనందపురం ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

## పోగొట్టుకున్న బంగారంను బాధితులకు అప్పగించిన పోలీసులు



విశాఖపట్నం, మే 15, ప్రభాతవార్త

పోగొట్టుకున్న బంగారు చైనుని ఒకరోజు వ్యవధిలో మూడవ పట్టణ పోలీసులు అప్పగించారు. రాంనగర్ కి చెందిన హనుమంతు రమణ ఆయన సోదరితో కలిసి శ్రీకాకుళం వివాహ కార్యక్రమానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం లో ఒక టాక్సీ కారులో విశాఖ చేరుకున్నారు. అయితే రమణ సోదరి ఇంటికి వెళ్ళాక బంగారం చైన్ చూసుకోగా కనిపించకపోవడంతో మూడవ పట్టణ పోలీసులు ఆశ్రయించారు. దీంతో వారు సీసీ కెమెరాలు పరిశీలించి కారు యజమానికి సమాచారం ఇవ్వగా కారులో పడిపోయిన బంగారంను తిరిగి వారికి అప్పగించారు.

## పసివాడిపై శునకాలు సామూహిక దాడి

### చెవి కొరికేసి.. ఒళ్లంతా రక్కేసిన వైనం -జీవీఎంసీ 86వ వార్డు వుడా ఫేజ్-2లో ఘోరం

గాజువాక,మే 16,ప్రభాతవార్త



మహానగరంలో వీధి కుక్కల సంచారం మితిమీరిపోతోంది. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో పసిప్రాణాలు బలిపశువులవుతున్నాయి. జీవీఎంసీ 86వ వార్డు పరిధిలో శుక్రవారం సాయంత్రం ఓ నాలుగేళ్ల పసివాడిపై వీధి కుక్కలు గుంపుగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఉదంతం స్థానికంగా భయాందోళనలు రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ 86వ వార్డు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే జాయిస్ అనే మహిళ, తన ముగ్గురు పిల్లలతో కలిసి వుడా ఫేజ్-2 కాలనీలో నివసిస్తున్నారు. శుక్రవారం ఆమె విధులకు వెళ్లగా, సాయంత్రం 4 గంటల సమయంలో అక్కలిద్దరూ ఇంట్లో నిద్రిస్తున్నారు. దీంతో చిన్నవాడైన మోక్షరాజు (4) ఆడుకునేందుకు ఇంటి సమీపంలోని పార్కుకు వెళ్లాడు. అక్కడ పొంచివున్న పదుల సంఖ్యలోని వీధి కుక్కలు ఒక్కసారిగా బాలుడిపై విరుచుకు పడ్డాయి. కిందపడేసి ఒళ్లంతా రక్కేయడమే కాకుండా, ఒక కుక్క బాలుడి చెవిని బలంగా కొరికేసింది. పసివాడి కేకలు విన్న స్థానికులు కర్రలతో పరుగెత్తుకుంటూ వచ్చి కుక్కలను అదరగొట్టి రక్షించారు. తీవ్ర రక్తగాయాలైన బాలుడిని తల్లి హుటాహుటిన ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడికి చికిత్స అందుతోంది. కాలనీలు, పార్కుల్లో కుక్కల ఉధృతి పెరుగుతున్నా నగరపాలక సంస్థ వెటర్నరీ విభాగం పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. పిల్లలను బయటకు పంపాలంటేనే వణికిపోతున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే డెంగ్యూ నివారణ

### -ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గణబాబు

గాజువాక,మే 16 ప్రభాతవార్త



పరిసరాల పరిశుభ్రతతోనే ప్రాణాంతక డెంగ్యూ వ్యాధిని పారదోలడం సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు స్పష్టం చేశారు. జీవీఎంసీ వెస్ట్ జోన్ మలేరియా విభాగం ఆధ్వర్యంలో శ్రీహరిపురం మహాత్మాగాంధీ వాణిజ్య సముదా యం సమీపంలో శనివారం జాతీయ డెంగ్యూ దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డెంగ్యూ అనేది దోమల ద్వారా వ్యాపించే వ్యాధి కావున, ప్రజలు తమ ఇళ్లు, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, 'డెంగ్యూ రహిత విశాఖ'కు సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. వెస్ట్ జోన్ మలేరియా ఇన్‌స్పెక్టర్ డి. రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వెస్ట్ జోన్ కమిషనర్ హేమావతి, ఏఎంహెచ్ఓ హర్ష సుదర్శన్, స్థానిక కూటమి నేతలు, మలేరియా సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, DASARI KOTESWARA RAO S/O DASARI VENKATA SUBRAMANYAM previously called KOTESWRARAO DASARI R/O FNO.1126, 1ST BLOCK, 12TH FLOOR, MVV CITY, PM PALEM, VISAKHAPATNAM, now changed my name from KOTESWRARAO DASARI to DASARI KOTESWARA RAO. Henceforth I will be called as DASARI KOTESWARA RAO for all purposes. (Ro.No.6569)

★ I, KARADA KANAKA MAHALAKSHMI W/O KARADA RAMBABU previously called KANAKAMAHALAXMI KARADA R/O 64-11-25, KARADA STREET, SRIHARIPURAM, VISAKHAPATNAM, now changed my name from KANAKAMAHALAXMI KARADA to KARADA KANAKA MAHALAKSHMI. Henceforth I will be called as KARADA KANAKA MAHALAKSHMI for all purposes. (Ro.No.6573)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

vsp11:vsp11.qxd 16-05-2026 22:26 Page 1






## విఎస్ఎస్ చైర్‌పర్సన్‌గా శెట్టి మల్లేష్



దుంబ్రిగుడ, మే 16 ప్రభాత వార్త: వన సంరక్షణ సమితి చైర్ పర్సన్‌గా శెట్టి మల్లేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా ఎం. మినీనితో పాటు మరో 13 మంది కమిటీ సభ్యులకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం స్థానిక సామాజిక భవనంలో రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ టి సుబ్బారావు, టిఎన్టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం. స్వామి, సూపర్ ఎంపీటీసీ సింహాద్రి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కృష్ణం నాయుడు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ఉద్దంగి, రేణుక, వెంకటరాజు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా కమిటీ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన విఎస్ఎస్ చైర్పర్సన్ శెట్టి మల్లేశ్వరరావు మాట్లాడుతూ. వన సంరక్షణ మన అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని చెప్పారు. వన సంరక్షణ సమితి చైర్పర్సన్‌గా తనవంతు వన సంరక్షణకై కృషి చేస్తానని చెప్పారు. గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలి

### ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్



దుంబ్రిగూడ, మే 16 ప్రభాతవార్త: ఉపాధి హామీ పథకని పాత విధానంలోనే కొనసాగించాలని, ఉపాధి వేతన దారులకు ముఖ హాజరు విధానాన్ని రద్దు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి. సూర్యనారాయణ డిమాండ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యుపిఏ ప్రభుత్వ హయాంలో హామ పక్షాలు మద్దతుతో వలసకూలీల నివారణకు జాబ్ కార్డు కలిగిన కుటుంబానికి 100రోజుల పని దినాలు కల్పించి 15 రోజుల లోపు వేతనాలు చెల్లించే యోచనతో ఉపాధి హామీ చట్టాన్ని అమలు పరచడం జరిగిందన్నారు. తద్వారా లక్షణాది మంది ఉపాధి హామీ శ్రామికులు స్థానికంగా ఉంటూ ఉపాధి పొందినటు వంటి అవకాశం ఉండేది అన్నారు. ప్రస్తుత కూటమిప్రభుత్వం ఎకపక్షం ధోరణితో బివిజిరాం జి పేరుతో నూతనంగా ప్రవేశపెట్టిన పథకం ద్వార ఉపాధి కూలీలు ముఖహాజరు విధానాన్ని పెట్టడంతో సిగ్నల్ లేక కొన్ని ప్రాంతాల్లో ఫేషియల్ పడకపోవడంతో తీవ్రంగా ఇ బ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేషియల్ విధానాన్ని రద్దు చేయకుంటే ఉపాధి హామీ శ్రామికులతో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని అయన హెచ్చరించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించాలి. రోజుకు 600 వేతనం ఇవ్వాలని స్థానిక ఎంపిడిఓ విశ్వనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధి మేట్లు గిరిజన సంఘంమండల అధ్యక్షుడు పి.డొంబు పిమోహన్ దాస్ కొర్ర లైకోన్ కొర్ర రాజు చెడ్డ రమూర్తి కె.భాస్కర్ రావు పి.రేసు, తదితరులు పాల్గొన్నారు.

## వంతమూరులో మహిళల భద్రతపై అవగాహన



అరకులోయ, మే 16, ప్రభాతవార్త : మండలంలోని వంతమూరు గిరిజన గ్రామంను శనివారం స్థానిక ఫిర్యాదుల కమిటీ జిల్లా అధ్యక్షురాలు కమిడి కృష్ణకుమారి సందర్శించి, మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం మహిళల రక్షణ కొరకు కల్పించిన చట్టాలపై వివరించారు. మహిళలు భద్రత గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. ప్రతి మహిళ ఎలాంటి భయం, వేధింపులు లేకుండా స్వేచ్ఛగా, గౌరవంగా జీవించే హక్కును కలిగి ఉందన్నారు. మహిళలు ఎవరికైనా తోటి వారి నుండి ఇబ్బందులు ఎదురైతే తలను సంప్రదించాలని చెప్పారు. అనంతరం గ్రామంలో ఉన్న మహిళలకు చీరలను పంపిణీ చేసి తన ఉదారతను చాటుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద గాసి, హెచ్ ఆర్ ఏ సి ఏ సభ్యురాలు కే సింహాచలం , తదితరులు పాల్గొన్నారు.

## ఆకర్షణీయంగా మెయిన్ రోడ్డులో శతకంపట్టు సెట్



పాడేరు,మే16, ప్రభాతవార్త: ఉత్తరాంధ్ర జిల్లాల దైవం, బండ్ల ప్రజల ఇలవేల్పు పాడేరు శ్రీ మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలకు పాడేరు పట్నం ముస్తాబయింది. ఈనెల 17, 18, 19 తేదీల్లో జరగనున్న అమ్మవారు ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు ఉత్సవ కమిటీ పూర్తి చేసింది. పాడేరు మెయిన్ రోడ్ సత్కంపట్టు వద్ద ప్రతిష్టించ నున్న అమ్మవారి ఉత్సవ విగ్రహం అమ్మవారి పాదాలు అమ్మవారి



ఘట్టాలు కొలువు తీరేందుకు ప్రత్యేక ఆకర్షణీయంగా శతకం పట్టు వద్ద భారీ షర్టునుఉచ్చు కమిటీ ఏర్పాటు చేసింది. పట్టు కొలువుదీరనున్న అమ్మవారి పాదాలు ఉత్సవ విగ్రహం ఘటాలు ఉంచేందుకు ప్రత్యేక సెట్‌ను ఏర్పాటు చేశారు. అలాగే అమ్మవారి జాతర పాడేరు మెయిన్ రోడ్డు, అంబేద్కర్ సెంటర్, అమ్మవారి ఆలయం రోడ్డు ప్రాంగణం, అంబేద్కర్ జయంతి నుంచి సినిమా హాలు మీదుగా తలార్సింగ్ వర్కు రోడ్డు కటౌట్లను ఆకర్షణీయంగా ఏర్పాటు చేయడంతో పాడేరు పట్టణానికి కొత్త శోభ సంతరించుకుంది.

## నేడు మాజీ ఎమ్మెల్యే ఎల్‌బి దుక్కు 24వ వర్ధంతి



అరకులోయ, మే 16, ప్రభాతవార్త : శృంగవరపుకోట మాజీ శాశనసభ్యులు, గిరిజన గాంధీగా పిలవబడే, స్వర్గీయ ఎల్ బి దుక్కు 24 వ వర్ధంతి ని నేడు ఆదివారం నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యుడు , రాష్ట్ర ఫుడ్ కమిషన్ మాజీ సభ్యులు ఎల్ బి వెంకటరావు తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ తన తండ్రి, స్వర్గీయ మాజీ శాసనసభ్యులు లబుడు బారికి దుక్కు 24 వ వర్ధంతిని జరుపుతున్నట్లు చెప్పారు. శృంగవరపు కోట శాసనసభ్యులుగా 4 పర్యాయాలుగా ప్రజలకు సేవలు అందించి, నిజాయితీ గల ప్రజా నాయకుడిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. అలాగే స్వర్గీయ నందమూరి తారక రామారావు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్‌గా గిరిజనుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేశారన్నారు. కాగా స్వర్గీయ మాజీ శాసనసభ్యులు ఎల్ బి దుక్కు స్వగ్రామం పానిరంగిని గ్రామం.

## చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన



పాడేరు,మే16, ప్రభాతవార్త: అల్లూరి జిల్లా పాడేరు మండలం కిండంగి పంచాయతీ పరిధిలోని కిండంగి గ్రామంలో ఏర్పాటు చేసిన 'చెత్త నుండి సంపద' సృష్టించే (వెల్త్ అవుట్ ఆఫ్ వేస్ట్) తయారీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నిషాంతి. టి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా వర్మీకంపోస్ట్ (కేంద్రం) తయారీ ప్రక్రియను, నిర్వహణ తీరును కలెక్టర్ నిశితంగా పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య మెరుగుదలకు, సేంద్రియ ఎరువుల తయారీకి ఇటువంటి కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా వర్మీ కంపోస్ట్ తయారీ కేంద్రం ఆవరణలో జిల్లా కలెక్టర్ మొక్కలు నాటారు. పరిసరాలను పచ్చదనంతో పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. అంతకుముందు వర్మీ కంపోస్ట్ తయారీ కేంద్రం ప్రాంగణంలో గల గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన జిల్లా కలెక్టర్. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, విజయవాడ సి పి ఆర్ కమిషన్ సి ఇ ఓ వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జిసిసి డైరెక్టర్ బొర్ర నాగరాజు, స్థానిక మాజి గ్రామ సర్పంచ్, జిల్లా పంచాయతీ అధికారి, ఏడి సర్వే ఈశ్వర్ దొర, డిఎల్పిఓ పిఎస్ కుమార్,పాడేరు మండల తహసిల్దార్ సత్యనారాయణ , ఎంపీడీవోతేజ్ భరత్ ,ఐసిడిఎస్ సి డి పి ఓ సరదా,ఇతర అధికారులు, పంచాయతీ సెక్రటరీ కె.అమృత దుర్గ ప్రియదర్శిని, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కాంతులతో పాడేరు పట్టణం ప్రత్యేక ఆకర్షణ





పాడేరు,మే16, ప్రభాతవార్త: పాడేరు శ్రీమోదకొండమ్మ జాతర మహోత్సవాలు సందర్భంగా పట్టణం విద్యుత్ కాంతులతో కొత్త కళ సంతరించుకుంది.పాడేరు మెయిన్ రోడ్డు,శ్రీనివాస్ లాడ్జి,అంబేద్కర్ జంక్షన్ వద్ద మూడు రోడ్లు వద్ద,కాంప్లెక్స్ రోడ్డులో భారీ విద్యుత్ కటౌట్లు అందరినీ ఆకట్టుకుంటున్నాయిఅలాగే అమ్మవారి ఆలయం వద్ద,అంబేద్కర్ జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ విద్యుత్ కటౌట్లు ఏర్పాటుతో ఆకర్షణీయంగా ఉంది. విద్యుత్ కాంతులతో పాడేరులో కొత్త శోభా సంతరించుకుంది.

## సమన్వయ సమావేశంలో భూ వివాదం విచారణ




గూడెం కొత్తవీధి, మే 16, (ప్రభాతవార్త): గూడెం కొత్తవీధి మండలం దుప్పలవాడ పంచాయతీ పరిధిలోని కుమ్మరపల్లి గ్రామానికి చెందిన బైశెట్టి బాబూజీ, తరెపల్లి కోటేశ్వరరావుల మధ్య కొంతకాలంగా భూ వివాదం కొనసాగుతోంది. ఈ వివాదాన్ని శనివారం నిర్వహించిన మండల స్థాయి సమన్వయ సమావేశం లో అధికారులు క్షుణ్ణంగా విచారించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూమిని సర్వే చేసిన అనంతరం, వచ్చిన ఫలితాల ఆధారంగా భూ పంపకాలు చేసుకోవడానికి ఇరువర్గాలు సుముఖత వ్యక్తం చేస్తూ అంగీకారం తెలిపాయి. ఇరువర్గాల అంగీకారం తెలపడంతో, వారం రోజుల్లోగా వివాదాస్పద భూమికి సంబంధించిన సర్వే ప్రక్రియను పూర్తి చేసి సరిహద్దులను చూపిస్తామని తహసీల్దార్ హెచ్. అన్నాజీ రావు స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సిద్ధార్థ్ మార్క్ , తదితరులు పాల్గొన్నారు.

## మూడురోజులు మద్యం దుకాణాలు మూసివేత

పాడేరు,మే16, ప్రభాతవార్త: అల్లూరి జిల్లా ప్రొహిబిషన్అండ్ఎక్సైజ్ అధికారి సమర్పించిన నివేదిక ప్రకారం పాడేరులో జరగనున్న మోదకొండమ్మ తల్లి జాతర సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజా ప్రశాంతత కాపాడుటకు, ప్రార్థనా స్థలాల పరిసర ప్రాంతాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు పాడేరు పట్టణంలో ఉన్న నాలుగు మద్యం దుకాణాలను ఈ నెల 17 వ తేదీ నుంచి 19వరకు మూసివేస్తున్నట్టు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.పై విషయాన్ని పరిశీలించి, ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ చట్టం, 1968 లోని సెక్షన్ 20(1) ప్రకారం కల్పించబడిన అధికారాలను వినియోగించి, అల్లూరి జిల్లా కలెక్టర్ ,జిల్లా మేజిస్ట్రేట్‌చే పాడేరు మండల పరిధిలోని ఉన్న నాలుగు మద్యం దుకాణాలను మూసివేస్తూ ఆదేశాలు జారీ చేసామన్నారు. మోదకొండమ్మ తల్లి జాతర-2026 వేడుకలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించబడుటకు అలాగే ప్రజా శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా ఈ ఆదేశాలు అమల్లో ఉండనున్నాయని ఎక్సైజ్ జిల్లా అధికారి స్పష్టం చేసారు.

## పూసేలి గ్రామంలో దాహం కేకలు



అరకు రూరల్, మే 16, ప్రభాత వార్త : అల్లూరి జిల్లా అరకు లోయ మండలం బస్కి పంచాయితీకి చెందిన పూసేలి గ్రామంలో శనివారం నాడు గిరిజన సంఘం ఆధ్వర్యంలో మంచినీటి మరియు రోడ్డు సమస్య గురించి ధర్నా చేయడం జరిగింది.ఈ సందర్భంగా బస్కి సీపీఎం మాజీ ఎంపీటీసీ బురిడీ.దశరద్ మాట్లాడుతూ పూసేలి గ్రామంలో 2010సంవత్సరంలో నిర్మించిన మంచి నీటి కుండీ మరమ్మత్తుకు గురై ఎండకు ఎండిపోవడంతో పొలంలోని బురద నీరు త్రాగి జబ్బుల బారిన పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు.అలాగే గత సంవత్సరం పాడేరు స్పందన మీ కోసం కార్యక్రమంలో వెళ్లి ఫిర్యాదు చేస్తే తారు రోడ్డు మొదలుపెట్టి అసంపూర్తిగా వదిలేసారు.గత నెల కురిసిన వర్షనికి రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారడం తో చాలా ఇబ్బంది పడుతున్నామన్నారు. కావున ప్రభుత్వం వారు వెంటనే స్పందించి ఈ రెండు సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నాము.లేని యెడల పంచాయితీ కార్యాలయం ముట్టడిస్తామన్నారు .కార్యక్రమంలో కొర్ర. మార్కండ్ రావు, పెసా అధ్యక్షలు, పాంగి బోడన్నా, వంతల సుందర్ రావు, గున్నమ్మ, శాంతి, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుడికి వినికిడి పరికరం పంపిణీ



అరకు రూరల్, మే 16, ప్రభాతవార్త : అరకులోయ మండలంలోని వికలాంగులకు శనివారం ఉపకరణాలను పంపిణీ చేశారు. ట్రైబల్ డిజేబుల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ కార్యాలయంలో గుర్తించిన చెవుడు సమస్యలున్న వికలాంగులకు చెవి వినికిడి యంత్రాలను సొసైటీ అధ్యక్షుడు బిబి. ధర్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు.దుంబ్రి గూడ మండలం అరమ పంచాయతీ,దుంబ్రి వలస గ్రామానికి చెందిన వంతల వెంకటేశ్వరరావు వినికిడి సమస్య ఉన్నట్టు గుర్తించి వినికిడి మిషన్ ఇచ్చినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినికిడి సమస్యలున్న వారు ట్రైబల్ డిజేబుల్ హెల్పర్ సొసైటీకి దరఖాస్తు చేసుకుంటే వారికి ఉపకరణాలను అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే వికలాంగులకు అవసరాన్ని బట్టి వీల్చైర్లు, వాకింగ్ స్టిక్స్, ట్రైసైకిల్స్ వంటి పరికరాలు అందజేస్తామన్నారు. అరకులోయ మండల పరిధిలోని వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## గ్రామాల్లో జోరుగా దోమల మందు పిచికారీ



గూడెం కొత్తవీధి, మే 16 (ప్రభాతవార్త): జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జీ.కే. వీధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆధ్వర్యంలో రింతాడ-1 సచివాలయ పరిధిలోని అసరాడ, ఉయ్యాలమామిడి గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ కార్యక్రమం విస్తృతంగా నిర్వహించారు.ప్రతి ఇంటా దోమల నివారణ మందు స్ప్రే గ్రామాల్లోని ప్రతి గృహం లోపల, బయట 5 శాతం ఏసీఎం దోమల నివారణ మందును సిబ్బంది విజయవంతంగా పిచికారీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈ మందు కొట్టిన గోడలపై మట్టితో గానీ, పేడతో గానీ అలుకకూడదని స్పష్టం చేశారు. ఈ మందు ప్రభావం సుమారు 45 రోజుల వరకు ఉంటుందని, దీనివల్ల మలేరియా, డెంగ్యూ వంటి ప్రమాదకర సీజనల్ వ్యాధులు రాకుండా అరికట్టవచ్చని తెలిపారు. ప్రజలందరూ రాత్రి వేళల్లో తప్పనిసరిగా దోమతెరలను ఉపయోగించాలి. ఇళ్ల పరిసరాల్లో ఎక్కడా మురుగునీరు, నిల్వ నీరు లేకుండా జాగ్రత్త పడాలి. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా 'ఫ్రైడే - డ్రైడే' పాటించి పాత సామాన్లు, టైర్లు, కుండల్లోని నీటిని పారబోయాలి. వర్షాకాలం, సీజనల్ మార్పుల దృష్ట్యా ప్రజలు నీటిని బాగా కాచి, చల్లార్చిన తర్వాతే తాగాలి. వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి. కార్యక్రమంలో పాల్గొన్న వైద్య ఆరోగ్య సిబ్బందికి, దోమల నివారణ మందు కొట్టే సిబ్బందికి ప్రజలందరూ సహకరించి కోరారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి కె. పోతురాజు, హెల్త్ అసిస్టెంట్ ఎం. సత్యనారాయణ, ఆశా కార్యకర్తలు దినకుమారి, రాజేశ్వరి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

## అరకులోయలో గ్రీన్ ఎంటర్ ప్రెన్యూర్స్ ఆఫ్ ఆంధ్ర



అరకు రూరల్, మే 16, ప్రభాతవార్త : "స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహణలో భాగంగా అల్లూరి జిల్లా కలెక్టర్ నిశాంతి టి, ఆదేశాల మేరకు అరకు లోయ మండలంలో శనివారం నాడు "స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి వీసం ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా "గ్రీన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఆంధ్ర" అనే థీమ్‌తో 16 వ తేదీన అరకు లోయ మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పెద్దలబుడు గ్రామపంచాయతీ ఎస్‌డబ్ల్యూపీసీ ఆవరణలో ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా. సియ్యారి దొన్ను దొర మాట్లాడుతూ పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, పునర్వినియోగం, రీసైక్లింగ్ మరియు కంపోస్టింగ్ వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు యువత, మహిళా సంఘాలు మరియు వ్యర్థ సేకరణ కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించే గ్రీన్ ఎంటర్‌ప్రెన్యూర్షిప్‌ను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.అలాగే గ్రామస్థాయిలో ఆర్ ఆర్ ఆర్ సెంటర్ల బలోపేతం, స్వయం సహాయక సంఘాలకు శిక్షణ, పర్యావరణ హిత వ్యాపారాల ప్రోత్సాహం మరియు మార్కెట్ అనుసంధానం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కే కుమారస్వామి, తాసిల్దారుడిప్యూటీ ఎంపీడీవో కె.వి. సత్యనారాయణ, ఏఎంసి చైర్మన్ బోరి బోరి లక్ష్మి, అరకు లోయ మండల అధ్యక్షుడు లోకోయి మహదేవ్, దుంబ్రిగుడ మండల అధ్యక్షుడు కిల్లో ఆనందరావు, మాజీ సర్పంచ్ పెట్టేలి దాసుబాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు, సచివాలయ సిబ్బంది, యువజన సంఘాలు, పారిశుద్ధ్య కార్మికులు, క్లాప్ మిత్రాలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## అరకులోయలో కనువిందు చేసిన బ్రహ్మ కమలాలు



అరకు రూరల్, మే 16, ప్రభాతవార్త: బ్రహ్మ కమలం.. దివ్య సౌందర్యానికి ప్రతీక హిమాలయ ప్రాంతాల్లో అరుదుగా కనిపించే బ్రహ్మ కమలం పుష్పం తన అందం, సువాసనతో ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ పుష్పానికి శాస్త్రీయ నామం ససురియా ఓబ్వల్లాట.ఇది ఆస్టరేసి మొక్కల జాతికి చెందింది.అలాంటి అరుదైన పుష్పాలు ఆంద్రా ఊటీ అరకు లో ప్రతి ఇంటిలో సాధారణంగా కన్పిస్తాయి. ఈ మే నెల ముఖ్యంగా రెండు మూడవ వారాలలో ఈ ప్రాంతంలో బ్రహ్మ కమల పుష్పాలు పుష్పించే సమయం.ఇది ప్రధానంగా ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, నేపాల్ వంటి హిమాలయ పర్వత ప్రాంతాల్లో 3,000 నుంచి 4,500 మీటర్ల ఎత్తులో పెరుగుతుంది. భారతదేశంలోని ఉత్తరాఖండ్ రాష్ట్ర పుష్పంగా కూడా బ్రహ్మ కమలం గుర్తింపు పొందింది.హిందూ సాంప్రదాయంలో ఈ పుష్పానికి విశేష ప్రాముఖ్యత ఉంది. సృష్టికర్త బ్రహ్మదేవుని పేరుతో ఈ పుష్పం "బ్రహ్మ కమలం"గా ప్రసిద్ధి చెందింది. పురాణాల ప్రకారం దేవతల ఆరాధనలో ఈ పుష్పాన్ని పవిత్రంగా భావిస్తారు. కేదార్‌నాథ్, బద్రీనాథ్ వంటి ఆలయాలలో ప్రత్యేక పూజల్లో దీనిని వినియోగిస్తారు. ఇంట్లో బ్రహ్మ కమలం వికసిస్తే శుభం కలుగుతుందని, ఐశ్వర్యం వస్తుందని హైదవుల బలమైన విశ్వాసం.ఈ పుష్పం సాధారణంగా రాత్రి సమయంలో వికసించడం మరో ప్రత్యేకత. ఒక్కసారి వికసించిన తర్వాత కొన్ని గంటలకే ముడుచుకుపోతుంది. అందుకే దీన్ని చూసేందుకు ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ప్రకృతి అందాలకు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే బ్రహ్మ కమలం భారతీయ సంస్కృతిలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది.

## మోదమాంబ అమ్మవారి జాతర ఏర్పాట్లు పూర్తి

### యంత్రాంగం నిరంతరం అప్రమత్తం : కలెక్టర్ నిశాంతి



పాడేరు,మే16, ప్రభాతవార్త:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మూడు రోజులు పాటు రాష్ట్ర పండుగగా ఉత్తరాంధ్ర ఇలవేల్పు మోదమాంబ అమ్మవారి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ టి.నిశాంతి పేర్కొన్నారు.అమ్మవారి ప్రాంగణంలో నిర్వహించిన జాతర ఏర్పాట్ల సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ అమ్మవారి జాతర ఆదివారం ఉదయం 6 గంటలకు సతకంపట్టు నుండి ప్రారంభమవుతుందన్నారు. జాతర నిర్వహించడానికి అల్లూరి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. కంట్రోల్ రూమ్‌కు డ్రోన్ నిఘా, జన సమూహ నిఘా అనుసంధానం చేశామని , ముఖ్యంగా విశాఖపట్నం, చింతపల్లి, అరకు లోయ మరియు ఇతర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు, సందర్శకులు వచ్చే అన్ని ప్రవేశ మార్గాలలో తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసామన్నారు.ముఖ్యమైన ప్రదేశాలలో బస్ స్టాప్, జూనియర్ కళాశాల మైదానం, అమ్మవారి గుడి మొదలైన చోట్ల సీసీటీవీలను ఏర్పాటు చేసి భద్రతను నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ప్రైవేట్ జీపులను పర్యవేక్షించడానికి ఆర్టివో సిబ్బందితో సమన్వయం చేసుకొని, భక్తులు యాత్రికుల నుండి అధిక లోడ్ అదనపు ప్రయాణ ఛార్జీల వసూలును నివారించడానికి,కార్ పార్కింగ్, వాహనాల రాకపోకల గురించి ప్రజలకు తెలియజేయడానికి అన్ని చోట్లా సూచిక బోర్డులు,ఫ్లెక్సీలను, సిబ్బందిని ఏర్పాటు చేసామన్నారు.అమ్మవారి ఊరేగింపు సమయంలో జన సమూహ నియంత్రణకు సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, ఆలయ కమిటీ చైర్మన్ గిడ్డి ఈశ్వరి, జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, ఐటిడిఏ పిఓ ఆదిత్య వర్మ, జిల్లా ఇంచార్జ్ రెవెన్యూ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు, జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సహకారంతో ఆర్గానిక్ జిల్లాగా తీర్చిదిద్దాం



పాడేరు, మే16, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణే ధ్యేయంగా 'గ్రీన్ ఎంటర్‌ప్రైజెస్ ఆఫ్ ఆంధ్ర' విభాగాలను మరింత బలోపేతం చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ నిషాంతి. టి తెలిపారు.శనివారం ఉదయం స్వర్ణాంధ్ర స్వచంద్ర కార్యక్రమంలో భాగంగా పాడేరు మండలం కిండంగి గ్రామం లో తడి పొడి చెత్తతో సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించి అనంతరం విఆర్ కళ్యాణ మండపంలో జిల్లా పంచాయతీ శాఖ ఏర్పాటుచేసిన పారిశుద్ధ్య కార్మికులు, క్లాక్ మిత్రులు ,ఎఫ్పిఓస్లతో పాటు అలాగే కిండంగి, గుడివాడ సుంద్రుపుట్టు,? స్వయం సహాయక సంఘాలతో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడుతూ, పరిశుభ్రమైన హరిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విజయవాడ సి పి ఆర్ కమిషన్ సీఈవో వెంకటేశ్వరరావు, జిసిసి డైరెక్టర్ బొర్ర నాగరాజు, జిల్లా పంచాయతీ అధికారి, డి ఎల్ పి ఓ, జిల్లా అధికారులు, స్వయం సహాయక సంఘ సభ్యులు, క్లాక్ మిత్రాలు, పారిశుద్ధ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాకవరపాలెం, మే 16, ప్రభాతవార్త

డెంగ్యూ వ్యాధి వ్యాప్తి చెందకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి ప్రత్యూష పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం మాకవరపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో జాతీయ డెంగ్యూ నివారణ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా వైద్యాధికారి ప్రత్యూష మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వాడిన పాత్రలను ఎప్పటికప్పుడే శుభ్రపరచాలన్నారు. పరిసరాలలో ఉండే నీటి తొట్టిలను డబ్బాలను నీటినిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. పాత్రలు, డబ్బాలలో నిలువ నీరు ఉండటం వలన దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పరిసరాలు శుభ్రంగా ఉంచుకొని డెంగ్యూ వ్యాధిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. పరిసరాలు పరిశీలించండి, శుభ్రం చేయండి, మూతలు పెట్టండి, అనే నినాదంతో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ రమేష్, ఎంపిహెచ్ఓ,లగుడు సత్తిబాబు, పీహెచ్ఎం సరస్వతి, సూపర్వైజర్ ప్రభాకర్, క్షయ వ్యాధి ల్యాబ్ టెక్నీషియన్ సుధీర్,ఆస్పత్రి సిబ్బంది ఆరోగ్య,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## శర వేగంగా సూర్యఘర్ సోలార్ పథకం

మాకవరపాలెం, మే 16, ప్రభాతవార్త



మాకవరపాలెం మండలంలో ప్రధానమంత్రి సూర్యఘర్ సోలార్ పథకం శరవేగంగా జరుగుతుందని, వినియోగదారులు మరింత ఉత్సాహంతో ముందుకు రావాలని విద్యుత్ శాఖ ఇంజనీర్ బాలకృష్ణ అన్నారు. ఈమేరకు శనివారం మండలంలోని పైడిపాల గ్రామంలో స్వచ్ఛ్ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి మోహన్ రావు డిప్యూటీ ఎంపీడీవో మేరీ జోన్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా సోలార్ పథకం పైఅవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈ బాలకృష్ణ వినియోగదారులకు సోలార్ పథకం ప్రయోజనాలను వివరించారు.సోలార్ పథకం ద్వారా వినియోగదారులు విద్యుత్తును ఉచితంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే మాకవరపాలెం మండలంలో 611 మంది వినియోగదారులు సోలార్ విద్యుత్ ఏర్పాటుకు అర్హులుగా గుర్తించడం జరిగిందన్నారు. 99 మంది వినియోగదారులు సోలార్ ప్లాంట్లు నిర్మించడం జరిగిందన్నారు. మరో 126 మంది లబ్ధిదారులకు ప్లాంట్ ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నట్లు బాలకృష్ణ తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు 2కెవి సోలార్ ప్లాంట్లు ఉచితంగా ఏర్పాటు చేయడం జరుగుతుం దన్నారు. పైడిపాల గ్రామంలో 29 మంది ఎస్సీ లబ్ధిదారులకు సోలార్ ప్లాంటు నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి సూర్య ఘర్ సోలార్ పథకంలో చేరి ఉచిత విద్యుత్తు పొందేలా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పైడిపాల టిడిపి పార్టీ అధ్యక్షులు,గ్రామపెద్దలు సిద్దా బత్తుల వెంకటరమణ(శ్రీను), మండల ఇంజనీర్ సోమశేఖర్, వెలుగు ఏపీఎం మంగ, డిప్యూటీ ఎంపీడీవో మేరీ జోన్స్, అధిక సంఖ్యలో మహిళలు ప్రజలు స్వర్ణాంధ్ర సత్యాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం



నర్సీపట్నం,మే 16,ప్రభాతవార్త

నర్సీపట్నం శాఖ గ్రంధాలయంలో గ్రంధాలయాధికారి పి.దమయంతి ఆధ్వర్యంలో వేసవి శిక్షణా శిబిరం కొనసాగుతుంది. ఇందులో భాగంగా శనివారం విద్యార్థులచేత కొంతసేపు కథల పుస్తకాలు చదివించారు. పిల్లల చేత కథలు చెప్పించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పీ.ప్రభాకర్ పర్యవేక్షణలో పిల్లలందరూ కొంతసేపు చెస్ ఆడుకున్నారు. పిల్లలు చేసిన తప్పిదాలను సరిదిద్దారు. పిల్లలకు ఈరోజు స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం ఉన్నందున నేటి కార్యక్రమం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. గ్రంధాలయములో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో యువతి యువకులు పాఠశాల విద్యార్థులు పాల్గన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకర్ ఆంగ్ల అక్షరములతో విద్యార్థులకు ఒక ఫన్ గేమ్ ఆడించారు. ఈ శిబిరంలో విద్యార్థులంతా చురుకుగా పాల్గొన్నారు.

## నర్సీపట్నంలో టీజీ వెంకటేష్ జన్మదిన వేడుకలు

నర్సీపట్నం,మే 16,ప్రభాతవార్త



రాజసభ సభ్యులు టీజీ.వెంకటేష్ జన్మదిన సందర్భంగా నర్సీపట్నం అబిద్ సెంటర్లోని ఆటో స్టాండ్ వద్ద మజ్జిగ పంపిణీతో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ఎస్ఐ ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. వేసవిలో ఇటువంటి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం మంచి పరిణామం ఎస్ఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు లక్ష్మణరావు, ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం జాయింట్ సెక్రటరీ పద్మనాభుని సోమరాజేశ్వరి, అనకాపల్లి జిల్లా గౌరవ అధ్యక్షులు దేవత అరుణ, డాక్టర్ సి.ఎస్. కుమార్ దంపతులు మరియు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకానికి నిధులను కేంద్ర ప్రభుత్వమే భరించాలి



నర్సీపట్నం,మే 16,ప్రభాతవార్త

ఉపాధి హామీ పథకానికి నిధులు కేంద్ర ప్రభుత్వంమే భరించాలని సీఐటియూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. నర్సీపట్నం మండలం వేములపూడిలో ఉపాధి కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అడిగర్ల రాజు మాట్లాడుతూ ఉపాది హామి నిర్వహణకు మొత్తం నిధులను 90శాతం కేంద్ర ప్రభుత్వమే భరించాలని, ముఖ హాజరు సడలించాలని చెప్పారు. వేసవికాలంలో వేసవి అలవెన్సులు, ఐదు కిలోమీటర్ల దాటితే ప్రయాణం చార్జీలు, పనిముట్లు, టెంట్లు సౌకర్యాలు కల్పించాలన్నారు. భవిష్యత్తులో ఉపాధి పని జాబ్ కార్డుకు 200 రోజులు కల్పించి రోజుకు 600 రూపాయలు గిట్టుబాటు కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా ఎర్రయ్య దొర..



ఎలమంచిలి, మే 16, ప్రభాతవార్త

వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా యలమంచిలి సీనియర్ నాయకులు బద్దపు ఎర్రయ్య దొరను అధిష్ఠానం నియమిస్తూ ఉత్తర్వుల జారీ చేసింది. బొద్దపు ఎర్రయ్య దొర వైసిపి పార్టీ ప్రారంభం నుండి పార్టీ అభివృద్ధి కోసం పని చేసి,నిరంతరం పార్టీ అభివృద్ధికి పాటుపడే వ్యక్తిగా అధిష్ఠానం గుర్తించి రాష్ట్రస్థాయిలో జాయింట్ సెక్రటరీగా పదవికి ఎంపిక చేయడం పట్ల పలువురు వైసీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎర్రయ్య దొరకు పలువురు నాయకులు అభినందనలు తెలియజేశారు.

## అన్నా క్యాంటీన్లు నిర్వహణలో పరిశుభ్రతను, నాణ్యతను పాటించండి

### జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

పాయకరావుపేట,మే 16, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్లను పరిశుభ్రంగా నిర్వహించాలని, ఆహార పదార్థాలలో నాణ్యతను పాటించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. శనివారం పాయకరావుపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల అన్నా క్యాంటీన్ ను కలెక్టర్ విజయ కృష్ణన్ పరిశీలించారు. అన్న క్యాంటీన్ అంతా కలియతిరిగి పరిశుభ్రతా చర్యలను గమనిస్తూ నిత్యం అన్నా క్యాంటీన్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మౌలిక సదుపాయాలలో లోటుపాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆహారాన్ని భుజిస్తున్న వారితో మాట్లాడుతూ ఆహార నాణ్యతను, రుచిని అడిగి తెలుసుకున్నారు. అన్న క్యాంటీన్లలో ఆహారం కోసం వచ్చిన వారికి అతిధి దేవోభవ అంటూ చిరునవ్వుతో ఆహారాన్ని వడ్డించాలని, ఇంటిలో మనం భోజనం చేసేటప్పుడు, బంధువులకు ఆతిథ్యమిచ్చేటప్పుడు శుచి, శుభ్రత, రుచి, నాణ్యత పట్ల ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటామో అదేవిధంగా అన్నా క్యాంటీన్లలో కూడా భోజనం చేసే వారి పట్ల అంతే జాగ్రత్తలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం వడ్డిస్తున్న ఆహారాన్ని పరిశీలించి ఆహారాన్ని రుచిగా తయారుచేసి, పరిశుభ్రమైన ప్లేట్లలో ఆహారాన్ని వడ్డించాలన్నారు. అన్న క్యాంటీన్లను నిత్యం పర్యవేక్షిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్య చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు డొంకాడ శాంతి భూషణ రావు, ఎంపిడిఓ అడపా లవరాజు, డిప్యూటీ ఎంపిడిఓ వై వి సత్యనారాయణ, వెలుగు ఏపిఎం రొంగలి శ్రీనివాసరావు, ఎస్ఐ జుత్తు పురుషోత్తం, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చించలపు ప్రదీప్ (పద్దు), పట్టణ అధ్యక్షులు యాళ్ళ వరహాలబాబు, పార్టీ సీనియర్ నాయకులు గూటూరు శ్రీనివాసరావు, మజ్జూరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## పాయకరావుపేటలో ఘనంగా "సాసా" కార్యక్రమం

### ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలి :జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్



పాయకరావుపేట,మే 16, ప్రభాతవార్త

జిల్లాలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పిలుపునిచ్చారు. "స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ్ర" కార్యక్రమంలో భాగంగా శనివారం పాయకరావుపేట గ్రామ పంచాయతీ, మండల పరిధిలో నిర్వహించిన "సాసా" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పాల్గొని పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పలు కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా అరికట్టాలని పిలుపునిస్తూ పాయకరావుపేట పట్టణంలో సూర్యమహల్ సినిమా థియేటర్ సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల అన్నా క్యాంటీన్ వరకూ భారీ ర్యాలీని నిర్వహించి అందరిచేత "సాసా" ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ "సింగిల్ యూజ్" (ఒక్కసారి మాత్రమే వాడే) ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దీనికి ప్రత్యామ్నాయంగా ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల స్థానంలో స్టీల్ ప్లేట్లు, గ్లాసులను ఉపయోగించేలా ప్రోత్సహించడానికి "బర్తన్ బ్యాంక్ " కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సంధర్భగా పర్యావరణ పరిరక్షణలో ముందుండే గ్రీన్ అంబాసిడర్లకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. చివరగా జిల్లా కలెక్టర్ సమక్షంలో పాయకరావుపేట రూర్బన్ గ్రామ పంచాయతీ మరియు స్వయం సహాయక సంఘాల గ్రూపుల మధ్య ఘన వ్యర్థాల సంపద సేకరణ కేంద్రం నిర్వహణ మరియు పర్యవేక్షణకు సంబంధించిన ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## వేరు వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒక యువకుడు మృతి

### నలుగురికి తీవ్ర గాయాలు..

నక్కపల్లి ,ప్రభాతవార్త



నక్కపల్లి జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒక యువకుడు మృతి చెందగా నలుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నక్కపల్లి ఎస్సీ కాలనీకి చెందిన సిక్కోలు రాజు, గొడుగు థామస్, బద్ద పండు ముగ్గురు కలిసి ఎస్. రాయవరం మండలం అడ్డు రోడ్డు వద్దకు బైకుపై వెళ్లి తిరిగి నక్కపల్లి వైపు వస్తుండగా నక్కపల్లి ఫైర్ స్టేషన్ వద్దకు వచ్చేసరికి ఆకస్మాత్తుగా రోడ్డుపై లారీ నిలిపివేయడంతో ఒక్కసారిగా వీరు నడుపుతున్న బైకు ఢీకొట్టింది. బైకు ఢీకొట్టిన సందర్భంలో తీవ్ర గాయాలైన చిక్కోలు రాజు(22) ఘటనా స్థలంలోనే మృతి చెందగా.. గొడుగు దామస్ ,బద్ద పండు తీవ్రంగా గాయపడ్డారు .ప్రమాద సంఘటన విషయాన్ని తెలుసుకున్న స్థానికులతో పాటు సీఐ జూరెడ్డి మురళి, ట్రాఫిక్ సిబ్బంది చేరుకొని హుటా హుటిన నక్కపల్లి 50 పడకల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ప్రథమ చికిత్స చేసిన వైద్యులు కాకినాడ జిల్లా తుని ప్రైవేట్ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. ఆ ప్రమాదం జరిగిన సందర్భంలో జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోవడంతో సీఐ జూరెడ్డి మురళి రంగంలో దిగి సాటి సిబ్బందితో కలసి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ మురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నక్కపల్లి జాతీయ రహదారిపై ఎస్ రాయవరం మండలం అడ్డురోడ్ నుంచి బైక్ పై నక్కపల్లి వైపు వస్తున్న ఇరువురు యువకులు వారి నడుపుతున్న బైకు అదుపుతప్పడంతో తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని నక్కపల్లి 50 పడకల ఆసుపత్రికి తరలించి చికిత్స అందించిన అనంతరం తుని ప్రైవేట్ ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

## కేశవరంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం

పాయకరావుపేట, మే 16, ప్రభాతవార్త



మండలంలోని కేశవరం గ్రామంలో శనివారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా నేటి నుండి ఈ గ్రామంలో ఎటువంటి కార్యక్రమాలు జరిగినా పేపర్ ప్లేట్లుకు స్వస్థి పలుకుతూ స్టీల్ ప్లేట్లు వినియోగించే విధంగా గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి "శ్రీ విఘ్నేశ్వర సంఘం" సభ్యులు మేడిశెట్టి నాగలక్ష్మి, మేడిశెట్టి వినీత, మేడిశెట్టి శివలక్ష్మి ముగ్గురు సభ్యులు సహకరించడం జరిగింది. గ్రామంలో ఇకపై జరిగే అన్ని కార్యక్రమాలకు స్టీల్ ప్లేట్లలోనే భోజనాలు చేయాలని పేపర్ ప్లేట్లను పూర్తిగా నిర్మూలించాలని అదేవిధంగా స్టీల్ గ్లాసులు కూడా వాడకం మొదలు పెట్టడం జరిగింది. గ్రామంలో నేటి నుండి ప్లాస్టిక్ వస్తువులు వాడబోమని, కేవలం స్టీల్ ప్లేట్లుతో మాత్రమే కార్యక్రమాలు నిర్వహిస్తామని చెబుతూ గ్రామస్తులందరూ ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేశవరం గ్రామ పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ మేడిశెట్టి రామ గోవిందు, వెలుగు ఎపిఎం రొంగలి శ్రీనివాసరావు, సిసి కాలపురెడ్డి దేవతా రెడ్డి, స్థానిక స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ఒరిస్సా రాష్ట్రంలో మత్స్యకారులను కలిసిన పిక్కిస్వామి

నక్కపల్లి రూరల్/అడ్డు రోడ్డు ,ప్రభాతవార్త



మండలంలోని రాజయ్యపేట గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు పిక్కి స్వామి భవిష్యత్తులో జరిగే స్థానిక ఎన్నికల్లో తనకు సర్పంచ్‌గా అవకాశం కల్పించాలని కోరుతూ రాజయ్యపేట గ్రామానికి సంబంధించిన మత్స్యకారులు ఆ ప్రాంతంలో ఉండడంతో వారిని మర్యాదపూర్వ కలిసి తన అభిప్రాయాలను తెలియజేస్తున్నారు. ఒరిస్సా తో పాటు పూరి ప్రాంతంలో ఉన్న మత్స్యకారులను కలిసే సందర్భంలో వారు చూపించే ఆదరణ, ప్రేమ ఎంతో సంతోషం కలిగించిందని ఈ సందర్భంగా స్థానిక విలేకరులకు మత్స్యకారులను కలిసి వచ్చిన అనంతరం తెలియజేశారు. అనేకమైన సమస్యలు అక్కడున్న పెద్దల ద్వారా తెలియజేశారని ఆ సమస్యల పరిష్కారానికి అవకాశం కల్పిస్తే కృషి చేస్తానని వారికి మాటిచ్చి వచ్చానని తెలిపారు. ఆదర అభిమానులు చూపించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతోపాటు మాజీ ఎంపిటిసి తాతీలు ,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎరుపల్లి నగేష్ లతోపాటు పలువురు ఉన్నారు.

## గూడుపమ్మను దర్శించుకున్న ఎంపీడీవో చలపతిరావు



(నక్కపల్లి,ప్రభాతవార్త

మండలంలోని గూడుపమ్మతల్లి ఆలయాన్ని శనివారం నక్కపల్లి ఎంపీడీవో కె.చలపతిరావు దర్శించుకున్నారు. ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు. కోటనందూరు మండలం రాపాకకు చెందిన అమ్మవారి సేవకుడు చిట్టిబాబు, నక్కపల్లి మండలం వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ కె.రఘు, ఫార్మసిస్ట్ భీశెట్టి రామకృష్ణ గూడుపమ్మను దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరిరాజు ఆధ్వర్యంలో వీరిని అమ్మవారి శేషవస్త్రాలతో సత్కరించారు.

## పరిశుభ్రతతోనే ఆరోగ్యం

నక్కపల్లి, మే 16, ప్రభాతవార్త



మండలంలోని అనేక గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర అవగాహనా ర్యాలీ చేపట్టారు. రేబాక గ్రామంలో ఉపాధి కూలీలతో కలిసి అవగాహనా ర్యాలీ చేపట్టారు. ఎంపీటీసీ సభ్యురాలు ధనలక్ష్మి మాట్లాడుతూ పరిశుభ్రత పాటించినప్పుడే ప్రజలు, సమాజం ఆరోగ్యంగా వుంటుందన్నారు. సెక్రటరీ పార్థ సారధి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, కాసుబాబు, ఆదినారాయణ(లచ్చబాబు) తదితరులు పాల్గొన్నారు. వేంపాడు ఆయుష్ ఆస్పత్రి వద్ద వైద్యాధికారి డాక్టర్ కె.రఘు, ఫార్మసిస్ట్ భీశెట్టి రామకృష్ణ ఆధ్వ ర్యంలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారు.

## ఆగస్టు 3 నుంచి గీతం దూర విద్య పరీక్షలు

విశాఖపట్నం, మే 16, ప్రభాతవార్త

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సిడిఓఈ) ద్వారా వివిధ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు ఈ ఏడాది ఆగస్టు 3వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ తెలిపారు. దీనికి సంబంధించి జూన్ 10వ తేదీ లోగా ధరఖాస్తు చేసుకోవలసి ఉంటుందన్నారు. ఆలస్య రుసుము రూ.500తో జూన్ 15వ తేదీ వరకు, ఆలస్య రుసుము రూ.1500 చెల్లించి జూన్ 20వ తేదీలోగా ధరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పూర్తి సమాచారం కోసం దొండపర్తిలోని గీతం సిటీ సెంటర్‌ను సంప్రదించాల్సిందిగా సూచించారు. ఆన్‌లైన్‌లో ధరఖాస్తుల కోసం వెబ్‌సైట్‌ను www.CDOE.GITAM పరిశీలించాల్సిందిగా సూచించారు.

## ఎల్‌నీనో ప్రభావంతో వ్యవసాయంలో జాగ్రత్తలు పాటించాలి

### నేలతల్లి రక్షణకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం

యలమంచిలి, మే 16 ప్రభాతవార్త



రాంబిల్లి మండలం హరిపురం, దిమిలి రైతు సేవా కేంద్రాల్లో ధర్తీ మాత బచావో- నేలతల్లి రక్షిద్దాం కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి అనకాపల్లి జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారిని పి.విజేత హాజరయ్యారు, ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు, ఎల్‌నీనో ప్రభావంతో మే జూన్ జూలై నెలల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఈ నేపథ్యంలో నేలలో తేమను కాపాడేందుకు భూమిని ఎప్పుడు మొక్కలతో కప్పి ఉంచాలని సూచించారు, రైతులు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది (ఏపిసిఎన్ఎఫ్) ద్వారా పిఎం డిఎస్ కిట్లు తీసుకుని సాగు చేయాలన్నారు, అలాగే జనుము, జీలుగ, పిల్లి పెసర విత్తనాలు సబ్సిడీపై రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. వీటి సాగుతో భూమిలో సూక్ష్మజీవుల వృద్ధి పెరిగి భూసారం మెరుగుపడుతుందని వివరించారు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులైన పశువుల గెత్తం, వర్మికంపోస్ట్, పచ్చిరొట్ట ఎరువుల వినియోగాన్ని ఉపయోగించాలని సూచించారు, సేంద్రీయ వ్యవసాయం ద్వారా భూమి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పంటల దిగుబడులు స్థిరంగా ఉంటాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఏఓ సి.సుమంత, మండల పార్టీ నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, వి.ఏ.ఏలు రైతులు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

## రాంబిల్లి పోలీసుల చాకచక్యంతో అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్

### -66 లక్షల విలువైన బంగారం స్వాధీనం

యలమంచిలి, మే 16 ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా రాంబిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల నమోదైన చోరీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి నిందితులను సీఐ సిహెచ్.నరసింగరావు పర్యవేక్షణలో ఎస్సై డి.నాగేంద్ర చాకచక్యంగా పట్టుకున్నారు, జిల్లావ్యాప్తంగా వరుస చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్‌గా మారిన అంతర్ జిల్లా ప్రొఫెషనల్ దొంగల ముఠాను ప్రత్యేక దర్యాప్తు బృందం సాంకేతిక ఆధారాలు, ఫీల్డ్ ఇంటెలిజెన్స్ సహాయంతో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి సుమారు 66 లక్షల విలువైన 450 గ్రాముల బంగారు ఆభరణాలు, 250 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు, నిందితులు రొంగలి ప్రకాష్ (24) పాచిలవాని పాలెం, ఈర్ల వినయ్ కుమార్ (28) విశాఖపట్నం, సిరికి విజయ్ కుమార్ (27) పాచిలవాని పాలెం గ్రామానికి చెందినవారుగా తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు ఈ ముఠా రాత్రి వేళలో ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతూ జిల్లాల మధ్య సంచరిస్తూ నేరాలు చేస్తున్నట్లు వెల్లడించారు, రాంబిల్లి తోపాటు ఎలమంచిలి, అనకాపల్లి, సబ్బవరం, ఎస్.కోట, నాదెండ్ల ప్రాంతాల్లో కూడా వీరు చోరీలకు పాల్పడినట్లు విచారణలో అంగీకరించారన్నారు. ఈ విజయవంతమైన కేసు చేదన పై జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా (ఐపీఎస్) రాంబిల్లి పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఎస్సై నాగేంద్ర ని ప్రత్యేకంగా అభినందించి ప్రశంస పత్రాలు అందజేశారు. జిల్లా ప్రజల భద్రత కోసం పోలీసులు అహర్నిశలు పనిచేస్తున్నారని అనుమానస్పద వ్యక్తుల సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించాలని ఎస్పీ సూచించారు.

## జాతీయ నాయకుడి విగ్రహానికి రక్షణ కరువు

### - తక్షణమే ప్రొటెక్షన్ వాల్ నిర్మించాలని దళితుల డిమాండ్

యలమంచిలి, మే 16 ప్రభాతవార్త



రాంబిల్లి మండలం దిమిలి గ్రామంలో ఉన్న జాతీయ నాయకుడు, భారత మాజీ ఉప ప్రధాన మంత్రి, దళితుల ప్రీతిపాత్రుడైన బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి రక్షణ లేక ప్రమాద పరిస్థితులు నెలకొన్నా యి. స్వతంత్ర పోరాట ఉద్యమ స్ఫూర్తికి రాజకీయ చైతన్యానికి పేరు గాంచిన దిమిలి గ్రామ ప్రవేశ ద్వారం వద్ద 2002 సంవత్సరంలో అప్పటి దళిత నాయకులు విజయ్ కుమార్, కొమ్ము సూర్యనారా యణ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ప్రతిష్టించారు, గ్రామానికి ఎడమ వైపున కాలువ పక్కన ఏర్పాటు చేసిన ఈ విగ్రహానికి ఇప్పటివరకు రక్షణ గోడ నిర్మించక పోవ డంతో కాలువ నీటి ప్రవాహం కారణంగా భూమి కోతకు గురైంది. దీంతో విగ్రహం ఎప్పుడైనా కాలువలోకి ఒరిగిపోయి పడిపోతుందేమో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్థానిక నాయకులకు, పంచాయతీ అధికారులకు ప్రొటెక్షన్ వాల్ నిర్మించాలని వినతి పత్రాలు అందజేస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 24 సంవత్సరాలు గడిచిన సమస్యను పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదని విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఆనుకొని ఉన్న కాలువకు రక్షణ గోడ నిర్మిస్తే ఒకవైపు రోడ్డుకు మరోవైపు జాతీయ నాయకుడు విగ్రహానికి రక్షణ కల్పించినట్లు అవుతుందని నాయకులు, దళితులు కోరుతున్నారు.

## సింహాచలం దేవస్థానంలో ఘనంగా స్వచ్ఛ ఆంధ్ర



సింహాచలం, ప్రభాతవార్త

పరిశుభ్రతే దైవత్వమని, అపవిత్రతను తొలగించి అంతర్లీనంగా ఉండే దైవత్వాన్ని దర్శించుకోవడమే నిజమైన ఆధ్యాత్మికత అని సింహగిరి సాక్షిగా మరోసారి నిరూపితమైంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి" నారా చంద్రబాబు నాయుడు" పిలుపు మేరకు, రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న "స్వచ్ఛ ఆంధ్ర" ఉద్యమంలో భాగంగా శనివారం శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. మూడువ శనివారం సందర్భంగా ఉద్యోగులందరూ కలిసి శానిటేషన్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పరిసరాలను భక్తులకు ఆహ్లాదం కలిగించేలా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. రాజ గోపురం ఎదురుగా నిర్వహించిన "స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ" కార్యక్రమం ఎంతో స్ఫూర్తిదాయకంగా సాగింది. "నా రాష్ట్రం – నా బాధ్యత" అని చాటుతూ సిబ్బంది అందరితో కలిసి ఆలయ కార్య నిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు ప్రమాణం చేయించారు. కొంత సమయాన్ని పరిశుభ్రతకు కేటాయించడం ద్వారా 'స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర' లక్ష్యాన్ని చేరుకోగలమని" ఆకాంక్షించారు. ఈ సేవా కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబాబు డిప్యూటీ ఇంజనీర్ రామరాజు, తాతాజీ,ఏ ఈ ఓ రమణమూర్తి, పిల్లా శ్రీనివాసరావు,శానిటేషన్ ఏఈఓ పంతం శ్రీనివాస్, పర్యవేక్షణ అధికారి సునీల్ కుమార్, సత్యవాణి, దేవస్థాన సీనియర్, జూనియర్ సహాయకులు, ఇతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

## సింహాచల క్షేత్రంలో డిజిటల్ విప్లవం

### భక్తుల సౌకర్యార్థం క్యూఆర్ కోడ్

సింహాచలం, ప్రభాతవార్త



రాష్ట్ర దేవాదాయ శాఖ ఉత్తర్వుల ప్రకారం, దేవాలయాలలో భక్తులకు సేవలపై పూర్తి అవగాహన కల్పించేం దుకు మరియు దర్శన ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానంలో గత వారం రోజుల క్రితం ఒక సరికొత్త డిజిటల్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఈ ప్రశంసనీయమైన డిజిటల్ విప్లవంలో భాగంగా, సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు నేడు ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం అందుబాటులోకి తెచ్చిన క్యూఆర్ కోడ్ విధానాన్ని స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఈ క్యూఆర్ కోడ్‌లను ఎలా ఉపయోగించాలో స్వయంగా వివరిస్తూ, వాటిని అలవాటు చేసే ప్రక్రియను ఆయన పర్యవేక్షించారు. భక్తులు దేవస్థానంలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా, వివిధ సేవల వివరాలను సులభంగా అర్థం చేసుకునేందుకు వీలుగా దేవాదాయ శాఖ ప్రత్యేక అవగాహన వీడియోలను రూపొందించింది. ఈ వీడియోల ద్వారా ఆలయ విశిష్టత, నిత్య పూజా కార్యక్రమాల సమయాలు, మరియు వివిధ సేవల వివరాలను భక్తులకు డిజిటల్ స్క్రీన్ల ద్వారా స్పష్టంగా వివరిస్తున్నారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని స్వామివారి భక్తులకు పారదర్శకమైన, వేగవంతమైన మరియు త్వరితగతిన సేవలు అందించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా భక్తులకు దళారీల భయం లేకుండా, నేరుగా అధికారిక సేవల సమాచారం అందుతుందని, దీనివల్ల గందరగోళం లేని సులభతర దర్శనం భక్తులకు సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ భూములను పరిశీలించిన జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

నక్కపల్లి, ప్రభాతవార్త

మండలంలోని చందనాడ బుచ్చిరాజుపేట అమలాపురం గ్రామాల్లో కలుపుకొని స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించిన పనులతో పాటు అక్కడున్న భూములను శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా తాసిల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆమె ఆర్డీఓ వివి రమణ, తాసిల్దార్ చిన్ని కృష్ణలతోపాటు పలువురు మండల స్థాయి అధికారులతో తహశీల్దార్ కార్యాలయంలో సమావేశమైన కలెక్టర్ భూములకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్వాసితులకు సంబంధించిన కొన్ని విషయాలను మాట్లాడారు. పూర్తిస్థాయిలో భూములు పరిశీలించిన ఆమె మండల స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు.

# చెలి

ఎండాకాలం.. మే నెల సగం అయిపోయింది. మామిడి కాయలు టెంక కట్టి ఎదురు చూస్తున్నాయి. జాడీలు స్నానాలు చేసి ఎండలో సేదదీరుతుంటాయి. ఇంట్లో మిక్సీలు గిర్ర్ర్ అంటూ గోల చేస్తుంటాయి. మామిడి కాయలు కొట్టే కత్తి పుల్లదారి పదునుదేలింది. ముక్కలు కొట్టండి.. పళ్లెంలో వేయండి.కారం కలపండి. జాడీలకెత్తండి.. పళ్లెంలో వేడి వేడి అన్నం వేసి కలపండి. ఇంటిల్లిపాదీ ఆవురావురుమని తినవచ్చు.

రుచి

## ఔరౌర... ఆవకాయ !

### ఆవకాయ



**కావలసినవి :** పచ్చి మామిడి ముక్కలు–కేజీ, పచ్చిశనగలు–50 నగ్రాములు, సన్న ఆవాలు–పావు కేజీ, మెంతులు– రెండు టేబుల్ స్పూన్లు, గుంటూరు మిరపపొడి–పావు కేజీ, ఉప్పు–యాభై గ్రాములు, పసుపు–టేబుల్ స్పూన్, నువ్వుల నూనెలేదా వేరుశనగనూనె– పావుకేజీ,

**తయారీ :** ఆవకాయ పట్టడానికి ముందు రోజు మిరపకాయలు, ఆవాలు, మెంతులను విడిగా ఎండబెట్టాలి. మరునాడు ఉదయం ఆవాలను మిక్సీలో పొడిచేయాలి. మిరపపొడి రెడీమేడ్‌ది కూడా తీసుకోవచ్చు. కానీ ఆవాలు స్వయంగా చేసుకోవాలి. . మామిడి కాయలను కడిగితే నీరుపోయే వరకు తుడిచి ఆరబెట్టాలి. బాగా ఆరిన తర్వాత కాయలకున్న తొడిమ తొలగించాలి. అప్పటికీ సొన కారుతుంటే శుభ్రమైన నూలు వస్త్రంతో తుడిచేయాలి. ఇలా సిద్ధం చేసుకున్న మామిడికాయలను టెంకతో సహా చిన్న ముక్కలు చేసుకోవాలి. శనగలను శుభ్రమైన వస్త్రంతో తుడిచి పక్కన పెట్టాలి. వెడల్పుగా ఉన్న పెద్దపాత్రలో మామిడి ముక్కలు వేయాలి. అందులో శనగలు,ఆవాల పొడి, మిరపపొడి, ఉప్పు, పసుపు వేసే అట్లకాడతో బాగా కలపాలి. మెంతులు కూడా వేసి బాగా కలపాలి. చివరగా నూనెపోసి ముక్కలకు ఒత్తిడికి కలగకుండా అడుగు నుంచి కలిపితే దీనిని పింగాణి జాడీలో పెట్టి అంచులకు తెల్లని శుభ్రమైన నూలు వస్త్రాన్ని కట్టాలి. ఆ పైన మూత పెట్టాలి. ఈ జాడీలోని ఆవకాయను రోజూ మూత తీయ కూడదు. రోజువారీ వాడుకకు అవసరమైనంత చిన్న జాడీలోకి తీసుకుంటూ ఉంటే ఎక్కువ రోజులు తాజాగా ఉంటుంది.

### బెల్లంతో..

**కావలసినవి :** మామిడి ముక్కలు–అర కేజీ, బెల్లం–అరకేజి, మిరపపొడి–200 నరగాములు, ఉప్పు–200 గ్రాములు, ఆవపిండి–100 గ్రాములు, నూనె–200 గ్రాములు. **తయారీ :** మామిడి కాయలను శుభ్రంగా కడిగి తుడిచి టెంకతో సహా ముక్కలు చేసుకోవాలి. . బెల్లాన్ని తురిమి వెడల్పుపాత్రలో వేసే అందులో మామిడికాయ ముక్కలు, ఆవపిండి, మిరపపొడి, ఉప్పు, కప్పు నూనె వేసి కలపాలి. . ఈ మిశ్రమాన్ని రెండు రోజులపాటు ఎండలో పెట్టాలి. బెల్లం కరిగిపాకంలా జిగురుగా వచ్చినట్లనిపిస్తే సరే, లేకపోతే మూడవ రోజు కూడా ఎండలో పెట్టాలి. పాకం వచ్చిన తర్వాత మిగిలిన నూనె కూడా వేసి బాగా కలిపి జాడీలోకి తీసుకోవాలి. ఈ బెల్లం ఆవకాయను పిల్లలు బాగా ఇష్టపడతారు. ఐరన్ రిచ్ ఫుడ్ కాబట్టి మహిళలు రోజూ తీసుకోవచ్చు.



### వెల్లుల్లితో..

**కావలసినవి :** మామిడికాయ ముక్కలు–పావు కేజి లేదా 3, వెల్లుల్లి–200 గ్రాములు, ఉప్పు–100 గ్రాములు, మిరపపొడి– 200 గ్రాములు, ఆవాలు–150 గ్రాములు , పసుపు–టీ స్పూన్, మెంతులు – టేబుల్ స్పూన్, నువ్వుల నూనె లేదా వేరుశనగ నూనె– కిలో,

**తయారీ :** . ఒక పాత్రలో నూనెపోసి మామిడి ముక్కలను వస్త్రంతో తుడిచి నూనెలోవేయాలి. వెల్లుల్లిపాయలను పొట్టు వలిచి ఒక ప్లేట్‌లో వేసి గాలికి ఆరనివ్వాలి. . మరొకపాత్రలో మిరపపొడి,ఆవపిండి,ఉప్పు, పసుపు, మెంతులు వేసి సమంగా కలసేవరకు కలపాలి. ఇప్పుడు వెల్లుల్లి రేకలను వేసి కలపాలి. మామిడి ముక్కలలోని నూనెను ఒక జాడీలోకి పంపాలి. ఇప్పుడు మామిడి ముక్కలలో ముందుగా కలిపి సిద్ధంగా ఉంచిన ఉప్పు, వెల్లుల్లి ఇతర పొడుల మిశ్రమాన్ని వేసి పొడులన్నీ మామిడి ముక్కలకు పట్టేలా కలపాలి. మామిడి ముక్కలను పట్టి ఉన్న నూనె ఈ పొడులను పీల్చుకుని కొంత తడి పొడిగా మారుతుంది. ఈ మిశ్రమాన్ని నూనె వంపుకున్న జాడీలో వేసి అదమాలి. నూనెపైకి తేలుతుంది. వెల్లుల్లి బ్లడ్ థిన్నర్ రక్తాన్ని పలచలబరిచి రక్తనాళాల్లో పూడికలు ఏర్పడకుండా నివారిస్తుంది. కాబట్టి పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు అందరూ హాయిగా తినవచ్చు



### నువ్వులతో..

**కావలసినవి :** మామిడికాయ ముక్కలు – కప్పులు, నువ్వులు–ఒకటిన్నర కప్పులు, , ఆవాలు– 2 స్పూన్‌లు ఉప్పు–పావు కప్పు, పసుపు–అరటీ స్పూన్, వేరు శనగ నూనె– ఒకటిన్నర కప్పులు. **తయారీ :** నువ్వులను తయారీ దోరగా వేయించి చల్లారిన పొడి చేయాలి. మామిడి ముక్కలను వెడల్పు పాత్రలో వేసి అందులో నువ్వుల పొడి, ఆవపొడి, ఉప్పు, పసుపు వేసి అట్లకాడతో బాగా కలపాలి. ఉప్పు, నువ్వుపిండి సమంగా కలిసిన తర్వాత కప్పు నూనెపోసి, ఆవ మళ్లీ కలపాలి. ఈ మిశ్రమాన్ని జాడీలోకి తీసుకుని, మిగిలిన నూనెను పైన తేలేటట్లుపోయాలి. ఇందులో క్యాల్షియం సమృద్ధిగా ఉంటుంది. ఆరోగ్యానికి మేలు చేస్తుంది. . ★



### సెలవుల్లో సరదాగా..



ముందు ఖాళీ బాటిళ్లను తీసుకోవాలి. క్రాఫ్ట్ స్టోర్‌లో దొరికే కలర్ ఇసుకను తీసుకొచ్చి వాటిల్లో వేయాలి. ఆ తర్వాత ఓ కర్రకు చెక్క లేదా గట్టిగా ఉండే ప్లాస్టిక్ రింగునొకదాన్ని కట్టి వేలాడదీయాలి. మరో పెద్ద రింగు మధ్యలో బాటిల్‌ను అడ్డంగా ఉంచండి. ఇప్పుడు ఆ కర్ర సాయంతో ముందుగా ఎవరైతే బాటిల్‌ను నిలువుగా నిలబెడతారో వాళ్లు గెలిచినట్టు! ఈ ఆట పిల్లల్లో ఏకాగ్రత, మెంటల్ బ్యాలెన్స్‌ను పెంచుతుంది. ★

## అరంగ్రేటంలో ఆధ్యాత్మిక హొయలు!



ఫ్యాషన్ కేన్స్ రెడ్ కార్పెట్‌పై బృందావనం. బృందావనం థీమ్‌తో 'లెహంగా' రెడ్ కార్పెట్‌పై ఆర్తి ఖేతర్‌పాల్. ప్రతిష్మాక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ రెడ్ కార్పెట్‌పై ఆధ్యాత్మిక హోయలు చూడ ముచ్చటేసింది. తమ ఫ్యాషన్‌తో ప్రత్యేక ముద్ర వేయాలనుకునే యువతలు సంప్రదాయ దుస్తుల్లో మెరిస్తే. మరికొందరు పాశ్చాత్య డిజైనర్ గౌన్లలో తళుక్కుమనడం విశేషం. కాగా తాజా వేడుకల్లో బృందావనానికి చెందిన కళాకారిణి ఆర్తి ఖేతర్‌పాల్ ఫ్యాషన్ వేదికపై తన సంస్కృతిని ప్రతిబింబించే ప్రత్యేక వస్త్ర ధారణతో మురిపించారు. ఆర్తి తన తొలి ప్రదర్శనలో బృందావనం థీమ్‌తో రూపొందించిన ప్రత్యేక 'లెహంగా'తో తళుకు మనిపించారు. ప్రముఖ డిజైనర్ సులక్షణ మోంగా తీర్చిదిద్దిన ఈ మస్టర్డ్‌యెల్లో రంగు లెహంగా స్కర్ట్‌పై బృందావనానికి సంబంధించిన కళాకృతులను చిత్రీకరించారు.



దీనికి జతగా ఎంబ్రాయిడరీ బ్లౌజ్, దుపట్టా ఆమె అందాన్ని మరింత మెరిసాయి. బోల్డ్ రెడ్ లిప్స్, న్యూట్రల్ మేకప్‌తో ఆర్తి తన అంద చందాలను ఆహుతులకు పరిచయం చేసారు. ఇక భారతీయతను ప్రతిబింబం చేలా మీనాకారీ నెక్లెస్, చెవిపోగులతోపాటు ఓ కృష్ణబ్యాగ్, చిన్న సైజు భగవద్గీత, తులసిమాలలను చేత ధరించి రెడ్ కార్పెట్‌పై నడిచారు. ఆమె లోని కృష్ణభక్తి తత్వాన్ని మేళవింపు చేసి భక్తి భావాన్ని పెంపొందించారు. తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఆర్తి 'దేవుడిని విశ్వసించే ప్రతి మనిషికి ఇది అంకితం'అంటూ కొన మెరుపు మెరింపించారు. 'ఆర్తి' గ్రామీ నామినేషన్ పొందిన 'సౌండ్ ఆఫ్ కుంభ ఆల్బమ్‌లో ఒక ఆర్టిస్ట్‌గా పనిచేస్తున్నారు. ◻

## పరలోకంలో అహంకారులకు చోటు లేదు..

అంతర్వాణి

'నాశనమునకు ముందు గర్వము నడచును, పడిపోవుటకు ముందు అహంకారమైన మనస్సు నడచును' (సామెతలు16:18), 'ఆత్మవిషయమై దీనులైనవారు ధన్యులు పరలోక రాజ్యము వారిది' (మత్తయి 5:3), నేను మహోన్నతమైపరిశుద్ధ స్థలములలో నివసించువాడను అయినను వినయముగలవారి ప్రాణమును ఉజ్జీవింపజేయుట కును నలిగినవారి ప్రాణమును ఉజ్జీవింపజేయుట కును వినయముగల వారియొద్దను దీనమనస్సు గలవారి యొద్దనునివసించుచున్నాను (యెషయా 57:15). దేవాదిదేవుడు అతిపరిశుద్ధుడు, ఉన్నత మైన స్థలంలో ఉండే ఆయదీనులవద్ద నివసిస్తున్నాను అని అంటున్నాడు. అవును దీనులు, విధేయతగల వారి వద్దనే దేవుడి నివాసస్థలంఉంటుంది. అహంకారులు దేవుడిని గ్రహించలేరు. నేడు 'గర్వం', 'అహంకారం' అనేకుల్లో రాజ్యమేలుతున్నది. తమకున్న శాస్త్రసాంకేతిక జ్ఞానంబట్టి, ఐశ్వర్యంబట్టి, పలుకుబడి, డబ్బును బట్టి గర్విస్తున్నారు. గర్వించేవారుఎందులోనూ వృద్ధి చెందలేరు. వారి అభివృద్ధి అనేది గర్వంతో ఆగిపోతుంది. కానీ బాహ్యంగా వృద్ధిచెందినట్లు గాకనిపిస్తారు కానీ, వారు నానాటికి పతనం వైపు పయనిస్తున్నారు అనే వాస్తవాన్ని గ్రహించలేరు. అహంకారం తమకుగొప్ప అలంకారంగా భావిస్తున్నారు. విధేయత, దీనత్వం అంటే అది చేతకానివారు చేసే పనిగా అనుకుంటు న్నారు. గర్వించడం ఎవరికైనా సులభమే కానీ వినయభయభక్తులు కలిగి ఉండడమే చాలా కష్టం. అయితే వినయం లేకుండాదేవుడిని సేవించలేం. అందుకే ప్రభువును విశ్వసించేవారికి తమ విధేయతను చాటుకునేందుకు దేవుడే పలు శ్రమలు,శోధనల గుండా నడిపిస్తాడు. చిన్నవారే మనపై ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నిస్తారు. అసలు మనల్నిఏమాత్రం ఖాతరు చేయరు. అయినా దేనికీ కలతచెందక దేవుడిపై ఆధారపడి, మరింత దీనత్వంతో ప్రభువును సేవిస్తూ, ఎదుటివారిని క్షమిస్తూ ముందుకు సాగిపోదాం. పగ తీర్చుకోవడం మనవంతు కాదు అది దేవుడే చూసుకుంటాడు. ప్రభువు మనల్ని క్షమించినట్లుగా, ప్రేమిస్తున్నట్లుగా మనం కూడా ఇతరులను క్షమిస్తూ.. ప్రేమిద్దాం.

**- పి.వాణిపుష్ప**

# తెర

## 'స్లమ్ డాగ్ 33 టెంపుల్ రోడ్' శరవేగంగా రీరికార్డింగ్

డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, పవర్ హౌస్ పెర్ఫార్మర్ విజయ్ సేతుపతి మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'స్లమ్ డాగ్ 33 టెంపుల్ రోడ్' . ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్ పై పూరి జగన్నాథ్, చార్మీ కౌర్, జెబి మోహన్ పిక్చర్స్ జెబి నారాయణ రావు కొండ్రోల్లాతో కలిసి నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న



ఈ చిత్రంకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్, రీరికార్డింగ్ పనులు శరవేగంగా జరుగుతు న్నాయి. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలలో అద్భుతమైన సంగీతాన్ని అందించిన జాతీయ అవార్డు గ్రహీత హర్షవర్ధన్ రామేశ్వర్, 'స్లమ్ డాగ్' 33 టెంపుల్ రోడ్ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. దర్శకుడు పూరి జగన్నాథ్ మ్యూజిక్ డైరెక్టర్‌తో కలిసి రికార్డింగ్ స్టూడియోలో కూర్చొని బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ పనులను పర్యవేక్షి స్తున్నారు. మేకర్స్ రిలీజ్ చేసిన ఫోటో సినిమాపై మరింత ఆసక్తిని పెంచు తోంది. ఈ సినిమాలో విజయ్ సేతుపతి సరసన సంయుక్త కథానాయికగా నటిస్తుండగా, టబు కీలక పాత్ర పోషిస్తున్నారు. బ్రహ్మాజీ, వీటీవీ గణేష్‌లు హ్యూమరస్ పాత్రల్లో నటిస్తున్నారు.ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ ఐదు భాషలలో గ్రాండ్ పాన్‌ఇండియా రిలీజ్ కానుంది.

## జంగిల్ బుగీ కర్టెన్ రైజర్ ఈవెంట్..



క్రాస్ స్టేట్ రియాల్టీ షో జంగిల్ బుగి కర్టెన్ రైజర్ ఈవెంట్ హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ రియాల్టీ షోలో తెలుగు లయన్స్, హిందీ హాక్స్, తమిళ్ టైగర్స్, మావెరిక్స్, కన్నడ పాంతర్స్...ఇలా ఐదు టీమ్స్ పాల్గొననున్నాయి. ఈ నెల 17,18వ తేదీల్లో హైదరాబాద్‌లో ప్రసాద్ ల్యాబ్స్ వేదికగా జరిగే ఆడిషన్స్ నుంచి వివిధ దశల వడబోత తర్వాత పోటీదారులను ఎంపికచేయనున్నారు. ఈ ఆడిషన్స్‌లో దాదాపు 200 మంది పాల్గొంటారని అంచనా. ఆడిషన్స్ నుంచి ఎంపికైన వారు 90 రోజుల పాటు అడవిలో ఉంటూ కార్యక్రమ నిర్వాహకులు సూచించే సాహసాలు చేయాల్సి ఉంటుంది. ఎలిమినేషన్స్ తట్టుకుని మిగిలిన కంటెస్టెంట్ విజేతగా నిలుస్తారు. శనివారం జరిగిన జంగిల్ బుగి కర్టెన్ రైజర్ ఈవెంట్ లో సీనియర్ ఫిలిం జర్నలిస్ట్ ప్రభు మాట్లాడుతూ జంగిల్ బుగి అనే రియాల్టీ షోను ఒక పాన్ ఇండియా మూవీ స్థాయిలో డిజైన్ చేయడం గొప్ప విషయం. ఐదు టీమ్స్ ఈ రియాల్టీ షోలో పాల్గొనబోతున్నాయి. ఈ నెల 17, 18 తేదీల్లో ఆడిషన్స్ నిర్వహిస్తున్నారు. సీనియర్ ఫిలిం జర్నలిస్ట్ వైజె రాంబాబు మాట్లాడుతూ రియాల్టీ షోస్ కొత్త కొత్త కాన్సెప్ట్స్ తో ఆడియెన్స్ ను ఎంగేజ్ చేస్తుంటాయి. జంగిల్ బుగి కూడా సరికొత్త కాన్సెప్ట్ తో రాబోతోంది. పాన్ ఇండియా స్థాయిలో వస్తున్న ఈ రియాల్టీ షో మంచి ఆదరణ పొందాలి. డైరెక్టర్ యశోధర విక్రమ్ మాట్లాడుతూ నేను దర్శకుడిగా, రైటర్ గా కన్నడ చిత్ర పరిశ్రమలో పలు చిత్రాలు చేశాను. ఈ కాన్సెప్ట్ నా మిత్రుడు వినోద్ ఇచ్చారు. ఆయన గతంలో కొన్ని రియాల్టీ షోస్ చేశారు. ఎపిక్ ప్రొడక్షన్స్ అధినేత పార్థసారథి మాట్లాడుతూ భారత్ అంటే వివిధ సంస్కృతుల సమ్మేళనం. పేరుకే వివిధ రాష్ట్రాల నుంచి పోటీ అని పెట్టాం కానీ మన కల్చర్ ఒకటే అనే చెప్పే ఉద్దేశంతో ఈ షో చేస్తున్నాం. జనరల్ క్రియేటివ్ టీమ్ రషీద్ మాట్లాడుతూ టీవీ కార్యక్రమాలు చాలా వరకు అసహజంగా ఉంటాయి. మా రియాల్టీ షో రియల్ గా ఉంటుంది.

## 'పెద్ది' జర్నీ ఎమోషనల్: ఫైట్ మాస్టర్ నబాకాంత్



**మీ నేపథ్యం గురించి చెప్పండి?**

మాది మణిపూర్. అయితే నా చిన్నప్పుడే హైదరాబాద్ వచ్చేశాం. ఇక్కడే పెరిగాను. నాన్న ఇన్‌స్పిరేషన్‌తో నేను ఇదే ఫీల్డ్‌లో 14 ఏళ్ల వయసు నుంచి ఉన్నాను. స్టంట్స్‌లో 18 ఏళ్ల అనుభవం ఉంది.

**"పెద్ది అవకాశం ఎలా వచ్చింది?**

'పుష్ప 2' జరుగుతున్నప్పుడే బుచ్చిబాబు గారు నాతో మాట్లాడారు. 'పెద్ది'లో ఇంట్రడక్షన్ సీక్వెన్స్ గురించి చెప్పారు. అది యాక్షన్ సీక్వెన్స్ కాదు కానీ యాక్షన్‌లా ఉండాలని అన్నారు. నాకు చాలా సర్ప్రైజ్‌గా అనిపించింది. అలా ఆ సీక్వెన్స్ కోసం గ్లింప్స్‌లో చూపించిన బ్యాటింగ్ స్టైల్ షాట్ కంపోజ్ చేశాను.

**బ్యాటింగ్ షాట్ ఎలా కంపోజ్ చేశారు?**

నేను హాఫీజ్‌పేట్‌లో పెరిగాను. అది ఫుల్ మాస్ ఏరియా. చిన్నప్పుడు క్రికెట్ ఆడేటప్పుడు ఎలాగైనా సిక్స్ కొట్టాలనే తాపత్రయం వుంటుంది.

**ఇందులో మీకు ఛాలెంజ్ గా అనిపించిన యాక్షన్ సీక్వెన్స్ ?**

ఇందులో మా గురువుగారు రామ్‌లక్ష్మణ్ మాస్టర్లు పోలీస్ స్టేషన్‌లో ఒక ఎపిసోడ్ చేశారు. కుస్తీ సీక్వెన్స్ కోసం బాలీవుడ్ హీరో విక్కీ కౌశల్ వారి నాన్నగారు శ్యామ్ కౌశల్‌ను సంప్రదించాం. ఇందులో నేషనల్ స్థాయిలో జరిగే కుస్తీ పోటీలు ఉంటాయి.

**రామ్ చరణ్‌తో వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

రామ్ చరణ్ గారిలో ఉన్న బెస్ట్ క్వాలిటీ ఏమిటంటే.. మనం ఏం చెబుతున్నామో అది చాలా శ్రద్ధగా వింటారు. ఆయన టెక్నీషియన్లను చాలా బాగా నమ్ముతారు. చరణ్ గద పట్టుకున్న సీక్వెన్స్ కుస్తీలోనిది. ట్రైలర్ వచ్చినప్పుడు మీకు అన్ని విషయాలు ఇంకా బాగా అర్థమవుతాయి.

**శివరాజ్‌కుమార్‌కి యాక్షన్ సీన్స్ ఉన్నాయా?**

ఇందులో దివ్యేందు, శివరాజ్‌కుమార్ సార్‌తో కూడా మంచి యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్నాయి. శివరాజ్ గారి ఎనర్జీ లెవెల్స్ సూపర్. ఆయన చాలా స్ట్రాంగ్ విల్‌పవర్‌తో ఉంటారు.రామ్‌లక్ష్మణ్ మాస్టర్ల దగ్గర పనిచేశారు కదా.. వారు మీకు ఎలాంటి కాంప్లిమెంట్ ఇస్తుంటారు? "పుష్ప' సినిమా చూసి ఒక గురువు పేరు నిలబెట్టావురా" అని మెచ్చుకున్నారు. అది నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. యాక్షన్ పరంగా వాళ్లే నాకు ఇన్‌స్పిరేషన్.

**కొత్తగా చేస్తున్న సినిమాలు?**

"ప్యారడైజ్', 'రౌడీ జనార్ధన్', వంశీ – సల్మాన్ ఖాన్ సినిమా, చిరంజీవి – బాబి సినిమాలు చేస్తున్నాను.

## 'తిమ్మరాజుపల్లి టీవీ' మంచి మెమొరబుల్ : ప్రదీప్ కొట్టె



న్యూ టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్‌తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్‌పై నిర్మించిన సినిమా"తిమ్మరాజుపల్లి టీవీ. ఈ మూవీకి తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమాతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమయ్యారు.

**నేపథ్యం...**మాది చిత్తూరు జిల్లా పళమనేరు. చెన్నైలో జాబ్ చేశాను. హైదరాబాద్‌కి షిఫ్ట్ అయ్యాను. ఇక్కడకు వచ్చాక షార్ట్ ఫిల్మ్స్ అంటూ యాక్టింగ్ వైపు వచ్చాను. బీ స్టూడియోలో బషీర్ మాస్టర్ నేతృత్వంలో నాటకాలు వేశాను. ఆ నాటకాల్ని మా డైరెక్టర్ వి.మునిరాజుగారు చూశారు.

**తొలి అవకాశం...**'తిమ్మరాజుపల్లి టీవీ' రాజప్ప పాత్రకు మంచి ప్రశంసలు దక్కాయి. అందులో చాలా వేరియేషన్స్ ఉంటాయి. ఈ పాత్రతో నాకు మంచి రెస్పాన్స్ దక్కింది. నాకు తొలి సినిమా, అవకాశం అంటే ఇదే అని చెప్పుకోవచ్చు. రెండింటిని బ్యాలెన్స్ చేస్తూ..నేను నా జాబ్ చేస్తూనే సినిమా అవకాశాల కోసం ప్రయత్నించాను. వర్క్ ఫ్రమ్ హోం, లీవ్స్ అంటూ ఈ మూవీని కూడా మ్యానేజ్ చేశాను. నేను పూర్తి స్థాయిలో ప్రయత్నించలేకపోవడంతోనే ఇంత ఆలస్యం అయి ఉంటుందని భావిస్తున్నాను.

**కిరణ్ అబ్బవరం అప్పటి నుంచే..**

నాకు చిన్నప్పటి నుంచీ సినిమా లంటే ఇష్టం. కానీ నాకు ఇదొక ప్యాషన్ అని తెలీదు. ఇంజనీరింగ్ టైంలో ఓ షార్ట్ ఫిల్మ్ చేశాను. నాకు నటన మీద ఇంట్రెస్ట్ ఉందని అప్పుడు అర్థమైంది. అయితే మేం షార్ట్ ఫిల్మ్స్ చేసే టైంలోనే కిరణ్ అబ్బవరం గారు నాకు తెలుసు. నేను ఒక ఆర్టిస్ట్ అని ఆయనకు కూడా తెలుసు.

**ఆ భయం లేదు..**

నాకు ఈ పదేళ్ల అనుభవంలో కెమెరా భయం అనేది పోయింది. కెమెరా ముందు ఎలా నటించాలి అన్న విషయం తెలిసింది. డైలాగ్ డెలివరీ, డిక్షన్ అనేది థియేటర్ డ్రామాలో తెలిసింది. ఒకే నాటకంలో గంటన్నర పాటుగా ఐదు పాత్రలను పోషించాను.

**ప్రతీ పాత్ర ఇంపాక్ట్ క్రియేట్ చేసేదే..**

ఈ మూవీలో సాయి తేజ్, లతీష్ ఇలా చాలా మంది నటించిన పాత్రలు నాకు ఇష్టం. **అదొక మెమొరబుల్ మూమెంట్...**

నేను యాక్టింగ్ సైడ్ ఉన్నానని మా ఇంట్లో ఎవ్వరికీ తెలీదు. కాస్తో కూస్తో మా అక్కకి తెలుసంతే. నెక్స్ట్ మూవీస్..

## చివరి దశకు 'వృషకర్మ' షూటింగ్



తండేల్ బ్లాక్ బస్టర్ విజయంతో అద్భుతంగా సాగుతున్న యువ సామ్రాట్ నాగ చైతన్య, తన తొలి బ్లాక్‌బస్టర్ 'విరూపాక్ష'తో ఆకట్టుకున్న ఫిల్మ్ మేకర్ కార్తీక్ దండుతో కలిసి ప్రతిష్టాత్మక మిథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ' చేస్తున్నారు. మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా, స్పర్శ్ శ్రీవాస్తవ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఎస్‌వీసీసీ, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని బాపినీడు సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ అద్భుతమైన రెస్పాన్స్ తో 20 మిలియన్ వ్యూస్ దాటి దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొల్పింది. ప్రస్తుతం 'వృషకర్మ' షూటింగ్ చివరి దశకు చేరుకుంది. తాజాగా రాజస్థాన్‌లో జరిగిన భారీ షెడ్యూల్‌కు సంబంధించిన బీహైండ్ ది సీన్స్ స్టిల్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. రాజభవనాలు, పురాతన శిల్పకళతో అలరారుతున్న లొకేషన్స్‌లో చిత్రీకరించిన కీలక సన్నివేశాలు సినిమాకి ఉన్న భారీ విజువల్ స్కేల్‌ను చూపిస్తున్నాయి.'వృషకర్మ' చిత్రానికి టాప్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. సినిమాటోగ్రాఫర్ రాగుల్ డి హెరియన్ అద్భుతమైన విజువల్ స్టైల్‌ను అందిస్తుండగా, అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం సమకూరుస్తున్నారు. పవర్‌ఫుల్ కాంబినేషన్, భారీ సాంకేతిక ప్రమాణాలు, మైథలాజికల్ టచ్‌తో రూపొందు తున్న 'వృషకర్మ' స్కేల్, మిస్టరీ, సినిమాటిక్ గ్రాండియర్ కలయికగా నిలవబోతోంది. మరిన్ని ఎక్సయిటింగ్ అప్‌డేట్‌లు త్వరలో మేకర్స్ నుంచి రాబోతున్నాయి.

## 'మహాకాళి' చిత్రీకరణ పూర్తి



'హనుమాన్' వరల్డ్ నుంచి వస్తున్న తదుపరి అధ్యాయం 'మహాకాళి'లోకి రోహిత్ సరాఫ్ ఎంట్రీ ఇచ్చారు. దర్శకుడు ప్రశాంత్ వర్మ, ఆర్కేడీ స్టూడియోస్ కలిసి రూపొందిస్తున్న ఈ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌పై రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. తాజాగా రోహిత్ సరాఫ్ హైదరాబాద్‌లో జరిగిన ఇంటెన్స్ షూటింగ్ షెడ్యూల్‌ను పూర్తి చేశారు. రోహిత్ సరాఫ్ చేరికతో ఈ చిత్రానికి మరింత అప్పీల్ వచ్చింది. ముఖ్యంగా నార్త్ ఇండియాలో యువతలో అతనికి ఉన్న ఫాలోయింగ్ 'మహాకాళి' పాన్ ఇండియా రీచ్‌ను మరింత బలోపేతం చేయనుంది.ఈ చిత్రంలో అక్షయ్ ఖన్నా, భూమి శెట్టి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించాయి. పవర్‌ఫుల్, ఇంటెన్స్ లుక్స్‌తో సినిమాపై క్యూరియాసిటీ పెరిగింది.హనుమాన్ విజయానంతరం భారతీయ మూలాలతో కూడిన సినిమా యూనివర్స్ ని విస్తరించాలనే ప్రశాంత్ వర్మ విజన్‌లో భాగంగా 'మహాకాళి' రూపొందుతోంది. ఆర్కే దుగ్గల్, రివాజ్ రమేష్ దుగ్గల్‌లు ఆర్కేడీ స్టూడియోస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. పూజా కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు 'మహాకాళి' అత్యంత ఆసక్తికరమైన పాన్ ఇండియా ప్రాజెక్టులలో ఒకటిగా నిలుస్తోంది.

17vzm15:17vzm15.qxd 16-05-2026 22:59 Page 1



## శ్రీ సత్యసాయి విద్యార్థుల ప్రతిభకు పారితోషకం



బొబ్బిలి మే 16 ప్రభాతవార్త : పట్టణ పరిధిలో శ్రీ సత్య సాయి విద్య సంస్థ లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు సంస్థ యాజమాన్యం ఒక్కొక్కరికి 25 వేల రూపాయలు బహుమతిగా ఇచ్చి ఘనంగా సత్కరించారు. వలస పూజిత ఇంటర్మీడియట్ ఫలితాలలో బొబ్బిలి చరిత్రలో990 మార్కులు సాధించిన విద్యార్థిని అన్నారు. ఇంకో విద్యార్థిని ఆలిండియా జేఈఈ మెయిన్స్‌లో 35వ ర్యాంక్ నగర తనుజ సాధించిందని ఈ విద్యార్థిని కూడా మా కళాశాల కు మంచి పేరు తెచ్చారని పేద విద్యార్థులైన పెద్ద పేరు తెచ్చారని కరస్పాండెంట్ చింత అప్పారావు మాస్టర్అన్నారు. మా కళాశాల తరపున ఈ విద్యార్థులకు మా వంతు కొంత ఫీజు రాయితీ కూడా అందజేశామని అన్నారు ఈ సందర్భంగా తల్లిదండ్రులు దూరము ఉన్న కార్పొరేట్ సంస్థలలో చదివించడంతో వచ్చిన ప్రతిభ ఏమీ లేదని. అతి తక్కువ ఫీజులతో మీ పరిసర ప్రాంతాల్లో ఉన్న కళాశాలలో చేర్పించండి అని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ వంశీకృష్ణ, టీచర్లు పాల్గొన్నారు.

## హాస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా 60 కోట్లు టార్గెట్



బొబ్బిలి మే 16 ప్రభాతవార్త: పార్వతీపురం డివిజన్లో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ 60 కోట్లు టార్గెట్ చేస్తే 61 కోట్లు సాధించమని పోస్టల్ సూపరింటెండెంట్ రెడ్డి బాబురావు వెల్లడించారు. స్థానిక బృందావన్ హాల్లో డివిజన్ పరిధిలో అన్ని రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు అందజేశారు. మాట్లాడుతూ తక్కువ ప్రీమియం ఎక్కువ బోనస్ వచ్చేది పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ అని అన్నారు గత సంవత్సరం ఒక లక్ష ఇరవై ఐదు వేలు కొత్త పొదుపు ఖాతాలు చేశామని అన్నారు. లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా సుకన్య పథకంలో ఆడపిల్లలకు అందజేస్తున్నమన్నారు ఆధార్ సెంటర్లు బలిజిపేట రామభద్రపురం సీతానగరంలో పెడతామన్నారు. కొత్త పోస్ట్ ఆఫీస్ ఇందిరమ్మ కాలనీలో పెట్టడానికి సంసిద్ధమవుతున్నమన్నారు కొత్త పోస్ట్ ఆఫీస్ వారికి తోటలో పెడతామన్నారు. అన్ని పోస్ట్ ఆఫీస్ లో ఆన్లైన్ ద్వారా జరుగుతుందన్నారు. ఆధార్ ప్రామాణికంగా సొమ్ము చెల్లింపు జరుగుతుందన్నారు . పోస్టల్ అకౌంట్లు ఓపిక ఓపెనింగ్ చేసుకున్న వారికి విద్యార్థులకు. ఉపాదామి సొమ్ములు కూడా చెల్లించడం జరుగుతుందన్నారు. 47 మందికి అవార్డులు అందజేస్తున్నమని పనిలో 10 సంవత్సరాలుగా రామ సూర్య ప్రతాప్ నాయుడు (చంటి) చక్కని ప్రతిభ కనపరిచి తోటి వారికి ఆదర్శంగా నిలుస్తున్నాడు అన్నారు. హాస్టల్ ఇన్స్పెక్టర్ కిల్లాడ శ్రీనివాసరావు ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జిల్లా స్థాయి సంఘాల సమావేశం



విజయనగరం. మే 16 ప్రభాతవార్త : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జిల్లా స్థాయి సంఘాల సమావేశం అని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఒకటి నుంచి ఏడు స్థాయి సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రణాళిక మరియు ఆర్థిక సంఘం 2 వ్యవసాయ సంఘం విద్య మరియు వైద్య సంఘం సంక్షేమ సంఘం మహిళా శిశు సంక్షేమ సంఘం కమ్యూనికేషన్ మరియు పనులు తాగునీరు మరియు పారిశుధ్య సంఘాలకు సంబంధించిన అంశాలపై విస్తృతస్థాయి చర్చ జరిగింది. చిన్న శ్రీను మాట్లాడుతూ గ్రామ పంచాయితీల్లో పూర్తి అయిన అభివృద్ధి పనులకు సంబంధించిన ఎస్టిమేట్లు బిల్లులు ఎలక్ట్రికల్ లైట్స్ తదిత అంశాలను సక్రంగా నమోదు చేసి సంబంధిత బిల్లులను ఆన్లైన్లో అప్లోడ్ చేసే ప్రక్రియ పారదర్శకంగా వేగువంతంగా పూర్తి చేయాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాదేశిక సభ్యులు శాంతి కుమారి గాది శ్రీనివాస నాయుడు జడ్పీ సీఈవో నాగలక్ష్మి ఎంపీపీలు జడ్పిటిసిలు అధికారులు పాల్గొన్నారు.

## ఆలుగోలు మహిళకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



భోగాపురం, మే 16,(ప్రభాతవార్త) నెల్లిమర్ల మండలం ఆలుగోలు గ్రామానికి చెందిన కాకి అప్పలనరసమ్మ అనే మహిళకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్ నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ కర్రోతు బంగార్రాజు శనివారం అందజేశారు. భోగాపురం మండలం పోలిపల్లి గ్రామంలోని ఆయన స్వగృహం వద్ద లబ్ధిదారురాలికి రూ.47, 901ల విలువైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు ఆరోగ్య అత్యవసర సమయాల్లో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఆసరాగా నిలుస్తుందని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న అర్హులైన ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి సహాయ నిధి అందేలా తన వంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దివాకర్, ఆల్తి బాబురావు మరియు లబ్ధిరారురాలి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతపై అవగాహన



కొత్తవలస మే 16 ప్రభాత వార్త. మహిళలు అసాంఘిక వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని కొత్తవలస సర్కిల్ ఇన్స్పెక్టర్ టీవీ విజయ్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక వెలుగు ఆఫీసులో " మహిళల భద్రత పోలీసు వారి బాధ్యత" అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీ ఐ విజయకుమార్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరాలు 1930 పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఇంట్లో దొంగతనాలు, ఆన్లైన్ మోసాలు, ఎదిగిన పిల్లలతో ఎక్కువసేపు మాట్లాడటం, ఊర్లో వెళ్ళినప్పుడు పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇవ్వడం, తెలియని లింకులు ఓపెన్ చేయడం, అని పలు విషయాలపై అవగాహన చేశారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నాగమాధవి రూ.70 వేలు ఆర్థిక సాయం



భోగాపురం, మే 16,(ప్రభాతవార్త): భోగాపురం మండలం గుడివాడ గ్రామంలోని శివాలయం, శ్రీ దుర్గాలమ్మ తల్లి ఆలయాల అభివృద్ధికి నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆర్థిక సహాయం చేసి తన ఉదారతను చాటుకున్నారు. రెండు ఆలయాల ప్రాంగణాల్లో టైల్స్ నిర్మాణ పనుల నిమిత్తం ఆమె తన సొంత నిధుల నుండి రూ.70,000లు ఆర్థిక సహాయాన్ని శనివారం ముంజేరు గ్రామంలోని పార్టీ కార్యాలయంలో ఆలయాల కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లోకం నాగమాధవి మాట్లాడుతూ, గ్రామాల్లోని దేవాలయాలను అభివృద్ధి చేయడం ద్వారా భక్తులకు ఆహ్లాదకరమైన, సౌకర్యవంతమైన వాతావరణం లభిస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రజల ఆధ్యాత్మిక అవసరాలకు గౌరవం ఇస్తూ, గ్రామాల సమగ్ర అభివృద్ధికి మరియు మన సనాతన సాంప్రదాయాల పరిరక్షణకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని ప్రజలకు భరోసా ఇచ్చారు. అనంతరం ఆలయాల ఆధునీకరణకు తన సొంత నిధులను అందించిన ఎమ్మెల్యే లోకం నాగమాధవికి గుడివాడ గ్రామ పెద్దలు, ఆలయాల కమిటీ సభ్యులు మరియు భక్తులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర ప్రోగ్రాంలో మంత్రి సంధ్యారాణి



సాలూరు, మే16 ప్రభాతవార్త : సాలూరు పట్టణంలో పెట్రోల్ డీజిల్ పొదుపు చేయాలని ప్రధాని నరేంద్ర మోడీ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రమంత్రి సంధ్యారాణి తూచా తప్పకుండా పొదుపు అందులో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్రప్రోగ్రాం శనివారం నిర్వహించారు. ఈ మేరకు మున్సిపల్ ఆఫీస్ నుండి ఎమ్మార్వో కార్యలయం వరకు టీడీపీ శ్రేణులతో మంత్రి సంధ్యారాణి ఆద్వర్యంలో బ్యాక్ ర్యాలీ నిర్వహించారు.అలాగే రోడ్డు ప్రక్కన ఉన్న చిరు వ్యాపారులతో మాట్లాడి ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని,గుడ్డ సంచులు వాడాలని పలు సూచనలు ఇచ్చారు.అంతేకాకుండా ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మంత్రి సంధ్యారాణి పిలుపునిచ్చారు.టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ నిమ్మాది.చిట్టి,హర్షా, చిన్ని,పరమేష్ పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర .. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం



డెంకాడ, మే 16, ప్రభాతవార్త : మండలం లోని మోధవలస గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు బంటుపల్లి వెంకట సత్య వాసుదేవరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వై దేవానంద్, తాసిల్దార్ కే రాజారావు ,డిప్యూటీ ఎంపీడీవో కే రాజకుమార్, గ్రామపెద్దలు కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## పరిశుభ్రతతోనే స్వర్ణాంధ్ర సాధ్యం: ఎమ్మెల్యే కోళ్ల



లక్కవరపు కోట, మే 16 ప్రభాత వార్త : పరిశుభ్రమైన సమాజంతోనే ఆరోగ్యకరమైన రాష్ట్ర నిర్మాణం సాధ్యమవుతుందని శృంగవరపుకోట శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన ఎల్.కోట ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ఉమ్మడి పారిశుధ్య కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి స్వయంగా చేత పట్టుకుని శ్రమదానం చేశారు. కార్యాలయ పరిసరాలను శుభ్రం చేసి, ప్రజల్లో పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పూజ్య బాపూజీ కలలు గన్న స్వచ్ఛ భారత్ ఆశయాలను నిజం చేస్తూ, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. కేవలం ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రమే కాకుండా, ప్రతి ఒక్క పౌరుడు ఈ స్వచ్ఛతా ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు, హరిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఎ ఏం సి చైర్మన్ చొక్కాకుల మల్లు నాయుడు, స్థానిక మండల పరిషత్ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కూటమి ప్రభుత్వ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాంబాబు





నెల్లిమర్ల, మే 16, ప్రభాతవార్త: ఆంధ్ర ప్రదేశ్ విశ్వబ్రాహ్మణ, విశ్వ కర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షుడిగా కోసూరు రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఆ సంఘం రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు నూతన కార్యవర్గం ఎన్నిక సంఘం నాయకులు ఎస్. లక్ష్మణరావు, వి జి ఎస్ ఉమాపతి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. సంఘం విజయనగరం జిల్లా శాఖ గౌరవాధ్యక్షులుగా అప్పలబత్తుల నరసింహరాజు( రిటైర్డ్ టీచర్), కాకినాడ ఉమామహేశ్వర రావు( లెక్చరర్ ),అధ్యక్షులు గా కోసూరు రాంబాబు(ఏపీఎస్ఆర్టీసీ), ప్రధాన కార్యదర్శిగా వెదురుపర్తి గీతా సత్య ఉమాపతి ( మెడికల్)కోశాధికారిగా కెల్ల సోమ శేఖర్ ( టీచర్) ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్ గా పట్నాల సుబ్రమణ్యం ( బ్యాంక్ ),వర్కింగ్ ప్రెసిడెంట్గా మంతిన అప్పలరాజు ( టీచర్), సహాయ కార్యదర్శిగా సబ్బవరపు తాతాచారి ( జ్యుడీషియల్ ),ఆర్గనైజింగ్ సెక్రటరీగా కుప్పిలి శ్రీనివాసరావు (మెడికల్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ కార్యవర్గ ఎన్నికను సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గొర్రెపాటి ప్రభాకర్ విశ్వకర్మ, తాళాబత్తుల శ్రీనివాసరావు ఆమోదించారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా కమిటీ నూతన అధ్యక్షుడు కోసూరు రాంబాబు మాట్లాడుతూ జిల్లాలోని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళతానని, సభ్యులంతా ఐక్యంగా చురుకుగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

## గిరిజన చట్టాలను కాలరాస్తున్న అటవీ శాఖ అధికారులు



పాచిపెంట, మే 15 ప్రభాతవార్త : గిరిజనుల హక్కులను చట్టాలను అటవీ శాఖ అధికారులు కాలరాస్తున్నారనీ జిల్లా సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు అన్నారు. మండల కేంద్రమైన పాచిపెంటలో ఆయన మాట్లాడుతూ గిరిజనులపై ఫారెస్ట్ అధికారులు వేధింపులుకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు . మండల గిరిజన నాయకులు మాట్లాడుతూ మామిడి పంచాయితీ పెదకంచూరు పరిధిలో ఇప్పలవలస రాయివలస తాళ్లపాడు బుర్రమామిడి అల్లంపాడు కందివలస దొర్లదండి తదితర గ్రామాలలో అటవీ భూముల్లో ఫారెస్ట్ అధికారులు మొక్కలు నాటడం గిరిజనులను బెదిరించడం పట్టాలు ఇచ్చిన భూముల్లో కూడా మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు ఫారెస్ట్ అధికారులు మరియు సిబ్బందితో చేయడం పట్టాలి ఇచ్చిన భూముల్లో సాగు చేస్తున్నటువంటి భూముల్లో ఏ విధంగా మీరు మొక్కలు నాటుతారు అంటే గిరిజనుల మీద కేసులు పెడతామని చెప్పి బెదిరించడం సరైనది కాదన్నారు.

## గ్రీష్మ తాపానికి ప్రజలు విలవిల

గరివిడి, మే16 ప్రభాత వార్త: గ్రీష్మ తాపానికి ప్రజలు విలవిల లాడుతున్నారు. గత కొద్దిరోజులుగా ప్రచండ భానుడు నిప్పులు చెరుగుతుండటంతో ప్రజానీకం ఎండ వేడిమికి తట్టుకోలేక తల్లడిల్లుతున్నారు. వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు బయటకు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. సూర్య రశ్మి తీవ్రతతో సొమ్మ సిల్లే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. మండుతున్న ఎండలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. సూర్య భగవానుడు శాంతించితే గాని ఉష్ణం చల్లారే పరిస్థితి కానరావడం లేదు.

## డెంగ్యూ పై అవగాహన ర్యాలీ



కురుపాం మే16 ప్రభాతవార్త : డెంగ్యూ వ్యాధి వ్యాపించకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలంటూ కురుపాంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. శనివారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా కురుపాంలో ప్రజలను డెంగ్యూ పై అవగాహన పరుస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న రావాడ రామభద్రపురం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం. వైద్యాధికారి డాక్టర్ సుష్మిత, పంచాయతీ ఈవో వెంకటనాయుడు, వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గరుగుబిల్లిలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర



మెరకముడిదాం, మే 16 : గరుగుబిల్లిలో పంచాయతీ ప్రత్యేకాధికారిణి బి.నాగలక్ష్మి, సచివాల య ప్రత్యేకాధికారిణి కృష్ణవేణి ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పంచాయతీ విస్తరణాధికారి చందక శ్రీరాములు నాయుడు హాజరయ్యారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, సుస్థిరమైన పద్ధతులను పాటిస్తూ.. కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణ హితమైన వ్యాపారాలును ప్రోత్సహించాలని స్వయం సహాయక సంఘాల సభ్యులకు తెలిపారు.ప్రజలు ఇంటి వద్దనే పొడి చెత్త వేరు చేసి నిల్వచేసి వేరుగా సంచుల్లో స్వచ్ఛ రథం నిర్వహికులకు అందజేయాలని కోరారు. ఈవిధంగా సేకరించని పొడి చెత్తను స్వచ్ఛ రథం గ్రామ పంచాయతీలో పర్యటించే రోజున గ్రీన్ అంబాసిడర్లు సేకరించిన సంబంధిత చెత్తనుండి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. అనంతరం గ్రామస్తులతో ర్యాలీ, ప్రతిజ్ఞ, మానవహారం చేపట్టారు. ఎం పి టీ సి చందక చిరంజీవి నాయుడు పంచాయతీ కార్యదర్శి గౌరినాయుడు, సచివాలయం సిబ్బంది ఆరోగ్య, ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛరథం వల్ల ప్రజలకు మేలు : డీడీవో

దత్తిరాజేరు మే 16 ప్రభాత వార్త : మండలంలోని చుక్కపేట గ్రామపంచాయతీలో స్వచ్ఛ రథం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని బొబ్బిలి డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కిరణ్ కుమార్ ఎంపీడీవో కిషోర్ కుమార్ తో కలిసి శనివారం పరిశీలించారు ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించి ప్లాస్టిక్ బాటిల్స్ పాత పేపర్లు గాజు బాటిల్స్ వంటి వస్తువులకు ఖరీదు కట్టి వాటికి బదులుగా నిత్యవసర వస్తువులు ప్రజలకు అందజేశారు ఇంట్లో ఉన్న చెత్తకు కూడా ఖరీదు కట్టి మీకు అవసరమైన వస్తువులను ప్రభుత్వం అందిస్తుంది అన్నారు గ్రామాలను పరిశుభ్రంగా ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు ప్రభుత్వం స్వచ్ఛ రథం కార్యక్రమాన్ని తీసుకువచ్చారన్నారు దీనిని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పొడి చెత్త ఎంత సేకరించారని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్ డిప్యూటీ ఎంపీడీవో తాత పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## కార్డన్ అండ్ సెర్చ్ .. 14 మోటార్ సైకిళ్లు, 2 ఆటోలు సిజ్

రామభద్రపురం, మే 16 ప్రభాతవార్త : ఆపరేషన్ వజ్రప్రహార్"లో భాగంగా జిల్లాలో 'కార్డన్ అండ్ సెర్చ్ విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్ డిజిపి, హరీష్ కుమార్ గుప్తా, ఐపిఎస్ ఆదేశాల మేరకు, ఈగల్ చీఫ్ ఎకే రవి కృష్ణ, ఐపిఎస్, ఐజిపి పర్యవేక్షణలో, జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్ వారి ఉత్తర్వుల మేరకు రామభద్రపురం మండలంలో కొండ కెంగువ గ్రామంలో న మెగా 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్స్ చేపట్టారు.కార్డన్ అండ్ సెర్చ్ మే 16 న తెల్లవారుజామున కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ కొండ కెంగువ" ను , రామభద్రపురం మండలంలో చేపట్టారు. ఏకకాలంలో బొబ్బిలి సబ్ డివిజన్ పరిధిలో రామభద్రపురం పోలీసు స్టేషన్ పరిధిలోని కొండ కెంగువ గ్రామం లో బొబ్బిలి టౌన్ సిబ్బంది మరియు బొబ్బిలి రూరల్ సీఐ శ్రీనివాస్, సర్కిల్ సి ఐ, పోలీస్ సిబ్బంది మరియు ఈగల్ టీం అధికారులు కొండకెంగువ గ్రామంలో సుమారు 25 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో ఆకస్మిక తనిఖీలు చేపట్టారుసుమారు 560ఇండ్లలో తనిఖీలు నిర్వహించారు.రికార్డులు సక్రమంగాలేని 14 మోటారు సైకిళ్ళను మరియు 2 ఆటోలను ను సీజ్ చేసి, సంబంధిత పోలీసు స్టేషనుకు తరలించడం జరిగింది.కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ లో భాగంగా ప్రజల రక్షణ, భద్రత, నేరాలు నియంత్రణ, గంజాయి నిర్మూలన, అనుమానిత వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలు అరికట్టడమే లక్ష్యంగా 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్స్ నిర్వహించామని తెలిపారు. ఆపరేషన్‌లో బొబ్బిలి రూరల్ సీఐ ఎస్ శ్రీనివాస్, రామభద్రపురం ఎస్ ఐ జ్ఞాన ప్రసాద్ రావు , బొబ్బిలి టౌన్ ఎస్ ఐ నవీన్ పడాల్ లు మరియు బొబ్బిలి టౌన్, బొబ్బిలి రూరల్ సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

## జిందాల్‌కు భూములు ఇచ్చిన వారంతా నా అనుచరులే..



శృంగవరపుకోట,మే16,ప్రభాతవార్త : జిందాల్ కు భూములు ఇచ్చిన వారంతా నాఅనుచరులేనని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు.మండలంలోని బొడ్డవరలో నివాసంలో ఆయన మాట్లాడుతూ జిందాల్ రైతుల కోసం న్యాయ పోరాటం,ఉద్యమం చేస్తున్నామని ఎన్ని కుట్రలు పన్నినా ఈఉద్యమం ఆగదన్నారు.రైతులకు న్యాయం జరిగే వరకు నా పోరాటం కొనసాగుతుందని ఎమ్మెల్సీ రఘురాజు స్పష్టం చేశారు.గత 11 నెలలుగా జిందాల్ నిర్వాసితులు చేసిన వేలాది ఫిర్యాదులపై స్పందించని యంత్రాంగం నేడు ఎందుకింత ఉత్సాహం చూపిస్తారని ఇది తప్పుడు ఫిర్యాదులతో ఉద్యమాన్ని నీరుగార్చే కుట్ర జరుగుతుందని ఆయన ఆరోపించారు.భూమి అమ్మింది ఒకరికి ఫిర్యాదు మరొకరిపై ఈతప్పుడు ఫిర్యాదు వెనుక ఉన్నది ఎవరు ఉన్నారని ప్రశ్నించారు.ఉద్యమాన్ని నీరు గార్చే కుట్రలు చేస్తున్న ప్యాకేజీ స్టార్లు వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. ఉద్యమంలో అనేక పార్టీలు,సంఘాలు ముందుంటాయని కానీ జిందాల్ రైతుల ఉద్యమంలో ఎందుకు చాలా పార్టీలు కనిపించడం లేదన్నారు.కొందరు మాత్రమే రైతుల తరపున నిలబడ్డారని, సిపిఎం చల్లా జగన్,జనసేన ఆదాడ మోహన్,రమేష్ అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులకు మద్దతుగా వచ్చారని పేర్కొన్నారు.హోంమంత్రితో ఉదయం మాట్లాడినట్లు వెల్లడించిన ఆయన ఒకవైపు రైతులతో మాట్లాడతామని చెబుతూ మరోవైపు వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఈవిషయంపై అధికారులతో మాట్లాడతానని హోంమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.జిందాల్ రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపబోనని ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా ఎలాంటి ఒత్తిడులు తీసుకొచ్చినా నేను రైతుల కోసం పోరాడుతూనే ఉంటానని రైతులకి సహకరించిన వారిపై బైండ్‌ఓవర్ కేసులు పెట్టారని వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

## చీపురుపల్లిని 100 శాతం ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా మారుస్తాం

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు

చీపురుపల్లి , మే 16 ప్రభాతవార్త : చీపురుపల్లిని సతశాతం ప్లాస్టిక్ నియోజకవర్గంగా మారుస్తామని చీపురుపల్లి శాసనసభ్యులకు మేకల వెంకట్రావు పిలుపునిచ్చారు. శనివారం నాడు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా చీపురుపల్లి ప్రధాన కేంద్రంలో ఘనంగా నిర్వహించిన ప్లాస్టిక్ నిర్మూలన అవగాహన ర్యాలీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వాడకాన్ని విస్మరించాలి, అధికారుల జరిమానాలకు భయపడి కాదు అని కోరారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా చీపురుపల్లి నియోజకవర్గాన్ని వందశాతం ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడమే మన అందరి లక్ష్యం కావాలని మాజీ మంత్రివర్యులు, చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళావెంకటరావు అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో భాగంగా, ఈ వారం "ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్" అనే ప్రత్యేక థీమ్‌తో చీపురుపల్లి హెడ్ క్వార్టర్స్‌లో భారీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.అధికారులు ఫైన్లు వేస్తారనే భయంతో కాకుండా, ప్లాస్టిక్ వల్ల భవిష్యత్తు తరాలకు జరిగే తీవ్ర నష్టాన్ని గుర్తించి ప్రజలు స్వచ్ఛందంగా మారాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. నిత్యజీవితంలో ఎక్కడా కూడా ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను వాడరాదని, వాటి స్థానంలో పర్యావరణానికి మేలు చేసే పేపర్ మరియ చీపురుపల్లిని వందశాతం ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా మార్చే ఈ పవిత్ర ఆశయంలో ప్రతి ఒక్క పౌరుడు, వ్యాపారస్తులు భాగస్వాములు కావాలని శ్రీ కిమిడి కళావెంకటరావు గారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు దన్నాన రామచంద్రుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగన రామారావు, డిడిఓకే హేంసుందర్రావు, ఎంపీడీవో ఐ సురేష్, తాసిల్దార్ డి ధర్మరాజు స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉన్నతాధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు మరియు ప్రజలు పాల్గొన్నారు...

## మే 20న మెడికల్ షాపులు బంద్



చీపురుపల్లి , మే 16 ప్రభాతవార్త : ఈనెల 20న అఖిలభారత కెమిస్ట్రీల సంఘం సమాఖ్య ఆల్ ఇండియా పిలుపుమేరకు చీపురుపల్లి లో మెడికల్ షాపులను బంద్ జరుపుతున్నట్లు విజయనగరం జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు సుంకరి శ్రీనివాసరావు శనివారం విలేకరులకు తెలిపారు. ప్రిస్క్రిప్షన్ వెరిఫికేషన్ చూడకుండా ఆన్లైన్లో మందులు అమ్మడాన్ని, భారీ డిస్కౌంట్ లిస్టు మెడికల్ షాపులకు తీవ్ర నష్టం కలిగిస్తున్న నేపథ్యంలో బంద్ కి పిలుపునిచ్చినట్లు ఆయన వివరించారు. అవసరమైన వారు ముందుగానే తమ మందులను కొనుగోలు చేసుకుని జాగ్రత్త పడాలని ఈ సందర్భంగా శ్రీనివాసరావు కోరారు.

## ప్లాస్టిక్ నిర్మూలిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం..



చీపురుపల్లి , మే 16 ప్రభాత వార్త : ప్లాస్టిక్ వాడకాలను తగ్గించి పూర్తిస్థాయిలో నిర్మూలించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం జరుగుతుందని చీపురుపల్లి డి డి ఓ కే హేమ్సుందర్ అన్నారు. శనివారం నాడు చీపురుపల్లి మండలంలోని అలజంగి గ్రామంలో జరిగిన స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన కోరారు. అదేవిధంగా గ్రామాల వారీగా వ్యక్తిగత పారిశుధ్యం తో పాటు గ్రామ పారిశుధ్యం పైన ప్రతి ఒక్కరు శ్రద్ధ వహించాలని సూచించారు. పల్లెలే దేశానికి ప్రగతిగా నిలవాలని ఆయన అన్నారు. గ్రామాలలో మురికి నిల్వలు లేకుండా గ్రామస్థాయిలో సచివాలయ అధికారులతో పాటు గ్రామ పెద్దలు కూడా సహకరించి స్వచ్ఛ గ్రామాలను తయారు చేయాలని అన్నారు. తడి చెత్త పొడి చెత్త నిల్వలను ఎప్పటికప్పుడు గ్రామ పరిసరాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలకు తరలించాలని కోరారు. స్వచ్ఛంధ్రా స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ పారిశుధ్య పనుల పట్ల దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో అలజంగి ఎంపీటీసీ సనపతి శ్రీనివాసరావు. డిప్యూటీ ఎంపీడీవో అప్పలనాయుడు, గ్రామ పెద్దలు , తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కిమిడి దృష్టికి ఎస్‌విఎన్ కాలనీ లోవోల్టేజీ సమస్య



గరివిడి, మే16, ప్రభాత వార్త: గరివిడి పట్టణ పరిధి, కొండ పాలెం మేజర్ పంచాయతీ లోగల సిద్ధి వినాయక కాలనీలో గత కొన్నేళ్లుగా నెలకొన్న లోవోల్టేజి సమస్య పరిష్కరించాలని కాలనీ వాసులు చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట రావుకి విన్నవించారు. తక్షణమే కొత్తగా ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని వారు కోరారు.ఈ మేరకు గరివిడి పట్టణ ,మండల దేశం నాయకులు చీపురుపల్లి లో ఎమ్మెల్యే నిర్వహించిన ప్రజా దర్బార్ లో గరివిడి మండల టిడిపి అధ్యక్షుడు సారేపాక సురేష్ ఆధ్వర్యంలో కొండ పాలెం టిడిపి నాయకులు,కాలనీ ప్రజలు వినతిపత్రం సమర్పించారు.270 ఇళ్ళు ఉన్న కాలనీ లో ఒకే ట్రాన్స్ ఫార్మర్ ఉండటం వలన నిత్యం లో వోల్టేజ్ సమస్య ఉత్పన్నమవుతుందని వారు ఎమ్మెల్యే కి వివరించారు. నిత్యం ప్రజలు చీకటి తో సహవాసం చేసే దయనీయ పరిస్థితి ఏర్పడిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.ఎస్ వి ఎన్ కాలనీ లో నూతనంగా ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని వారు కోరారు.

# 4 బెర్తులు 5 జట్లు

# ఒక్క ఓటమి సీజన్ ఔట్

## టాప్ గేర్‌లో ఐపిఎల్ ప్లే ఆఫ్ రేస్



(వార్త క్రీడా విభాగం)

*ఐపీఎల్2026 లీగ్ స్టేజ్ చివరి దశకు చేరుకుంటోంది.లీగ్ దశలో ఇంకా 10 మ్యాచులే మిగిలాయి. అయినా ప్లే ఆఫ్‌లో ఆడే ఆ నాలుగు జట్ల విషయంలో ఇప్పటికీ క్లారిటీ లేదు. ఇప్పటికే ఈ సీజన్ ప్లేఆఫ్‌కు దూరమైన జట్లు పోతూ పోతూ ఖచ్చితంగా బెర్త్ ఖాయం అనుకున్న జట్లకు షాక్‌లు ఇస్తుండడంతో సమీకరణాలు మారిపోతున్నాయి.*

దీంతో ప్లే ఆఫ్ రేసు రసవత్తరంగా మారింది. ఇప్పటికే లక్నో సూపర్ జెయింట్స్, ముంబై ఇండియన్స్ టేబుల్‌లో బాటమ్‌లో ఉన్నాయి. ఇక ఏదైనా అద్భుతం జరిగితే తప్ప చెన్నై, ఢిల్లీ, కోల్‌కతాకు కష్టమే. దీంతో నాలుగు బెర్తుల కోసం అయిదు జట్ల మధ్యే పోరు నెలకొంది. ఆ నాలుగు బెర్తులపై ఉత్కంఠ కొనసాగుతోంది.

### ఒక్క విజయం చాలు

ప్రస్తుతం టాప్ టూలో ఉన్న డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్ ఖాతాలో 16పాయింట్లు ఉన్నాయి. ఇంకా రెండేసి మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈ రెండింటిలో ఒక విజయం సాధిస్తే ఆర్సీబీ, గుజరాత్ అఫీషియల్‌గా ప్లే ఆఫ్‌లో ఉంటాయి.ఆర్సీబీ.. పంజాబ్ కింగ్స్, సన్‌రైజర్స్‌పై గెలిస్తే 20 పాయింట్లతో టాప్ ప్లేస్‌లో ఉంటుంది. అలా కాకుండా పంజాబ్, సన్‌రైజర్స్ చేతిలో ఓడితే నెట్ రన్‌రేట్‌తో సంబంధం లేకుండా ఆర్సీబీ నిష్క్రమిస్తుంది. ఇక ఆరంభంలో తడబడ్డ గుజరాత్ టైటాన్స్ వరుసగా అయిదు విజయాలతో దూసుకువచ్చింది. రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గితే టాప్ ప్లేస్ ఖాయం. ఒక మ్యాచ్‌లో నెగ్గినా ప్లే ఆఫ్‌లో ఉంటుంది.

### రెండింటిలోనూ రైజింగ్ అయితేనే..

సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రస్తుతం 12 మ్యాచ్‌ల్లో ఏడు విజయాలతో 14 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. ప్లే ఆఫ్ అవకాశాలు మెరుగానగనే ఉన్నా గుజరాత్‌తో మ్యాచ్‌లో బ్యాటింగ్ వైఫల్యం ఆరేంజ్ టీమ్‌ను దెబ్బతీసింది. సన్‌రైజర్స్ ఇంకా రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. 18న సీఎస్‌కేతో చెన్నైలో, 22న ఉప్పల్‌లో ఆర్సీబీతో తలపడనుంది. ఇంటా, బయటా రెండింటిలోనూ తప్పన నెగ్గితేనే ప్లే ఆఫ్ బెర్త్ ఖాయం. ఒక వేళ చెన్నైపై గెలిచి. బెంగళూరు చేతిలో ఓడితే ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సిందే. అలాకాకుండా సీఎస్కేపై ఓడి బెంగళూరుపై విజయం సాధిస్తే అప్పుడు పలు జట్లు 16 పాయింట్లతో పోటీలో ఉంటాయి. నెట్ రన్‌రేట్ కీలకమవుతుంది.

### ఢీలా పడ్డ పంజాబ్ కింగ్స్

లీగ్ ప్రథమార్థంలో దుమ్మురేపిన పంజాబ్ కింగ్స్ వరస ఓటములతో వెనకబడింది. ఆరంభంలో ఆరు విజయాలు.. ఆపై వరసగా ఐదు ఓటములు సర్పంచ్ సాబ్ జట్టు అవకాశాల్ని దెబ్బతీశాయి. ప్రస్తుతం 13 పాయింట్లతో ఉన్న పంజాబ్... మిగతా రెండు మ్యాచ్‌ల్లో తప్పక గెలవాల్సి ఇందే. ఏ ఒక్కటి ఓడినా ప్లే ఆఫ్ కష్టమే.

### రాయల్‌గా ప్లేఆఫ్ చేరాలంటే...

రాజస్థాన్ రాయల్స్ గత రెండు మ్యాచ్‌ల్లో ఓడి వెనకబడింది. ఇంకా మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ప్రస్తుతం 11 మ్యాచ్‌ల్లో ఆరు విజయాలతో 12 పాయింట్ల తో ఉంది. లీగ్ దశ ఆరంభంలో అదరగొట్టిన రాజస్థాన్ రాయల్స్..మూడింటా గెలిస్తేనే ప్లే ఆఫ్స్ చేరుతుంది. ఢిల్లీ, లక్నో, ముంబై.. ఈ మూడింటిపై విజయం సాధిస్తే పరాగ్ సేన 18 పాయింట్లతో ముందంజ వేస్తుంది. ఒకవేళ ఒక మ్యాచ్ ఓడితే 16 పాయింట్లకే పరిమితమవుతుంది. నెట్‌రన్‌రేట్ తక్కువ ఉండడంతో ప్లే ఆఫ్ అవకాశాలు కష్టమే. అందునా రేసులోని మిగతా జట్లు ఓడిపోవాలని కోరుకోవాల్సిందే. సీఎస్‌కే అవకాశాలు అంతంత మాత్రమే. ఆఖర్లో గొప్పగా పుంజుకొని ప్లే ఆఫ్స్ రేసులోకి వచ్చిన చెన్నైకు గత మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ ఇచ్చిన షాక్‌తో రన్‌రేటు తగ్గింది. తదుపరి రెండు మ్యాచుల్లో సన్‌రైజర్స్, గుజరాత్‌పై తప్పక గెలవాల్సిందే. అయినా ప్లే ఆఫ్ చేరుతుందన్న గ్యారంటీ లేదు. మొత్తానికి ఇండియన్ ప్రీమియర్ లీగ్ ప్లే ఆఫ్ బెర్తులు మ్యూజికల్ చెయిర్‌లా ఉత్కంఠ రేపుతున్నాయి.



## 200 వికెట్ల క్లబ్‌లో సిరాజ్

**కోల్‌కతా :** టీమిండియా పేసర్, గుజరాత్ టైటాన్స్ స్టార్ బౌలర్ మహమ్మద్ సిరాజ్.. టీ20 కెరీర్‌లో అరుదైన మైలురాయిని అందుకున్నాడు. కేకేఆర్‌తో మ్యాచ్‌లో అజింక్య రహానేను అవుట్ చేయడం ద్వారా సిరాజ్ 200 వికెట్ల క్లబ్‌లో చేరాడు.ఈ ఘనత సాధించిన 21 భారత బౌలర్‌గా సిరాజ్ నిలిచాడు. మొత్తంగా ఇప్పటి వరకు 174 మ్యాచ్‌లాడిన సిరాజ్.. ఎనిమిదికి పైగా ఏకానమితో రెండు వందల వికెట్లు పడగొట్టాడు. సిరాజ్ తన ఐపీఎల్ కెరీర్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు.2024,2026 టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు సభ్యుడు. వైట్‌బాల్‌తో కూడా తన మార్క్‌ను చూపిస్తున్నాడు.

## ఈడెన్‌లో సిక్సర్ల సునామీ : గుజరాత్‌కు కేకేఆర్ షాక్





**కోల్‌కతా :**ఈడెన్ గార్డెన్స్‌లో పరుగుల సునామీ పారింది. సిక్స్‌ల మోత మోగింది. భారీ స్కోర్ల మ్యాచ్‌లో గుజరాత్‌కు షాకిచ్చిన కోల్‌కతా 29 పరుగుల తేడాతో గెలుపొందింది. ప్లే ఆఫ్ ఆశలను నిలుపుకుంది. మరోవైపు వరుస 5 విజయాలతో దూసుకువచ్చిన గుజరాత్ చివరి మ్యాచ్‌లో తప్పక గెలవాల్సిన పరిస్థితిలో పడింది.

248 పరుగుల భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన సాయి సుదర్శన్(28 బంతుల్లో 53 నాటౌట్), శుభ్‌మన్ గిల్(45 బంతుల్లో 85; 5 ఫోర్లు, 7 సిక్స్‌లు) ఫ్లయింగ్ స్టార్ట్ ఇచ్చారు. ఈ దశలో గాయంతో సుదర్శన్ రిటైర్డ్‌హర్ట్ కాగా, క్రీజ్‌లోకి వచ్చిన నిషాంత్(1) నిరాశపరిచాడు.ఈ దశలో గిల్, జాస్ బట్లర్(35 బంతుల్లో 57, 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) జతకలిశాక స్కోరు టాప్ గేర్‌లో కొనసాగింది. కేకేఆర్ బౌలర్లపై బౌండరీలు, సిక్స్‌లతో విరుచుకుపడుతూ128భాగస్వామ్యం అందించాడు.కీలక దశలో గిల్, బట్లర్ అవుటవడంతో ఆశలు నీరుగారాయి.సాయి మళ్లీ బ్యాటింగ్‌కు వచ్చినా ఫలితం లేకపోయింది. గుజరాత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 218కే పరిమితమైంది.

అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన కోల్‌కతా ఆరంభంలో ఆచితూచి ఆడింది.ఆతర్వాత ఫిన్ అలెన్(35 బంతుల్లో 93;4 ఫోర్లు, 10 సిక్స్‌లు).. గుజరాత్ బౌలర్లను ఊచకోత కోశాడు. సిరాజ్ బౌలింగ్‌లో బ్యాక్ టు బ్యాక్ బౌండరీలతో జోరు మొదలుపెట్టిన అలెన్ ఎక్కడ తగ్గలేదు. రబడ ఓవర్లో బ్యాక్ టు బ్యాక్ సిక్స్‌లు, రషీద్ ఓవర్లో 6, 6, 4.. హోల్డర్ ఓవర్లో రెండు సిక్స్‌లు,అర్షద్ ఖాన్ ఓవర్లో 6, 6, 6, 4తో 22 రన్స్.. ఇలా సిక్స్‌ల మోత మోగించాడు. చివరకు అలెన్‌కు జోరుకు సాయి కిషోర్ తెరదించాడు. ఆ తర్వాత వంతు రఘువంశీ(44 బంతుల్లో 82 నాటౌట్; 4 ఫోర్లు, 7సిక్స్‌లు), కామరూన్ గ్రీన్(28 బంతుల్లో 52 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) వంతయింది. రషీద్ బౌలింగ్‌లో సిక్స్, ఫోర్ కొట్టగా, సాయి కిషోర్ ఓవర్‌లో 6, 4, 6తో గ్రీన్ చెలరేగాడు. ఇక సిరాజ్ వేసిన 19వ ఓవర్లో అయితే రఘువంశీ మూడు సిక్స్‌లు, ఓ ఫోర్‌తో 25 రన్స్ సాధించాడు. ఇద్దరూ అర్ధసెంచరీలతో సహా మూడో వికెట్‌కు 108 జోడించారు.దీంతో కేకేఆర్ 20ఓవర్లలో 2వికెట్లకు 247 రన్స్ చేసింది. మొత్తంగా కేకేఆర్ ఇన్నింగ్స్‌లో 22 సిక్సర్లు నమోదు అయ్యాయి.



## ఫైనల్లో సాత్విక్, చిరాగ్ జోడీ

**బ్యాంకాక్:** థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ జోడీ ఫైనల్లో ప్రవేశించింది. సాత్విక్ సాయిరాజ్ -చిరాగ్‌శెట్టి జోడీ అద్భుత ప్రదర్శన కొనసాగుతోంది.సెమీస్‌లో మలేషియా జోడీపై 19-21, 22-20, 21-16తో గెలుపొందింది. ఈ సీజన్‌లో తొలిసారి ఫైనల్ చేరింది. తొలి సెట్‌ను మలేషియా జోడీ గోజెఫీ-నూర్ ఇజ్జుద్దీన్ 21-19తో నెగ్గి శుభారంభం చేసింది. ఆ తర్వాత అద్భుతంగా పుంజుకున్న భారత జోడీ రెండో సెట్‌ను 22-20తో కైవసం చేసు సమవుజ్జీగా నిలిచింది.

మ్యాచ్‌ను తేల్చే మూడో సెట్‌లో భారత జోడీ దూకుడు ప్రదర్శించి 21-16తో సెట్‌ను, మ్యాచ్‌ను ముగించింది. ఇటీవలి థామస్ కప్‌లో పతకం సాధించిన సాత్విక్-చిరాగ్ జోడీ... డబుల్స్ టైటిల్ దిశగా దూసుకుపోతున్నారు. కాగా మహిళల, పురుషుల సింగిల్స్‌లో భారత్ సవాల్ ఇప్పటికే ముగిసింది.

### ఒత్తిళ్లు ఎదురైనా...

# ఐటి డివిడెండ్లు ఎక్కువే!




**ముంబయి, మే 16:**కృత్రిమమేధ వినియోగానికి భారత ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగం కుదేలయింది.ఎఐ టూల్స్ మానవవనరులతోచేసే పనులన్నీ చక్కబెట్టేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఐటీ స్టాక్స్ కూడా అన్నీ భారీగా పతనం అవుతున్నాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ గత నెలలోనే 12 శాతం పడిపోయింది. టీసీఎస్ నుంచి ఇన్ఫోసిస్, విప్రో, టెక్ మహీంద్రా ఇలా అన్నీ స్టాక్స్ ఆల్ టైమ్ కనిష్ఠాలకు పతనం అయ్యాయి. అయితే ఒడుదొడుకుల్లోనూ ఐటీ సంస్థలు డివిడెండ్లు ప్రకటించాయి. డివిడెండ్‌సొమ్ము నేరుగా షేర్ హోల్డర్ల అకౌంట్లలోనే వేస్తారు. నాలుగో త్రైమాసికంలో టిసిఎస్‌సర్వీసెస్ ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.31 చొప్పున ఫైనల్ డివిడెండ్ ప్రకటించింది. ఆర్థిక సంవత్సరం మొత్తానికి చూస్తే రూ. 110 డివిడెండ్ ఇచ్చింది. తుది డివిడెండ్ చెల్లింపులకు రికార్డ్ తేదీ మే 25గా నిర్ణయించింది. రెండో అతి పెద్ద ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.25 చొప్పున ఫైనల్ డివిడెండ్ ప్రకటించింది. ఈ డివిడెండ్ చెల్లింపులకు రికార్డ్ డేట్ జూన్10గా నిర్ణయించింది.జూన్25 లోపు చెల్లింపులు చేయనున్నట్లు వెల్లడించింది. భారత మూడో అతిపెద్ద ఐటీ సంస్థ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఒక్కో ఈక్విటీ షేరుకు రూ. 24 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఈ డివిడెండ్ చెల్లింపులకు రికార్డ్‌డేట్ 2026, ఏప్రిల్ 25గా నిర్ణయించింది. మే 5 లోపే పేమెంట్లు చేసింది. ఎల్‌టీఐ మైండ్‌ట్రీ లిమిటెడ్ ఇంకా రికార్డు స్థాయిలో డివిడెండ్ ఆఫర్ చేసింది. జనవరి మార్చి త్రైమాసికంలో ఒక్కో ఈక్విటీ షేరుకు రూ. 53 చొప్పున ఫైనల్ డివిడెండ్ ప్రకటించింది. రికార్డ్ డేట్ మే25గా నిర్ణయించింది.

### టెక్ మహీంద్రా లిమిటెడ్..

టెక్ మహీంద్రా కూడా ఆఖరి త్రైమాసికంలో ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.36చొప్పున డివిడెండ్ ప్రకటించింది.జులై3లోపు షేర్లు ఉన్న వారికి డివిడెండ్ వస్తుంది. ఇదే రికార్డ్ డేట్. టెక్ మహీంద్రా షేర్‌ధర ప్రస్తుతం రూ.1367.50గా ఉంది.ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సాఫ్ట్‌వేర్ ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సాఫ్ట్‌వేర్ అమెరికా ఒరాకిల్ సంస్థ భారత సబ్సిడరీ ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సాఫ్ట్‌వేర్ ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.270 చొప్పున అందించనున్నట్లు పేర్కొంది. దీనికి రికార్డ్ డేట్ మే 7గా ప్రకటించగా.. మే 21 లోపు చెల్లింపులు చేయనున్నట్లు తెలిపింది. ఓఎఫ్‌ఎస్‌ఎస్ షేర్ ధర రూ. 90-20 గా ఉంది. టాటా గ్రూప్‌కు చెందిన టాటా ఎల్క్సీ లిమిటెడ్ ఫైనల్ డివిడెండ్ ఒక్కో ఈక్విటీ షేరుకు రూ. 75 చొప్పున అందిస్తోంది.ఇంకా రికార్డ్ డేట్, పేమెంట్ షెడ్యూల్ కూడా పేర్కొనలేదు. వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించి..ఈడేట్లను ప్రకటించనుంది.టాటా ఎల్క్సీ షేరు 4127గా ఉంది. పర్సిస్టెంట్ సిస్టమ్స్ కూడా ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.18 చొప్పున ఫైనల్ డివిడెండ్ ఆఫర్ చేసింది.మొత్తం సంవత్సరంలో డివిడెండ్ రూ. 40 గా ఉంది.కేపీఐటీ టెక్నాలజీస్ ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.5.25 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది.దీని ఫేస్‌వాల్యూలో ఇది 52.5 శాతంగా ఉంది. మధ్యంతర డివిడెండ్ ఒక్కో ఈక్విటీ షేరుకు రూ. 2.25 చొప్పున నిర్ణయించింది.

### లాభాల్లో ఉన్నా.. ఎడ్యూ ప్లాట్‌ఫామ్ మూసివేత

# ఫిన్ ఇన్ఫ్లూయెన్సర్ సంచలన నిర్ణయం



**ముంబయి, మే 16:** ప్రముఖ ఫిన్‌ఫ్లుయెన్సర్, కంటెంట్ క్రియేటర్ అంకుర్ వారికూ సంచలన నిర్ణయం తీసుకున్నారు.తాను నిర్వహిస్తున్న ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫామ్‌ను మూసివేస్తున్నట్లు ప్రకటించారు.ఆరేళ్లుగా ఆర్థికంగా బలంగా ఉండి, భారీలాభాలు ఆర్జిస్తున్నప్పటికీ,ఈ వ్యాపారాన్ని ఇకపై కొనసాగించడంలో అర్థం లేదని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 2020లో ప్రారంభమైన ఈఅప్‌స్కిల్లింగ్ కోర్సుల వ్యాపారం అనూహ్య విజయం సాధించింది. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా ఇప్పటివరకు మొత్తం 100కోట్ల అమ్మకాలు జరిగాయని, రూ.25 కోట్ల నికర లాభం వచ్చిందని వారికూ స్వయంగా తెలిపారు.5లక్షల మంది విద్యార్థులు. 100 కోట్ల అమ్మకాలు. 25 కోట్ల లాభాలు. కానీ, దీన్ని కొనసాగించడంలో అర్థం లేదని ఆయన సోషల్ మీడియాలో రాసుకొచ్చారు. భారీ లాభాలు గడిస్తున్న వ్యాపారాన్ని ఎందుకు మూసివేస్తున్నారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.ఈ నిర్ణయం వెనుక ఉన్న పూర్తి కారణాలు, భవిష్యత్ ప్రణాళికల గురించి వీడియోలో వివరిస్తానని వారికూ తెలిపారు. దీని కోసం రిమైండర్ సెట్ చేసుకోవాలని తన ఫాలోయర్లను కోరారు. ఆయన నిర్ణయం వెనుక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం ఉందనే ఊహాగానాలు బలపడుతున్నాయి. దీనిపై ఒక యూజర్ ప్రశ్నించగా, వారికూ పరోక్షంగా అంగీకారం తెలిపారు.దాని ప్రభావం ఉండాలి. ఉంది కూడా అని సమాధానమిచ్చారు.ఏఐటూల్స్ కారణంగా విద్య, నైపుణ్యాలు నేర్చుకోవడం మరింత సులభతరం కావడంతో తన కోర్సుల వ్యాపారానికి భవిష్యత్తు ఉండదనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. అంకుర్ వారికూ డిజిటల్ ప్రపంచంలో సుపరిచితుడు.కొత్తవ్యాపారాన్ని ప్రారంభించేందుకే ఈ హైప్ క్రియేట్ చేస్తున్నారని కొందరు విమర్శిస్తున్నారు. ఇప్పటికే రూ.100 కోట్లు సంపాదించాక, వ్యాపారం కొనసాగించడంలో అర్థం లేదనడం కరెక్టే అని మరికొందరు వ్యంగ్యంగా కామెంట్లు పెడుతున్నారు.




### ధరలపెంపుతో చమురు కంపెనీలకు..

# రూ.53 వేల కోట్ల ఊరట

**ముంబయి, మే 16:** పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలను లీటర్‌కు రూ.3 చొప్పున పెంచడం వల్ల ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు సుమారు రూ.52,700 కోట్ల వరకు ఉపశమనం కలుగుతుందని ఎస్‌బీఐ రీసెర్చ్ తన నివేదికలో ప్రస్తావించింది.శనివారం విడుదల చేసిన ఈనివేదిక ప్రకారం 2027ఆర్థిక సంవత్సరంలో ఆయిల్‌కంపెనీలు ఎదుర్కోనున్న మొత్తం నష్టాల్లో ఈ ఉపశమనం దాదాపు 15 శాతానికి సమానం. అంతర్జాతీయంగా బ్రెంట్ ముడి చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ, దేశంలో రిటైల్ ధరలను స్థిరంగా ఉంచడంతో ఆయిల్ కంపెనీలు రోజుకు రూ.1,000 కోట్లు, ఏడాదికి సుమారు 3.6 లక్షల కోట్ల నష్టాలను చవిచూస్తున్నాయని ప్రభుత్వ అంచనా. తాజా పెంపుతో ఈ నష్ట భారాన్ని కొంతమేర తగ్గించుకునేందుకు అవకాశం లభించింది. ఈ ధరల పెంపు వల్ల ఇంధన వినియోగంపై దీర్ఘకాలిక ప్రభావం ఉండదని ఎస్‌బీఐ రీసెర్చ్ స్పష్టం చేసింది. ధరలు పెరిగిన వెంటనే వినియోగం తగ్గినా, ఏడాదిలోపే తిరిగి పుంజుకుంటుందని గతగణాంకాలు సూచిస్తున్నాయని వివరించింది.అయితే, మేజూన్ 2026 నెలల్లో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ద్రవ్యోల్బణంపై 15-20 బేసిస్ పాయింట్ల తక్షణ ప్రభావం ఉండొచ్చని, దీంతో 2027ద్రవ్యోల్బణం అంచనాను 4.7 శాతానికి సవరిస్తున్నట్లు పేర్కొంది. రూపాయి విలువ క్షీణించడం ఈ ప్రయోజనాలకు గండికొట్టే ప్రమాదం ఉందని నివేదిక హెచ్చరించింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ మరో రూ. 2 పతనమైతే, ధరల పెంపు ద్వారా వచ్చే లాభం పూర్తిగా హరించుకుపోతుందని స్పష్టం చేసింది. రూపాయి విలువ ఇప్పటికే ప్రమాదకర స్థాయికి చేరుకున్నందున, మరింత బలహీనపడితే ఇంధన ధరల పెంపు లక్ష్యం నెరవేరదని అంచనావేసింది.

### ఆరు నెలల గరిష్టానికి...

# దేశంలో నిరుద్యోగం

**న్యూఢిల్లీ, మే 16:** దేశంలో నిరుద్యోగిత రేటు మళ్లీ పెరిగింది. ఈ ఏడాది ఏప్రిల్ నెలకు గాను నిరుద్యోగిత రేటు ఆరు నెలల గరిష్ఠ స్థాయికి అంటే 5.2 శాతానికి చేరింది. మార్చిలో ఇది 5.1 శాతంగా ఉంది. ఇదే సమయంలో పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం 12 నెలల కనిష్ఠానికి తగ్గడం గమనార్హం. కేంద్ర అర్థగణాంక,పథక నిర్వహణశాఖ మోస్పి విడుదల చేసిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్‌ఎఫ్‌ఎస్) నెలవారీ బులెటిన్‌లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఈసారి నిరుద్యోగిత రేటు పెరుగుదలకు పూర్తిగా గ్రామీణ ప్రాంతాలే కారణమయ్యాయి. గ్రామాల్లో నిరుద్యోగిత రేటు మార్చిలోని 4.3శాతం నుంచి ఏప్రిల్‌లో 4.6శాతానికి పెరిగింది.పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం 6.8 శాతం నుంచి 6.6 శాతానికి తగ్గింది.ఇది ఏప్రిల్ 2025 తర్వాత నమోదైన అత్యల్ప స్థాయి. పట్టణాల్లోని ఈ సానుకూలత ముఖ్యంగా మహిళల విషయంలో ఎక్కువగా కనిపించింది. పట్టణ మహిళల నిరుద్యోగిత రేటు మార్చిలోని 9.0 శాతం నుంచి ఏప్రిల్‌లో 8.5 శాతానికి తగ్గింది. ఇది కూడా ఏడాది కనిష్ఠం. పట్టణ పురుషుల నిరుద్యోగం 6.1 శాతం నుంచి 5.9 శాతానికి తగ్గింది. అయితే జాతీయ స్థాయిలో చూస్తే, మహిళలు ఇప్పటికీ ఉపాధి మార్కెట్లో సవాళ్లను ఎదుర్కొంటున్నారు. దేశవ్యాప్తంగా మహిళల నిరుద్యోగిత రేటు మార్చిలోని 5.3 శాతం నుంచి ఏప్రిల్‌లో 5.4 శాతానికి పెరిగింది. పురుషుల నిరుద్యోగిత రేటు కూడా 5.0 శాతం నుంచి 5.1శాతానికి స్వల్పంగా పెరిగింది. నిరుద్యోగం పెరగడంతో పాటు, కార్మిక శక్తి భాగస్వామ్య రేటు కూడా తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. 15 ఏళ్లు పైబడిన వారిలో ఎల్‌ఎఫ్‌పీఆర్ మార్చిలో 55.4 శాతంగా ఉండగా, ఏప్రిల్‌లో 55.0 శాతానికి పడిపోయింది.అలాగే, శ్రామిక జనాభా నిష్పత్తి కూడా 52.6నుంచి 52.2 శాతానికి క్షీణించింది. ముఖ్యంగా మహిళల కార్మిక భాగస్వామ్య రేటు ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయి అయిన 33.9 శాతానికి పడిపోయింది. ఈ గణాంకాలు పట్టణాల్లో ఆర్థిక కార్యకలాపాలు మెరుగ్గా ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాలు ఇప్పటికీ ఉపాధి కల్పనలో ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని స్పష్టం చేస్తున్నాయి.



## వొడాఫోన్ రాబడులు రూ.11,332 కోట్లు

**ముంబయి, మే 16:** ప్రైవేటు టెల్కో కంపెనీ వొడాఫోన్ ఐడియా నాలుగోత్రైమాసికంలో రూ. 51,970 కోట్ల రూపాయలు లాభం స్వీకరించింది. గత ఏడాది ఇదే కాలంలో రూ.5286 కోట్లు నష్టంలో ఉన్న కంపెనీ లాభాల్లోకి ర్యాలీతీసింది. సర్దుబాటు చేసిన స్థూల రాబడి ఏకకాలపు సర్దుబాటుతో లాభాల్లో కూడా వృద్ధి కనిపించింది. ప్రతి కస్టమరుకు సగటు రాబడి రూ.175 నుంచి రూ.190కి పెరిగింది. 8.3శాతం పెరిగినట్లు కంపెనీ ప్రకటించింది. రాబడులు కూడా 11,323 కోట్లనుంచి రూ.11,332 కోట్లకు చేరింది. ఎబిడిటా కూడా 4817 కోట్లనుంచి రూ.4889 కోట్లకు చేరింది. సూర్యజా ఇన్వెస్ట్‌మెంట్స్ సింగపూర్‌సంస్థనుంచి ఆదిద్యబిర్లాగ్రూప్ ద్వారా టెల్కో రూ.430 కోట్లమేర వారంట్లను కూడా రాబట్టింది. ఒక్కో వారంట్‌కు రూ.11గా ఉంటుంది. గరిష్టంగా ప్రాధాన్యతా క్రమంలో రూ.4730 కోట్లుగా ఉంటుందని కంపెనీ ప్రకటించింది. వొడాఫోన్‌షేర్లు 0.15శాతం క్షీణించి రూ.12.95గా ట్రేడ్ అయ్యాయి. ఎన్‌ఎస్ఇ నిఫ్టీలో 0.19శాతం క్షీణించినట్లు తేలింది.

## ఎన్‌హెచ్‌పిసి నికరలాభం రూ.422.46 కోట్లు

**ముంబయి, మే 16:** ప్రభుత్వరంగంలోని ఎన్‌హెచ్‌పిసి నికర లాభాలు నాలుగో త్రైమాసికంలో 68శాతంపెరిగాయి. 1549.42 కోట్లకు చేరినట్లు కంపెనీ ప్రకటించింది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో 919.63 కోట్లుమాత్రమే సాధించిన కంపెనీ ఈ ఏడాది నాలుగో త్రైమాసికంలో68శాతం నికరలాభాలను పెంచుకోగలిగింది. మొత్తం రాబడులపరంగాచూస్తే నాలుగోత్రైమాసికంలో 2557.71 కోట్లనుంచి రూ.3120.52 కోట్లకు చేరాయి. వార్షిక లాభాలు రూ.3411.73 కోట్లనుంచి 4220.46 కోట్లుగా ఉన్నాయి. మొత్తం రాబడులు చూస్తే సాలీనా 11,614.61 కోట్లనుంచి రూ.12,686.09 కోట్లవరకూ పెరిగినట్లు కంపెనీ ప్రకటించింది. ప్రతి ఈక్విటీ వాటాకు బోర్డు 21 పైసల డివిడెండ్‌ను ప్రకటించింది. మొత్తం 1850 మెగావాట్ల సామర్థ్యంతోమూడు ప్రాజెక్టులుప్రారంభించామని కంపెనీ ప్రకటించింది. కంపెనీ 2025-26 సంవత్సరంలో 23307 మిలియన్ యూనిట్లు ఉత్పత్తిని సాధించినట్లు వెల్లడించింది. ఎన్‌హెచ్‌పిసి తన అనుబంధ సంస్థలు, జాయింట్ వెంచర్లు అన్నింటితోను కలిపి మొత్తం 9333 మోగావాట్ల సామర్థ్యంతో ఉంది. మొత్తం 31 విద్యుత్‌స్టేషన్లు,మరో 17 ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని కంపెనీ వివరించింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942-271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.